# టిసిపార్డ్

# TSIPARD




సంపుటి : 8    సంచిక : 8

సెప్టెంబర్ 2016



ఎడిటర్

**అనిత రామచంద్రన్,** ఐ.ఏ.ఎస్.

సిఇఓ, టిసిపార్డ్

ఎడిటోరియల్ బోర్డు

**కె.యాదయ్య**

**బి. శేషాద్రి**

**కె. మాధురి**

**డా॥ జి. ఆంజనేయులు**

**పి. వెంకటరామిరెడ్డి**

**బి. నరేంద్రనాథ్ రావు**

**ఎ.నాగేశ్వరరావు**

**డా॥కె.అసయ్య**

కాన్సెప్ట్, ప్లానింగ్,
ఎడిటింగ్, డిజైనింగ్

**సెంటర్ ఫర్ మీడియా పబ్లికేషన్స్,**
**టిసిపార్డ్. మరియు**
**నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్**
హైదరాబాద్



ప్రచురణ

**టిసిపార్డ్**

రాజేంద్రనగర్
హైదరాబాద్ - 500 030
తెలంగాణ, ఇండియా.



ఫోన్ : 040 - 24018656
ఫ్యాక్స్ : 040 - 24017005
E-mail:editorsthanikapalana@gmail.com
Website: www.tsipard.gov.in



ఈ సంచికలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికిగాని, టిసిపార్డ్‌కిగాని చెందినవిగా భావించనక్కరలేదు


# విషయ సూచిక


సంపాదకీయం .......... 4

సంసద్ ఆదర్శ గ్రామము వీర్నపల్లి .......... 5

భ్రూణ హత్యలు-సామాజిక రుగ్మత .......... 9

సమగ్ర మూల్యాంకనమే విద్యకు ప్రోత్సాహం .......... 11

విద్య వికాసానికి తోడ్పడుతుంది .......... 13

ప్రజాకవి కాళోజీ నారాయణరావు .......... 14

షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల ఉప ప్రణాళిక స్థానిక అభివృద్ధి ప్రణాళిక .......... 15

రైతుకు మేలు చేసే కొన్ని వ్యవసాయ సూచనలు .......... 19

కాలాన్ని బట్టి మారాలె! .......... 20

తెలంగాణ సాహిత్య రంగంలో ప్రముఖులు .......... 22

విద్య- జాతి పునర్నిర్మాణం .......... 25

ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెరగాలి .......... 27

సంపూర్ణ అకరాస్యత సాధ్యమే .......... 28

సానుకూల ఫలితాలిస్తున్న పల్లె సమగ్ర సేవా కేంద్రాలు .......... 30

ధీర వనిత ఐలమ్మ .......... 31

ఫలిస్తున్న మిషన్ కాకతీయ పూడికతీసిన చెరువులకు జలకళ .......... 32

సూక్ష్మనీటి సాగుపద్ధతి .......... 34

బీమాతో ధీమా... .......... 35

పంచాయతీ పాలనలో మహిళలు చతురత .......... 37

గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం .......... 39

పల్లెల జీవన విధానంపై సంస్కరణల ప్రభావం .......... 41

గ్రామజ్యోతి స్ఫూర్తితో మెంటెపల్లి ఆదర్శ గ్రామంగా ఎంపిక .......... 43

అక్షరమే ఆయుధం .......... 48

గ్రామాల ప్రగతే గీటురాయి .......... 50

జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం .......... 51

మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు/ ఉపాధ్యక్షులు విధులు - బాధ్యతలు .......... 52

నైతిక విలువలు .......... 54

జాతీయ పోషణ వారోత్సవాలు-2016 .......... 59

పేద మహిళలకు ఊతం ఉజ్వల యోజన పథకం .......... 61

అక్షరాస్యత వృద్ధికి అవరోధం కాని పేదరికం .......... 63

వడివడిగా అడుగులు... ఉద్యమ స్ఫూర్తితో పరుగులు .......... 65

సంపాదకీయం

# గ్రామీణాభివృద్ధికి విద్య కూడ ఒక కీలకాంశం

"భారతదేశంలో బీదప్రజల పరిస్థితే అన్ని సమస్యలకు మూలకారణము. మన అణగారిన వర్గాలకు ముఖ్యంగా చేయవలసినది వారికి విద్యనిచ్చి వారు పోగొట్టుకొన్న వ్యక్తిత్వాన్ని పెంపొందింపజేయటమేనని స్వామి వివేకానంద అన్నారు. నిస్వార్థపరులైన వ్యక్తులు గ్రామగ్రామాలకు, కెమెరా, గ్లోబు, మ్యాపులు మొదలైన పరికరాలతో వెళ్లి అవసరమైన జ్ఞానాన్ని, సమాచారాన్ని అందించాలి. వివిధ రకాలైన భావాలను, ఆలోచనా సరళులను వారికందించి స్వావలంబన దిశలో వారు తమ ఆలోచనాశక్తిని ఉపయోగించేందుకు సాయపడాలి.

"ప్రజలకు తమను తామే అభివృద్ధి చేసుకొనే మార్గాలు బోధించకుండా ప్రపంచములోని సంపదనంతా ధారవోసినా భారతీయ గ్రామం బాగుపడదు". ప్రజోపయోగార్థము తెచ్చిన చట్టాలతో పాటు ఈనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. దాదాపు అన్ని పథకాలని అమలులో పంచాయతీరాజ్ సంస్థలకు ముఖ్యమైన పాత్ర ఉంటుంది. తమ తమ పరిధిలో ఈ స్థానిక సంస్థలు ప్రజాభాగస్వామ్యముతోనే తమకు నిర్దేశించిన పాత్రను నిర్వహించాల్సి ఉంది. ప్రతి ఒక్క పౌరుని భాగస్వామ్యముతో సమిష్టిగా ప్రణాళికల రచనకాని, అమలుకాని, పర్యవేక్షణకాని జరగాల్సి ఉంది.

ఇవన్నీ సక్రమమైన రీతిలో జరగాలంటే ప్రజలలో పథకాల గురించి తమ గ్రామ అవసరాల గురించి, ప్రాధాన్యతల గురించి మార్గాంతరాల గురించి తమ హక్కులతో పాటు బాధ్యతల గురించి కొంతమేరకైనా అవగాహన ఉండాలి. అంతేకాకుండా పారిశుద్ధ్యము, విద్య, వైద్యము, త్రాగునీరు మరియు ఆహార పదార్థాల నాణ్యత, మాతాశిశు సంరక్షణ, ఇత్యాది పలు అంశాలపైన కూడా సరైన అవగాహన ఉండాలి.

కానీ దీనికి నిరక్షరాస్యత ఒక ప్రతిబంధకము. నేడు తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో సగటున అక్షరాస్యత స్థాయి 57.30% ఈ శాతాన్ని పెంచుకోవలసిన అవసరము ఎంతైనా ఉంది. ఈ దృక్పథముతోనే 73వ రాజ్యాంగ సవరణలో గ్రామపంచాయతీలకు వికేంద్రీకరించిన అంశాలలో పాఠశాల విద్య కూడా ఉంది. పురుషుల్లో అక్షరాస్యతతో పాటు మహిళ అక్షరాస్యత, బాలురతో పాటు బాలికల విద్యకు కూడా సమాన ప్రాముఖ్యత ఉంది. ఒక రకంగా చూస్తే మహిళలు, బాలికల విద్య ఇంకా ఎక్కువ ప్రాముఖ్యత ఉంది. ఎందుకంటే ఒక బాలుడికి విద్యనేర్పితే సాధారణంగా అది అతనికి మాత్రమే పనికి వస్తుంది. కాని ఒక బాలిక విద్యావంతురాలైతే మున్ముందు దాని ప్రయోజనం మొత్తం కుటుంబంపైనే ఉంటుంది.

కనుక తెలంగాణ రాష్ట్రంలోని వివిధ స్థాయిల్లోని పంచాయతీరాజ్ సంస్థలు తమ తమ పరిధిలో విద్య, విద్యాసంస్థల పట్ల తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మన రాష్ట్రంలో అక్షరాస్యత శాతము పెరిగేటట్లు చర్యలు తీసుకొంటాయని ఆశిద్దాం.

(అనిత రామచంద్రన్)

# సంసద్ ఆదర్శ గ్రామము వీర్నపల్లిని
## సందర్శించిన కేంద్ర బృందం



**క**రీంనగర్ జిల్లా కేంద్రమునకు 82 కి.మీ. దూరంలో గల వీర్నపల్లి గ్రామం ఎల్లారెడ్డిపేట మండలం యందు 3624 జనాభా కలిగి (స్త్రీలు 1889, పు॥ 1795) ఉండి దట్టమైన అడవి మార్గంలో ఒకప్పుడు నక్సలైట్స్ స్థావరంగా అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గ్రామం పది లంబాడ తండాలతో చాలా వెనుకబడిన గ్రామం నాడు.

ఈ గ్రామాన్ని గౌ॥ పార్లమెంట్ సభ్యులు బి.వినోద్‌కుమార్ గారు ఎం.పి సంసద్ ఆదర్శ గ్రామ్ యోజన (SAGY) కింద దత్తత తీసుకొన్నారు. భారతదేశంలో ఎంపిలు మొదటి విడతగా 705 గ్రామాలను దత్తతకు ఎంపిక చేసుకొని ప్రగతికి శ్రీకారం చుట్టారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం జాతీయస్థాయిలో జరిపిన సమీక్ష ప్రకారం వీర్నపల్లి 20వ స్థానంలో A+ గ్రేడును సాధించింది.

ఢిల్లీ నుండి వచ్చిన కేంద్ర పరిశీలనా బృందం సంసద్ ఆదర్శ గ్రామ్ యోజన సంచాలకులు (SAGY Director) శ్రీ డా॥ కుశాల్ పటక్ గారు వీర్నపల్లి గ్రామాన్ని సందర్శించినారు. ఈ బృందం ముగ్గురు సభ్యులు డా॥ సతీష్, రాజన్‌సిన్హా, అమిత్‌జైన్‌లు జిల్లా కలెక్టర్ శ్రీమతి నీతూప్రసాద్ గారు, SAGY ఇంచార్జి ఆఫీసర్ శ్రీ గౌతమ్‌రెడ్డి గారు అన్ని ప్రభుత్వ శాఖల మండల/ గ్రామస్థాయి అధికారులు అట్లే గౌ॥ మంత్రివర్యులు కె.తారకరామారావు గారు, ఎంపి బి.వినోద్‌కుమార్ గారు, జెడ్పిటిసి తోట ఆగయ్య గారు, ఎంపిపి సుజాత గారు, సర్పంచ్ సంజీవలక్ష్మి, ఎంపిటిసి బోడ లక్ష్మి, డెయిరీ ఛైర్మన్ రాజేశ్వర్‌రావులతో చర్చించారు.

గ్రామంలో సామాజిక సమీకరణ, గతంలో నిర్వహించిన పలుసభలు, సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, పి.ఆర్.ఎ. ఛాయాచిత్రాలు (సామాజిక, వనరుల చిత్రపటములు) చూసి, ప్రజల భాగస్వామ్యం ప్రభుత్వ పథకాల అమలు, స్థానిక వనరుల వినియోగించిన తీరుపై ప్రత్యక్షంగా క్షేత్రస్థాయి సందర్శనలో పరిశీలించారు. అవి

1. గ్రామంలో 100% పిల్లలు బడిలో చేర్పించటమే కాకుండా 100% విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న సన్నబియ్యం భోజనం చేస్తున్నారు. గ్రామజ్యోతిలో ఏర్పడిన విద్యా కమిటీ వారితో పాఠశాల కమిటీ వారితో సమీక్ష నిర్వహించి చాలా సంతృప్తి వ్యక్తం చేశారు.
2. వయోజన విద్యతో ప్రయోజనాలు చేకూర్చి గ్రామంలో 100% అక్షరాస్యత (నిరక్షరాస్యులు పు:683, స్త్రీ:492) సాధించటంతో పాటు ప్రజలలో వ్యక్తిగత విలువలు, పౌరుల బాధ్యతలు, ప్రభుత్వ పథకాలలో అవగాహన – లబ్దిపొందే వరకు భారత్ నిర్మాణ్ వాలంటీర్స్‌తో చేయూతనందించి వారి గత ప్రవర్తనలో మార్పుకు విశేష కృషిని కొడియాడారు. జయశంకర్ గారిని, ఎమ్.రాజం ఎమ్.డబ్ల్యు, రాంరెడ్డి సూపర్‌వైజర్‌ను అభినందించారు.
3. ప్రభుత్వ వైద్యశాలను, అక్కడి సౌకర్యాలను, వారు నిర్వహించిన పలు ఆరోగ్య శిబిరాల ఫోటోలను, వారు నిర్వహించిన కుటుంబ ఆరోగ్య సర్వే వివరాలు ప్రతి ఇంటికి 'ఆరోగ్య కార్డులు పంపిణీ', కిశోర బాలికల ప్రత్యేక శిక్షణలు, రక్తపరీక్షలు, కంటి అద్దాలు పొందిన లబ్దిదారులపై చర్చ చేసినారు. గర్భిణీలు వైద్యశాలలో ప్రసూతి 100% వాక్సినేషన్, పాఠశాల (PS-VPS)లోని పిల్లలు చేతులు కడుగుకొనుట, పరిశుభ్రంగా యుండటం, క్రమశిక్షణతో మెలగటం ప్రతిరోజు సాయంత్రం ఆటలు ఆడటంను పరిశీలించారు.
4. సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం – అంగన్‌వాడీ కేంద్రాలు 7. ప్రస్తుతం 3 కేంద్రాలు పాఠశాలలో నడుస్తున్నాయి. అద్దె భవనాలలో 3 నడుస్తున్నాయి. వీటికి ప్రభుత్వం నుండి నిధులు



మంజూరు అయి 1 ఎస్సీ కాలనీ, 1 భూక్యానాయక్ తండా, 1 గోన్యానాయక్ తండాలలో నిర్మాణాలు పూర్తికాబడుచున్నవి. వీటి ప్రగతి నాణ్యత చూసినారు. రాశిగుట్ట తండాలో బాలబడి ద్వారా పిల్లలకు మరియు తల్లులకు అనుబంధ పోషకాహారము, ఆరోగ్యలక్ష్మి పథకములో ఒక్కపూట సంపూర్ణ భోజనము, ఆట, పాటల ద్వారా నాణ్యమైన విద్యను, పోషణ-ఆరోగ్య విద్యపై తల్లులకు భోదనపై పలు ప్రశ్నలు అడిగి గ్రామసభలో సమీక్ష చేశారు.

5. గ్రామంలో సందర్శన చేస్తూ సామాజిక భద్రత - పెన్షన్స్ వివరాలు తెలుసుకొన్నారు. గ్రామంలో మొత్తం 500 పెన్షన్‌దారులకు గాను ప్రతినెల రూ.5,32,500 చెల్లిస్తున్నారు. ఇందులో మునలివారు, నేత, విధవ, వికలాంగులు, కల్లుగీత, బీడి వర్కర్స్ కలరు. వీరిలో కొందరిని ప్రత్యక్షంగా కలిసి ప్రయోజనం పొందుతున్న తీరును గమనించి తెలంగాణ ప్రభుత్వంను ప్రశంసించారు. వృద్ధులకు, నిస్సహాయ నిరుపేదలకు, దివ్యాంగులకు పెన్షన్ ఎంతో చేయూతనందిస్తున్నట్లు పేర్కొన్నారు.

6. మహిళల-యువత బ్రతుకుతెరువులపై సమీక్ష చేశారు. 5 గ్రామైఖ్య సంఘాలతో 80 SHGలతో, 1109 మంది సభ్యులతో 100% మహిళలు (ఎస్సీ-233, ఎస్టీ-479, బిసి-355, ఓసి-42) స్వశక్తి సంఘాలలో చేరి ఆర్థికంగా ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు - బ్యాంకు లింకేజి-2015 సం॥రములో 76000 లక్షలు ఋణ సదుపాయం పొంది కృషిమార్ట్, గాజుల దుకాణాలు, చిన్న చిన్న వ్యాపారాలు, అట్లే ఎస్సీ/ఎస్టీ నిరుపేద మహిళ రైతులకు 6 యూనిట్స్ సుస్థిర వ్యవసాయ - జీవనోపాదులలో భాగంగా కూరగాయలు - పందిరిలు నిర్మాణంలో 65 మందికి ఉపాధి కల్పిస్తూ ఆహారం-ఆరోగ్యం పెంపుదలకు కృషి చేస్తున్న విధానం గమనించడం విశేషం. 'పల్లె ప్రగతి'లో పెరటి కోళ్ళపెంపకం, గొర్రెల/మేకల పెంపకం యూనిట్స్‌ను పరిశీలించారు.

లంబాడా, హరిజన మహిళలు ఎక్కువగా ఉన్న ఈ గ్రామంలో మొత్తం కుటుంబాలు 640. గతంలో ఉన్న ISL లు 400 ఈ సం॥రం స్వశక్తి మహిళలు, యువజన సంఘాలు, భారత్ నిర్మాణ్ వాలంటీర్స్ (38), గ్రామ, మండలస్థాయి అధికారుల సమన్వయంతో IEC నిర్వహించి ట్రిగ్గరింగ్ - కళజాతతో చైతన్యపరచి 100% IHHLS ను నిర్మించి గ్రామంలోని ప్రతి మహిళ వినియోగించేలా చేసి వారి ఆత్మగౌరవం పెంపొందించారు. ఈ గ్రామంను గాంధీ జయంతి (అక్టోబర్ 2, 2015)న మాన్యశ్రీ కె.తారక రామారావు గారు, శ్రీ బి.వినోద్‌కుమార్ గారు, అధికారులు, ప్రజల సమక్షంలో ODF గ్రామంగా ప్రకటించినారని తెలిపారు.

స్త్రీనిధి ద్వారా ఆదాయ మార్గాల కోసం 66.30 లక్షలు (వ్యవసాయ, స్వయం ఉపాధి, చిన్న వ్యాపారాలు, విద్య, డైరీ, వివాహము) SHG సభ్యులు వినియోగించుకున్నారు. ఋణాల చెల్లింపు 100% చేసి TFA+ ఋణం పొందుతున్నారని APM మల్లేశం గారు వివరించారు.

గ్రామంలో నిరుద్యోగ యువత 125 మంది గుర్తించినారు. ఇందులో 40 మందిని భారత్ నిర్మాణ్ వాలంటీర్స్‌గా గుర్తించి టిసిపార్డ్, హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వడం జరిగినది. గతంలో వీరికున్న అనేక అనుమానాలు-పెడత్రోవలు విస్మరించి మంచి వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకొని గ్రామానికి చాలా ఉపయోగపడి మంచి పనులు చేసి 'శబాష్' అనిపించుకొంటున్నారు. జిల్లా పరిషత్ Dy.CEO గౌతమ్‌రెడ్డి, DTMs కె.సురేందర్, ఎన్.సంతోష్ చేయూతతో బి.నరేష్ బి.ఎన్.వి. ద్వారా గ్రామంలో గ్రంథాలయం (--- Deposit Centre) నడుపుతూ విద్య, ఉద్యోగ అవకాశాలు పెంపొందించుకొన్నారు.

SBH-RSETI ద్వారా 27 మంది NAC (Tailoring) 38, పోలీస్ కానిస్టేబుల్‌లో 02, ప్రత్యక్ష ఉద్యోగాలు (2) 69 శిక్షణ పొందిన కొందరు ప్రైవేట్ ఉద్యోగాలు చేస్తున్నారు (85 మంది).

మహిళలకు వివిధ రకాల ఇన్సూరెన్స్ పథకాలు అమలు తీరుపై గ్రామసభలో ప్రత్యక్ష సమీక్షలో ఆమ్‌ఆద్మీ భీమా యోజన (AABY) 2015-16 వరకు 834 అభయహస్తం(ABH) 588, గ్రామీణ జనశ్రీ భీమా యోజన (JBY) 220, ఎల్.ఐ.సి., ఇతర భీమా సదుపాయాలు, జనశ్రీ భీమా, ఎస్సీ సబ్‌ప్లాన్‌లో కూడా ప్రయోజనం పొందినట్లు పలు పాలసీదారులు వివరించారు. రెండు పిడిఎస్ రేషన్ షాపులు సక్రమంగా



నిర్వహించి నిత్యవసర సరకులు అందజేస్తున్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (MGNREGS) ద్వారా 528 పనులతో 77840 మ్యాన్‌డేస్‌తో రూ.1.5 కోట్లతో ఎస్టీ (లంబాడి) వారు 60% ఎస్సీ 23% ఇతరులు, 17% మ్యాన్‌డేస్ వేతనాలు పొందుతున్నట్లు అట్లే ఉపాధి పనులు జరుగు సమయంలో గంటన్నర సాక్షరభారత్ / బి.ఎన్.వి.లతో వయోజన విద్య, పలు కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం ప్రత్యేక విశేషముగా గుర్తించి ఢిల్లీ టీమ్ ఆనందం వ్యక్తం చేశారు.

ఇంకుడు గుంతలు 185 నిర్మించి రూ.7.55 లక్షలతో గృహాలలో నీటి నిల్వలు పెంచుకోనుట, దోమల నివారణ, పరిశుభ్రత పాటిస్తూ ఇంటి ఇంటికీ కిచెన్ గార్డెన్ ఏర్పాటులో కూరగాయాలు పండిస్తున్నారు. వ్యవసాయ పొలాలకు రోడ్లు 7 కి.మీ., రూ.18.92 లక్షలు, భూమి అభివృద్ధి ఎల్.డి.పి. రూ.32.60 లక్షలు వెచ్చించి వృధా భూమిని వినియోగంలోకి తీసుకొచ్చి 43,600 మొక్కలు నాటి అందమైన ప్రకృతి, పర్యావరణం, పళ్ళతోటలతో ఫలసాయం పొందుతున్నారు.

చాలా గ్రామసభలు సమన్వయ సమావేశాలు (Gp/md//District) నిర్వహించి ప్రజల భాగస్వామ్యం - ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ యువకులు, మహిళల భాగస్వామ్యంతో గోడలపైన వ్రాతలు, IHHS2 సాధన వినియోగం ప్రతిజ్ఞ పట్టుదలతో సమిష్టిగా సమగ్ర అభివృద్ధి సాధనలో సాగుతున్నారు.

ఎళ్ళ కాలం నుండి పరిష్కారం కాని సర్వే నెం.292, 318లలో గల 211 ఎకరాల ప్రభుత్వ భూమి 191 మంది అర్హులకు పట్టాలు శ్రీయుత బి.వినోద్‌కుమార్(ఎంపి) గారు, ఆర్డీఓల ద్వారా అందజేసి, పాస్‌బుక్‌లు ఇచ్చి కొత్త బ్యాంకు - తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ద్వారా 1.5లక్షల ఋణాలు పొందటం, వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ విత్తనాలు, ఆధునిక పనిముట్లు, పంట నష్టం భీమా పొందుతున్నారు. మాన్యులు మన ప్రధాని నరేంద్రమోదీ గారి సకల్పం SAAGY ఏళ్ళనాటి సమస్య పరిష్కారం లభించినది. రైతుల కళ్ళలో ఆనందం గుండె నిండా ధైర్యాన్ని నింపారు.

కొత్త బ్యాంకుతో 25 ముద్ర లోన్స్ (20.00 లక్షలు) అటల్ పెన్షన్ యోజన 11 మంది, PMJJY - 600, PMSAY - 3000 ఖాతాలు తెరవటం అట్లే 2.50 కోట్ల ఫండ్ సమకూరినట్లు బ్యాంక్ మేనేజర్ తెలపటం జరిగినది.

పాడి - పంటలు - వ్యవసాయంపై ప్రత్యేక శిక్షణలు వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.శ్రీనివాస్‌రెడ్డి గారు, వ్యవసాయ అధికారులు, 'వాసన్ స్వచ్ఛంద సంస్థ' ద్వారా ఈ క్రింది కార్యక్రమాలు చేసి విజయం సాధించారు.

- గ్రామంలో మొత్తం భూమి 1169 ఎకరాలు వర్షాధారం 739 ఎకరాలు, బోర్ బావులతో సాగు 430 ఎకరాలు విస్తీర్ణం.
- NMSA ద్వారా ప్రతి రైతుకు 'భూసార పరీక్ష' కార్డులు అందజేశారు.
- విత్తన కేంద్రం ఏర్పాటు చేసి పెసళ్లు, శనగలు, కందులు, మొక్కజొన్న, సజ్జలు, కొర్రలు, కూరగాయల విత్తనాలు సబ్సిడీతో రైతులకు ఇచ్చి మళ్లీ సర్టిఫైడ్ సీడ్ తయారీ చేసి వందల ఎకరాలకు నాణ్యమైన విత్తనాలు ఇస్తున్నారు.
- సేంద్రియ వ్యవసాయంను అమలుపరుస్తూ (NPM) రైతుల ఆరోగ్యం మెరుగుపరుచుకొంటున్నారు.
- వీర్నపల్లి రైతులు ఒక సొసైటీ ఏర్పాటు చేసుకొని 'రైతు సేవ విక్రయ కేంద్రం' నడుపుతున్నారు. ఈ గ్రామంలో 9 గంటల విద్యుత్ నిరాటకంగా ఉంటుంది.

రైతులకు వాతావరణ వివరాలు, వర్షపాత నమోదు, ఆధునిక వ్యవసాయ విధానాలు, సస్యరక్షణ చర్యలపై వ్యవసాయ అధికారులు, వాసన్ NGO ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు.

సాగునీరు కోసం మిషన్ కాకతీయ పనులు చేపట్టి చెరువులు, కుంటలు, మట్టి తీసి కట్టలు ఎత్తు పెంచి భూగర్భజలాల పెంపు, వర్షపునీటిని నిల్వ చేస్తూ త్రాగునీరు, సాగునీరు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

ఫామ్ మెకనిజమ్ క్రింద భూమి చదును రోటవెటర్ (3.67

లక్షల) సబ్సిడీతో రైతుకు అందజేశారు. వాసన్ NGO ద్వారా 205 కె వివిధ విత్తనాలు పంపిణీ చేయటం జరిగినది.

మాక్స్ సొసైటీ ఏర్పాటు తరువాత గంగిపల్లి వ్యవసాయ సహకార సంఘం సందర్శించి రావటం, వారి ఉత్తమ ఆచరణలు ఈ గ్రామంలో అమలుపరుచుకొంటున్నారు.

గోదాముల నిర్మాణం, పందిరి కూరగాయల పంటలు, అడవి ప్రాంతములో లక్ష మొక్కల పెంపకం చేపట్టి పళ్ల తోటలను అభివృద్ధి చేసుకొంటున్నారు.

మౌళిక సదుపాయాల విషయంలో 9 తండాలను కలుపుతూ లింక్ రోడ్డు నిర్మాణం రూ. 4.60 కోట్లతో, అందమైన కమ్యూనిటీ హాల్ రూ. 20 లక్షలతో గ్రామం మధ్యలో రోడ్లు, 30 లక్షలతో గ్రామంలో గల ప్రాథమిక/ సెకండరీ మోడల్ స్కూల్స్‌కు అందమైన తరగతులు, విశాలమైన ఆటస్థలం, చుట్టూ ప్రవారీ గోడ రూ. 30 లక్షలతో నిర్మాణం చేయబడి స్వచ్ఛమైన త్రాగునీరు కోసం OHSR 4 నిర్మించి, ఆర్.ఓ. ప్లాంట్ నీటి శుద్ధి చేసి 15 ఇండియా మార్క్ బోర్ వెల్స్‌తో నీటి సరఫరా నిరంతరముగా నిత్యం అందిస్తున్నారు.

గ్రామంలో బిఎస్ఎన్ఎల్ 3జి సేవలు అందుబాటులోకి తెచ్చి మీ సేవ కేంద్రం ఏర్పాటు చేసి పౌరసేవలు సకాలంలో పొందుతున్నారు. పన్నులు వసూలు 100% చేసినారు. ఉద్యోగ అవకాశాల కోసం సమాచారం అంది పుచ్చుకొంటున్నారు.

ఈ గ్రామంలో గతంలో గుడుంబా ఏరులైపారేది. గంజాయి, గుట్కాలు, పాన్ మసాలాలు విపరీతంగా తినేవారు. SAAGY ద్వారా ఎక్సైజ్ వారి ఇతర శాఖల సమన్వయంతో 90% ప్రజల అలవాట్లలో మార్పులు తీసుకొని రావటం జరిగినది.

గుగులోతు యాదమ్మ నాడు గుడుంబా అమ్మేది, ప్రస్తుతం టీ, టిఫిన్ సెంటర్ నడుపుతూ జీవనోపాధి పొందుతుంది.

లక్వాత్ పద్మ ప్రస్తుతం కుట్టుమిషన్‌తో, భూక్య దేవి పిండి చక్కీతో బ్రతుకుతున్నారు.

ప్రతినెల గ్రామసభ నిర్వహిస్తూ దానికి ముందు మహిళ గ్రామసభలు, గ్రామజ్యోతి ఫంక్షనల్ కమిటీల సమావేశాలు నిర్వహిస్తూ పాఠశాలలో బాలసభలు నిర్వహిస్తూ పారిశుద్ధ్యం (ఘన, ద్రవ, మరుగుదొడ్లు)పై ప్రజలలో నిరంతర చైతన్యం పెంపొందించడం జరుపుకోవటం ఆనందం కల్గిందని పేర్కొన్నారు. కళజాత, వీధినాటకాలు, సిటి కేబుల్ ద్వారా చైతన్యం, అవగాహన కల్గించినట్లు తెలిపారు.

ప్రజలను, ఓటర్లను తెలివిగా చైతన్యవంతులుగా మారిస్తే ప్రభుత్వ ఉద్యోగులు సేవాభావం – సమన్వయంతో పనిచేస్తే ప్రజాప్రతినిధులు పరిపాలన విధానాలు, కేంద్ర/ రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన పెంపొందించుకొని నాణ్యతగా, నిజాయితీగా అర్హులకు అందజేస్తే చక్కని ప్రణాళికలతో నిరంతర పర్యవేక్షణలో పైన పేర్కొన్న పంచాయతీ దర్పన్‌లో పేర్కొన్న సూచికలు గ్రామఅభివృద్ధి ప్రణాళికలతో సరిపోల్చి సంపూర్ణ సమగ్ర అభివృద్ధి సాధనలో వ్యక్తిగతంగా మానవీయ విలువలు, ప్రవర్తనలో మార్పులు, మానవ అభివృద్ధిలో విద్య, వైద్య, పౌష్టికాహార, సామాజిక భద్రతలను కల్పిస్తూ ఆర్థికంగా స్వయం సమృద్ధి – జీవనోపాధులు (బ్రతుకుదెరువులు), నైపుణ్యాలు పెంచుకొని దోసిలిపట్టి అడగటం మాని ఇతరులకు సహాయం చేసేలా ఆర్థిక కూర్పు సాధించి సామాజికంగా – విలువలు పెంపుదల, సమంజసముగా సామాన్య నిరుపేదలకు దక్కాల్సిన హక్కులు సమాజం నుండి దక్కేలా ఎక్కడి ప్రజలు అక్కడే సాధించే సాధనలో వాలంటీర్లు నిస్వార్థ ప్రజాప్రతినిధులు, అధికారులతో పనిచేయించుకొనే సామర్థ్యాలు పౌరసమాజంలో వస్తే అందుకు చదువుకున్న ప్రతి పౌరుడు దేశభక్తితో ప్రజాస్వామ్యం పరిరక్షణలో అందరి బాధ్యతగా గుర్తెరిగేలా సమస్యల మూలాలను తెలుసుకొని శాశ్వత పరిష్కారం కోసం సమిష్టి భాగస్వామ్యం, పెంపుదల నిరంతర కృషి చేస్తారని ఆశిస్తూ అనతి కాలంలోనే సంసద్ ఆదర్శగ్రామాలలో అభివృద్ధి స్ఫూర్తితో దేశంలోని అన్ని గ్రామాలు 'గ్రామ స్వరాజ్యం బాపూజీ కన్న కలలు నెరవేర్చేలా.... ప్రధాని సంకల్పం సాధించే వరకు ప్రతి ఒక్కరం.... బాధ్యతగా భాగస్వాములం అవుతాం... భారతమాత... తెలంగాణ... తల్లి సేవలో తరిస్తాం... అని ఆశిస్తూ....

**– కోట సురేందర్,**
**డి.టి.ఎం. జిల్లా ప్రజాపరిషత్, కరీంనగర్**





# భ్రూణ హత్యలు సామాజిక రుగ్మత

- అమ్మ కడుపులో కడతేరుతున్న పసికందులు
- తల్లి గర్భంలోనే బిడ్డలకు సమాధి
- శాపంగా మారుతున్న ఆడపిల్లల బతుకులు

ఆడపిల్ల పుడితే మహాలక్ష్మిగా భావించే పరిస్థితులు ఆ రోజుల్లో ఉండేవి. కాని కడుపులో ఉన్నది ఆడ శిశువు అని తెలియగానే పురిట్లోనే చిదిమేసే దుష్ట సంస్కృతి ఈ రోజుల్లో బాగా ప్రభలుతోంది. నేటితరం పుట్టబోయేది అమ్మాయి అని తెలియగానే పిండదశలోనే చంపేస్తుంది. పుట్టే బిడ్డ ఆడబిడ్డని తెలిస్తే పుట్టక ముందే అబార్షన్ చేయించుకుంటున్న వారు కొందరయితే పుట్టిన తరువాత వదిలించుకుంటున్న వారు మరికొందరు. అందుకే సమాజంలో ఆడపిల్లల సంఖ్య నానాటికి తగ్గిపోతుంది. 2001 జనాభా లెక్కల ప్రకారం తెలుగు రాష్ట్రాల్లో ప్రతి వెయ్యి మంది పురుషులకు 962 మంది స్త్రీలు ఉంటే 2011 జనాభా నాటికి ఆ నిష్పత్తి 943కు పడిపోయింది. దీనివల్ల భవిష్యత్తులో పురుష, మహిళ జనాభాల్లో తీవ్ర అంతరాలు కనిపించబోతున్నాయి. ఫలితంగా ఇప్పటికే పలు సామాజిక వర్గాల్లో అబ్బాయిలకు పెళ్ళి సంబంధాలకు అమ్మాయిలు దొరకడం లేదు.

పుట్టేది ఆడపిల్ల అని తెలియగానే గర్భవిచ్చిత్తి ద్వారా చిదిమేయడమంత పరమ దారుణకృత్యం మరొకటి లేదు. పలు రకాల కారణాలతో పుట్టకముందే పసి నలుసును పొట్టన పెట్టుకుంటున్న దారుణాలను నిరోధించాలి. గర్భస్థ శిశువుల లింగపరీక్ష విదానాన్ని నిర్బంధం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆడ పిల్లలను కనే విషయం నుంచి ఆరోగ్యం, చదువు, పెళ్ళి, వృద్ధాప్యం దాకా వారిని వివక్ష నుంచి, వేదింపుల నుంచి రక్షించే చట్టాలు కఠినంగా అమలు జరగాలి. బ్రూణ హత్యల నిరోధానికి ప్రభుత్వ చట్టాలు, ప్రభుత్వ ఆదేశాల అమలుతో పాటు స్త్రీ విద్య, సామాజిక అవగాహన, వివిద సంబంధిత ప్రభుత్వ శాఖల పర్యవేక్షణ చాలా ముఖ్యం.

ప్రపంచ వ్యాప్తంగా ఏటా దాదాపు రెండున్నర కోట్ల గర్భస్రావాలు జరుగుతున్నట్లు, భారత్‌లో వాటి సంఖ్య ఏడాదికి కోటికి పైగానే గర్భవిచ్చిత్తులు జరుగుతున్నట్లు (UNICEF) ఐక్యరాజ్య సమితి బాలల నిధి నివేదిక ద్వారా తెలుస్తున్నది.

తెలంగాణ ప్రభుత్వం నవజాత శిశువుల అభివృద్ధి, వారి సంక్షేమం కోసం, మహిళల ఆరోగ్యం, చదువు మరియు అభివృద్ధికై, ఆడపిల్లలపై అత్యాచారాలు, దౌర్జన్యాల నివారణకై ఎన్నో ప్రత్యేక పథకాలు, ప్రోత్సాహకాలు ప్రవేశపెట్టింది.

- నూతనంగా ఏర్పడిన మన తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం ఆడపిల్లల సంరక్షణతో పాటు అభివృద్ధి వరచాలనే ఉద్దేశ్యంతో పలు సంక్షేమ పథకాలను రూపొందించి అమలు పరుస్తుంది. వాటిలో ముఖ్యంగా షెడ్యూల్డ కులాలు, షెడ్యూల్డ తెగలు, మైనార్టీ వర్గాలు మరియు వెనుకబడిన వర్గాలకు ఆర్థిక స్థోమత లేని పేద, నిరుపేద కుటుంబాలకు చెందిన నిరుపేదలైన 18 సం॥ నిండిన అవివాహిత యువతులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాల ద్వారా పెళ్ళి అవసరాలను తీర్చడానికి ప్రభుత్వం సహాయం చేస్తుంది.
- రాష్ట్రంలోని తల్లి బిడ్డలందరూ ఆరోగ్యంగా ఉండాలని వారికి పౌష్టికాహారం అందించి తద్వారా మాతా శిశు మరణాల రేటు తగ్గించేందుకు ఆరోగ్యలక్ష్మి లాంటి పథకాల ద్వారా ప్రభుత్వం కృషి చేస్తుంది.
- మహిళలు, యువతులు, విద్యార్థినులు, మైనర్ బాలికలపై

నిరంతరంగా కొనసాగుతున్న అఘాయిత్యాలను, అత్యాచారాలను మరియు ఈవ్‌టీజింగ్ సమస్యలను "షీ బృందాలు" ద్వారా ప్రభుత్వం రూపుమాపుతుంది.

- అంతేకాక మహిళల సంక్షేమానికి అభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పలు అభివృద్ధి కార్యక్రమాలు అమలు పరుస్తుంది.
- వీటితో పాటు ప్రధాన మంత్రి ప్రవేశపెట్టిన "బేటీ బచావో, బేటి పడావో" అనే పథకం కూడా ఆడపిల్లలకు ఎంతో ఉపయోగపడుతుంది. పై పథకాలు దృష్టిలో ఉంచుకుని ప్రజలకు అవగాహన కల్పించి భ్రూణ హత్యలకు స్వస్తి పలికేలా కృషి జరగాలి.

తొలి నుంచి ఆడపిల్లల పట్ల చిన్న చూపు, ఆదాయ వ్యయాలతో పోల్చిచూపి 'మైనస్' లెక్కించే మూర్ఖత్వం ఇతరత్రా పలు అవలక్షణాలు సమాజ విలువల్ని తుంగలో తొక్కుతున్నాయి.

రెవెన్యూ, పోలీస్ వ్యవస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు, చదువుకున్నవారు మొ॥గు వారు భ్రూణ హత్యలను వెలికితీసి వాటిని ప్రోత్సహించేవారికి తగు కఠిన శిక్షలతో పాటు వారిలో చైతన్యం తీసుకు రావాల్సిన బాధ్యత తీసుకోవాలి.

**భ్రూణ హత్యలపై ప్రతి ఒక్కరూ అవగాహణ ఏర్పరచుకోవాలి.**

- ప్రజా ప్రతినిధులు, చదువుకున్నవారు, అధికారులు, మహిళా ప్రతినిధులు గ్రామంలో ప్రజలకు భ్రూణ హత్యలకు పాల్పడే వారిలో వాటిని నిరోధించడానికి అవగాహణ పెంచాలి.
- గ్రామ పంచాయతీ సమావేశాల్లో, స్వయం సహాయక సంఘ సమావేశాల్లో భ్రూణ హత్యలనివారణపై వాటిని ప్రోత్సహించడం ద్వారా వచ్చే ప్రమాదంపై చర్చించాలి.
- ప్రతి ఇంటికి కరపత్రాల ద్వారా అవగాహణ పెంచాలి.
- పుట్టబోయే ఆడ గర్భస్థ పిండాన్ని చంపడమనేటటువంటి సాంఘిక దురాచాలను రూపుమాపాలి.
- సమాజంలో గల ప్రజల ఆలోచనా విధానంలో మార్పు తేవాలి.
- పురుష మహిళ, లింగ వివక్షలేని అభ్యుదయ సమాజం ఏర్పాటుకు కృషి చేయాలి.





- మహిళ లేనిదే సృష్టి లేదనే అవగాహన ప్రజల్లో పెంచాలి.


**లింగ ఎంపిక నిషేద చట్టం 1994.**

- ఈ చట్టం ప్రకారం స్త్రీల పట్ల వివక్షత నివారించుటకు లింగ ఎంపిక మరియు గర్భస్రావం ద్వారా స్త్రీ భ్రూణ హత్యలను నిషేదించబడింది.
- తల్లికి/బిడ్డకి ఆరోగ్యానికి ఏదయినా హాని కలిగే పరిస్థితుల్లో జన్యు సంబంధిత వ్యాధులకు మాత్రమే తల్లి అంగీకారంతోనే గర్భస్రావం చేయించుకునే అవకాశం కలదు.
- స్కాన్ సెంటర్లు/డాక్టర్లకి వీటి వినియోగంపై ప్రభుత్వ ఆజమాయిషి/నియంత్రణ జిల్లా కలెక్టరు/మెజిస్ట్రేటుకి కల్పించబడినది.
- అక్రమంగా/అనైతికంగా స్కాన్ చేసి లింగ నిర్ధారణ మరియు వెల్లడి చేయడం చట్టరీత్యా నేరంగా పరిగణించి కఠినమయిన శిక్షలు విధించబడును.
- గర్భవతి అనుమతి లేకుండా గర్భస్రావం జరిపినట్లయితే సెక్షన్ 313 ప్రకారం 10 సం॥ వరకు కారాగార శిక్ష, జరిమానా విధించబడును.

భ్రూణ హత్యల ద్వారా మహిళల జనాభా మరింత తగ్గి సామాజిక అంతరాలు అరాచక సంఘటనలు అధికమయ్యే ప్రమాదముంది. భ్రూణ హత్యలతో ఆడసంతతి తగ్గిస్తే మానవజాతి ఉంటుందా! పురుషులు జన్మించేది స్త్రీ గర్భంనుంచే కదా అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. ఆడ శిశువు పుట్టుకకు నిర్ణయక పాత్ర వహించేది పురుషుడే అనే విషయం గ్రహించాలి. స్త్రీ జాతి లేకుండా మగజాతి ఉంటుందా! అసలు మానవజాతి మనుగడ ఉంటుందా అనేది ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు మాకు ఉందని మహిళాలోకం నినదిస్తున్న కాలమిది. ఆడ శిశువుల సంరక్షణ బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని అందరూ గుర్తించాలి. అప్పుడే బాలికల భవిష్యత్తు బంగారు బాట పడుతుంది.

**కె. యాదయ్యగౌడ్**
**సంయుక్త సంచాలకులు (పరిపాలన)**




## సమగ్ర మూల్యాంకనమే

# విద్యకు ప్రోత్సాహం

**సమస్య నాన్ డిటెన్షన్ విధానం కాదు. నిరంతర, సమగ్ర మూల్యాంకనం సరిగా అమలు కాకపోవడం. దాని అమలుకు కావలసిన సంపూర్ణ వాతావరణం లేకపోవడం, తగిన విద్యా నమూనాను రూపొందించుకోకపోవడం.**

జాతీయ విద్యా విధానం-2016 తుది ముసాయిదా రూపకల్పనకు ఈ నెలాఖరు వరకు అభిప్రాయాలను స్వీకరించడానికి కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ గడువును విధించింది. ఈ అభిప్రాయాలను స్వీకరించడంలో భాగంగా మానవ వనరుల మంత్రిత్వశాఖ విడుదల చేసిన పాలసీ ఫ్రేంవర్క్ 5వ తరగతి తర్వాత డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలనే ప్రతిపాదనను చేసింది. దీంతో డిటెన్షన్ విధానంపై చర్చ మళ్ళీ తెరపైకి వచ్చింది. గతంలో దీన్ని అధ్యయనం చేయడానికి హర్యానా మాజీ విద్యామంత్రి గీతా భుక్కల్ సారథ్యంలో కేంద్ర విద్యా సలహా మండలి (CABE) ఒక సబ్ కమిటీని 2012లో నియమించింది. ఈ కమిటీ తమ నివేదికను 2014లో సమర్పించింది. దశలవారీగా డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టాలని ఈ కమిటీ కూడా సిఫార్సు చేసిం ది. మన రాష్ట్రం డిటెన్షన్ విధానాన్ని తిరస్కరించి నాన్ డిటెన్షన్ విధానాన్ని అనుసరిస్తున్నది. అయితే కొన్ని ఉపాధ్యాయ సంఘాలు కూడా డిటెన్షన్ విధానాన్ని సమర్థిస్తున్నాయి.

దేశంలో 2010 ఏప్రిల్ 1 నుంచి విద్యాహక్కు చట్టం అమలవుతున్నది. ఈ చట్టం 8వ తరగతి వరకు నాన్ డిటెన్షన్ విధానాన్ని (NDP) అమలు చేయాలని నిర్దేశిస్తున్నది, అంటే 8వ తరగతి వరకు పాస్, ఫెయిల్ అనే విధానం ఉండకూడదు. విద్యాహక్కు చట్టం కంటే ముందునుంచే ఈ విధానం మన రాష్ట్రంలో 9వ తరగతి వరకు అమలవుతున్నది. సీబీయస్ ఈ పదవ తరగతి బోర్డ్ పరీక్షను కూడా తప్పనిసరిగా కాకుండా ఐచ్ఛికంగా చేసింది. ఇష్టమైతే బోర్డు పరీక్షను రాసుకోవచ్చు. లేదా ఆ పాఠశాల నిర్వహించే పరీక్షనైనా రాసుకోవచ్చు.

పరీక్షల కోసమే చదువులు అనే విద్యా నమూనాను విశ్వసిస్తున్నవారు పరీక్షలు లేకపోతే చదువులుండవని భావిస్తారు. వార్షిక పరీక్షలతో సంబంధం లేకుండా పైతరగతులకు పిల్లలను ప్రమోట్ చేస్తే విద్యా ప్రమాణాలు తగ్గినట్లేన నే భావన వీరిది. చాలా రాష్ట్రాల్లో ఈ మధ్యకాలంలో 9వ తరగతిలో ఫెయిలవుతున్న వారి సంఖ్య పెరుగుతున్నదని సర్వేలు చెపుతున్నాయి. కాబట్టి నాన్ డిటెన్షన్ విధానాన్ని రద్దుచేసి తిరిగి డిటెన్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడానికి విద్యాహక్కు చట్టానికి సవరణ చేయాలనే డిమాండ్ పెరుగుతున్నది. పిల్లలు సరిగా నేర్చుకోకపోవడానికి లోపం విద్యా నమూనాలో ఉందా? లేక నాన్ డిటెన్షన్ విధానంలో ఉందా? అనేది తేల్చుకోవాలి.

ఎనిమిది, తొమ్మిది దశకాలలో దేశంలో విద్యావకాశాల విస్తరణనే ప్రధానంగా భావించబడింది, దీంతో పాస్, ఫెయిల్ విధానంలో విద్యార్థి ఫెయిలయినపుడు అదే తరగతిని మళ్లీ చదువడం వల్ల విద్యలో నిలుపుదల (Stagnation) వృథా (Wastage) పెరిగి

డ్రాపౌట్లు పెరుగుతాయని భావించడం వల్ల విద్యాహక్కు చట్టం కంటే ముందునుంచే నాన్ డిటెన్షన్ విధానం అమలవుతున్నది. విద్యాహక్కు చట్టం అమలైన ఈ ఆరేండ్లలో నాన్ డిటెన్షన్ విధానం అమలవడం వల్ల విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం దేశవ్యాప్తంగా తగ్గిందని చర్చ మొదలైంది. అందుకని డిటెన్షన్ విధానం ఉం డాలనే వాదన ముందుకొస్తున్నది. ఈ వాదన చేసేవారు డిటెన్షన్ విధానం ఉంటే విద్యార్థి ఒక నిర్దిష్ట తరగతిలో ఫెయిలయితే తర్వాత తరగతికి పంపించకుండా అదే తరగతిలో కొనసాగి మళ్ళీ చదివి పాసవుతాడు. ఇలా ప్రతీ అంచె లో జరిగితే స్కూల్ దశ చివరన ఉండే పబ్లిక్ పరీక్షలో ఉత్తీర్ణతాశాతం పెరుగుతుంది అనుకుంటారు.

విద్యార్థి ఉత్తీర్ణతా కోసమే ఈ చర్యలనే భ్రమను ఈ భావన కల్పిస్తుంది కానీ అది నిజం కాదు. ప్రతీ స్థాయిలో ప్రతీ విద్యార్థిని దృష్టిలో ఉంచుకొని వారికనుగుణమైన వైయక్తిక విధానాల ద్వారా విద్యాబోధన జరిగితే ఏ విద్యార్థి కూడా ఫెయిల్ కాడు. అలా కాకుండా విద్యార్థి కోణాన్ని విస్మరించి, మనం ఏర్పరచుకున్న కొన్ని ప్రమాణాలకు అనుగుణంగా అంచనా వేసేవే ప్రస్తు త పరీక్షలు. విద్యార్థులకు అనుగుణమైన వైయక్తిక విధానాల ద్వారా బోధన జరుపబడాలంటే దీనికనుగుణంగా క్లాస్‌రూం పరిస్థితులను, టీచర్లను తయారు చేసుకోగలుగాలి. అంటే ప్రతీ విద్యార్థిని పరిశీలించదగిన సరళ సంఖ్యలో క్లాస్ సంఖ్య ఉండాలి. ప్రతీ విద్యార్థిని అర్థం చేసుకోగలిగిన నేర్పును సాధించిన టీచర్ ఉండాలి. కరికులం లోడ్ తగిన స్థాయిలో ఉండాలి. ఇవన్నీ సరిగా అమలైతే విద్యార్థులు ఫెయిల్ కారు. వీటన్నింటినీ సమకూర్చుకోలేక మెరుగుపర్చే ఆలోచనా, శక్తిసామర్థ్యాలు లేక, ఈ విషయాలనన్నింటిని ఆర్థిక కోణంలో చూసే మన విధానాలు, కరికులం లోడ్ ఎక్కువుంటే, ఎక్కువ సమయం బోధన ఉంటే నాణ్యమైన విద్య అని భావించే మన అజ్ఞానం వల్ల ఫెయిలవుతున్నది, మనం కానీ విద్యార్థులు కాదు. వాళ్లు మనచేత ఫెయిల్ చేయబడతారని మాజీ NCERT డైరెక్టర్ ప్రొ.కృష్ణకుమార్ ఒక సందర్భంలో అన్నారు. ఈ విషయంలో నార్డిక్ దేశాలు ప్రపంచానికి మార్గదర్శకంగా ఉన్నాయి. అయితే ఇంకా మనం ఇంగ్లండ్, అమెరికాల వైపే చూస్తున్నాం, ఇవి విద్యా విషయకంగా ఔట్ డేటెడ్ అయిన దేశాలు.

చైల్డ్ సెంటర్డ్ విధానంలో విద్యార్థులు తామున్న స్థితిలో నుం చి తమ జ్ఞానాన్ని తామే కృత్యాల ద్వారా నిర్మించుకోవలసి ఉం టుంది. పిల్లలందరు ఒకే రకంగా గాక వేర్వేరు మార్గాల్లో, వేగాలతో ఈ పనిని చేస్తారు. వారివారి వ్యక్తిగత వేగాలననుసరించి వారికి సరిపడే బోధనా విధానాలతో విద్యా ప్రక్రియ నడువాలి. కాబట్టి అందరికీ ఒకేరకమైన, నిర్దిష్ట సమాధానాలను ఆశించే పరీక్షలు అర్థరహితమైనవి. వాటిద్వారా పిల్లలను పాస్ లేదా ఫెయిల్ చేసే విధానం అశాస్త్రీయమైనది. కాబట్టి పిల్లలు నేర్చుకునే ప్రక్రియలోనే అంతర్భాగంగా ఉండే, వేర్వేరు విధానాల్లో విద్యార్థులను అంచనా వేసే నిరంతర, సమగ్ర మూల్యాంకనం అమల్లోకి వచ్చింది. ఇది పిల్లలు వారివారి వేగాలకు తగినట్లుగా వారివారి భావనా మార్గాలకు అనుకూలంగా నేర్చుకోవడానికి తోడ్పడుతుంది. నేర్చుకునే ప్రక్రియ ఇలా సాగినపుడు పాస్, ఫెయిల్‌కు ప్రాధాన్యం ఉండదు. కాబట్టి ఆధునిక బోధన,అభ్యస న పద్ధతుల పర్యవసానం నిరంతర, సమగ్ర మూల్యాంకనం అయితే నిరంతర, సమగ్ర మూల్యాంకనం పర్యవసానం నాన్ డిటెన్షన్ విధానం.

పాత పద్ధతులు విద్యా ప్రణాళికను సంవత్సరపు ప్యాకేజీలుగా విడగొట్టి, మార్పుకు వీల్లేని దృఢమైన గ్రేడ్లుగా విభజిస్తుంది. ఆ గ్రేడులో పాసయితేనే విద్యార్థి పైగ్రేడుకు పంపించబడతాడు. నిరంతర, సమగ్ర మూల్యాంకనం అభ్యసనను అవిఛిన్నంగా భావిస్తున్నది. విద్యార్థుల వైయుక్తిక భేదాలననుసరించి నిర్దిష్ట సమయ నియమం లేకుండా వారివారి వేగాలననుసరించి నేర్పడం, దానికనుగుణమైన బోధనా పద్ధతులను, మూల్యాంకనా విధానాలను అనుసరించడం దాని స్ఫూర్తి. ఈ స్ఫూర్తి ప్రస్తుతం అమలవుతు న్న నిరంతర, సమగ్ర మూల్యాంకనంలో కనిపించ దు. ఉపాధ్యాయ విద్యార్థి రేషియోను పాటించకపోవ డం, భారీ సిలబస్, టీచర్లను సంపూర్ణంగా నిరంతర, సమగ్ర మూల్యాంకనానికి తయారుచేయకపోవడం కనబడుతుంది. సంకులిత మూల్యాంకనం కంటే రూపణ మూల్యాంకనానికే ఎక్కువ ప్రాధాన్యమివ్వడం నిరంతర, సమగ్ర మూల్యాంకనం స్ఫూర్తి, కానీ దీనికి వ్యతిరేకంగా నిరంతర, సమగ్ర మూల్యాంకనం అమలవుతున్నది. ఇంకా పాత పద్ధతులలోనే బోధన, వార్షిక పరీక్షల ప్రాధాన్యాలు తగ్గలేదు. ఈ పద్ధతి మార్చకుండానే కొత్త విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల జరిగిన పరిణామమిది.

ఈ పరిణామాలను అర్థం చేసుకోకుండా నాన్ డిటెన్షన్ విధానం వల్లనే ప్రమాణాలు తగ్గుతున్నాయనే అపోహలు వస్తున్నాయి. డిటెన్షన్ విధానం ఉంటే విద్యార్థి సరిగా నేర్చుకోలేకపోతే అదే తరగతిలో మరో సంవత్సరం కొనసాగిస్తే బాగా నేర్చుకుంటాడనేది మరో వాదన. అయితే ఈ వాదనను తేల్చే పరిశోధనలు ప్రపంచంలో ఎక్కడా లేవని ఈ సమస్యపై కేంద్ర విద్యా సలహా మం డలి నియమించిన గీతా కమిటీ అభిప్రాయం కూడా. కాబట్టి నాన్ డిటెన్షన్ విధానం సమస్య కాదు, నిరంతర, సమగ్ర మూల్యాంకనం సరైన రీతి లో అమలు కాకపోవడం అసలు సమస్య.

ఈ సమస్యను అధిగమించాలంటే ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి సరిగ్గా ఉండాలి. ఎక్కువ సిలబస్‌తో ఎక్కువ ప్రమాణాలనే అపోహ వీడనాడాలి. వార్షిక పరీక్షల ప్రాధాన్యాన్ని తగ్గించాలి. నిరంతర, సమగ్ర మూల్యాంకనం పట్ల టీచర్లకు సరైన అవగాహనను పెంపొందించాలి. పిల్లలు వెనుకబాటుకు కారణాలు తెలుసుకొని వాటిని పూరించే చర్యలను సూచించే కౌన్సిలర్లుండాలి. ఇవన్నీ పునాదులకు సంబంధించిన విషయాలు. ఈ పునాదులను మెరుగుపరచక పగుళ్ళను పై పూతలతో నివారించలేం. సమస్య నాన్ డిటెన్షన్ విధానం కాదు. నిరంతర, సమగ్ర మూల్యాంకనం సరిగా అమలు కాకపోవడం. దాని అమలుకు కావలసిన సంపూర్ణ వాతావరణం లేకపోవడం, తగిన విద్యా నమూనాను రూపొందించుకోకపోవడం.

**పి. శ్రీనివాసరావు**



# విద్య వికాసానికి తోడ్పడుతుంది

ప్రైవేటు పాఠశాలలో వన్ టైమ్ ఫీజ్ (ఓటీఎఫ్) అంటూ ఏడు లక్షల రూపాయలను వసూలు చేయడం పట్ల హైకోర్టు దిగ్భ్రాంతి వ్యక్తం చేయడాన్ని బట్టి, విద్యా వ్యాపారం ఏ స్థాయికి చేరుకున్నదో అర్థమవుతున్నది. ఈ ఏడాది ఇట్లా వన్ టైమ్ పేమెంటు చేస్తున్న పాఠశాలల వివరాలు ఇవ్వాలని కూడా కోర్టు ఆదేశించింది. ఫీజులు ఇంతగా ఉంటే దిగువ మధ్యతరగతి కుటుంబాలు ఎట్లా భరించగలవని కోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. హైదరాబాద్ పాఠశాలల తల్లిదండ్రుల సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ విచారణ సాగింది. క్యాపిటేషన్ ఫీజును నిషేధించినందున ఓటీఎఫ్ రూపంలో దానిని వసూలు చేస్తున్నారనే వాదన కాదనలేనిది. 160 పాఠశాలలు యాభై వేల నుంచి మూడు లక్షల రూపాయల వరకు ఓటీఎఫ్ వసూలు చేస్తున్నాయని రాష్ట్ర ప్రభుత్వం న్యాయవాది వెల్లడించడాన్ని బట్టి ప్రైవేటు పాఠశాలల వ్యవహారసరళి అర్థమవుతున్నది.

భవన నిర్మాణం పేర ఆరు వేల వరకు వసూలు చేయవచ్చుననే ఉత్తర్వు ఉంటే, ఆచరణలో ఆ సొమ్ము వసూలు లక్షలకు చేరుకున్నది. ఈ అంశంపై ఇంకా విచారణ సాగుతున్నప్పటికీ, న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేయడం, ఓటీఎప్ వంటి ఫీజులను నిరోధించడానికి ఏదో ఒక రీతిలో నియంత్రణా వ్యవస్థ ఉండాలని కూడా ఈ సందర్భంగా అభిప్రాయపడటం గమనార్హం. ఈ అంశంపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కూడా న్యాయస్థానం పిటిషనర్లను కోరింది. విద్యా సంస్థలు తల్లిదండ్రుల నుంచి ఏ రూపంలో కూడా భారీ ఫీజులు వసూలు చేయడాన్ని అరికట్టడానికి భారీ ప్రయత్నమే జరుగవలసి ఉన్నది.


ఉమ్మడి రాష్ట్రంలో సారా లాబీలు విద్యా సంస్థలు నడిపిన ఉదంతాలను రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది ప్రస్తావిస్తూ, తాము తీసుకోబోయే చర్యలను కూడా వివరించారు. సీమాంధ్ర పెత్తందారుల పాలనలో విద్యారంగం కేజీ నుంచి పీజీ వరకు లాభసాటి వ్యాపారంగా మారిందనేది వాస్తవం. విద్యాబోధన పేర వ్యాపారం జోరుగా సాగుతుంటే ప్రభుత్వం కండ్లు మూసుకున్నట్టు వ్యవహరించింది. తగిన వసతులు లేకున్నా, అర్హత గల ఉపాధ్యాయులు కొరవడినా అడిగే వారు లేరు. ఒకవైపు సర్కారు బడులను నిర్వీర్యం చేసే పన్నాగమూ సాగింది. దీంతో మధ్య తరగతి, అట్టడుగువర్గాలు తమ సంపాదనలో దాదాపు సగభాగం ప్రైవేటు బడులకు చెల్లించుకోవలసిన దుస్థితి ఏర్పడ్డది. యాజమాన్యాలు భారీ ఎత్తున ఫీజులు వసూలు చేస్తూనే, దానికి అనుబంధ వ్యాపారం కూడా ప్రారంభించాయి. పుస్తకాలు, పెన్నులు, టైలతో పాటు తమ పాఠశాల పేరు గల సాక్స్ కూడా అమ్ముకుంటున్నారంటే, దోపిడీ ఎంత విస్తరించిందో తెలుస్తున్నది. ఉపాధ్యాయులకు తగిన వేతనాలు ఇస్తున్నారా అంటే అదీ లేదు.

బోధనలో నాణ్యత లేదు, శాస్త్రీయత లేదు. నర్సరీ నుంచి మొదలైన ఈ వ్యాపారం ఇంటర్‌కు చేరే సరికి తారస్థాయిని అందుకున్నది. ఎంసెట్, ఐఐటీ, ఇంటిగ్రేటెడ్ కోచింగ్, కాన్సెప్ట్ స్కూల్స్, ఒలంపియాడ్ స్కూల్స్ ఇట్లా ఆకర్షణీయమైన పేర్లతో తల్లిదండ్రులను ఆకర్షిస్తున్నాయి. ఈ పాఠశాలల్లో బోధన ఎంత, వ్యాపారమెంత అనేది సగటు తల్లిదండ్రులకు తెలిసే అవకాశం లేదు. సమాజం నుంచి ఒత్తిడి కూడా ఉంటుంది. తల్లిదండ్రులకు వాస్తవాలు వెల్లడించి, ఇటువంటి వక్రధోరణులను అరికట్టవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. పాలకవర్గ పెద్దలకు, విద్యా వ్యాపారస్తులకు మధ్య ఉన్న అక్రమ బంధం మూలంగా ఈ తతంగం ఇంతకాలం యథేచ్ఛగా సాగింది.

తల్లిదండ్రుల సమస్య నగరాలలో, పల్లెలలో రెండు రకాలుగా ఉన్నది. హైదరాబాద్‌లోని ఉన్నత వర్గాల కాలనీలలో ఉండే పెద్ద పాఠశాలలు ఫీజుల పేర భారీ ఎత్తున వసూళ్లు సాగిస్తున్నాయి. పల్లెలలో ఫీజులు తక్కువగా ఉన్నప్పటికీ, ఆ మొత్తం కూడా పేద ప్రజల సంపాదనలో సింహభాగమై ఉంటున్నది. పైగా నాణ్యమైన విద్య తల్లిదండ్రులకు అం దడం లేదు. తమ పిల్లలకు గరిపేది నాణ్యమైన విద్య కాదనే విషయం పేద, నిరక్షరాస్య తల్లిదండ్రులకు తెలువదు. వారికి స్కూల్ డ్రెస్, టై మొదలైన అట్టహాసమే కనిపిస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో– తెలంగాణ రాష్ట్రం కేజీ టూ పీజీ విధానాన్ని పకడ్బందీగా ప్రవేశ పెట్టబోతున్నదని, ఇది అన్ని జాడ్యాలకు విరుగుడు అని ప్రభుత్వ తరఫు న్యాయవాది న్యాయస్థానంలో విచారణ సందర్భంగా పేర్కొనడం ఊరట కలిగిస్తున్నది. విద్యా వ్యాపారంపై విమర్శలు ఎంతోకాలంగా ఉన్నాయి. కోర్టుల ద్వారా ఊరట పొందడం కూడా అనేకసార్లు సాగింది. ఇప్పుడు ప్రభుత్వం చేయవలసింది, సమూల మార్పులు.

విద్య బోధన పేరుతో వ్యాపారం సాగే పరిస్థితే ఉండకూడదు. సూత్రరీత్యా చూస్తే పాఠశాలలు, కళాశాలల పేరు మీద వ్యాపారం సాగకూడదు. అదొక సంఘ సేవ మాత్రమే. అందుకే దీనికి అనుగుణంగా పాఠశాలలను నడుపడానికి సొసైటీలను నమోదు చేసుకుంటారు. కానీ పేరు సొసైటీలుగా ఉన్నప్పటికీ, విద్యా బోధన పేర వ్యాపారమే సాగుతున్నది. సీమాంధ్ర పాలనలో పాతుకుపోయిన ఈ విద్యా వ్యాపారాన్ని కూకటి వేళ్ళతో తొలగించడం అవస రం. అయితే అది పైకి చెప్పుకున్నంత సులభం కాదు. ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థను పకడ్బందిగా నిర్మించడం అంత తేలిక కాదు. అయినప్పటికీ కొంత ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధితో విద్యారంగాన్ని సంస్కరించబూనడం అభినందనీయం.

– వార్తాంశం



# ప్రజా కవి
# కాళోజీ నారాయణరావు

అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడటమే ఆయన మార్గం సమాజంలోని చీకటిపై తిరుగుబాటే ఆయన జీవిత ఆదర్శం. ఆయనే తెలంగాణ తొలిపొద్దు, తెలంగాణ ప్రజల ఉద్యమ ప్రతిధ్వని, స్వతంత్ర సమరయోదుడు పుటుక చావులు కాకుండ బ్రతకంతా తెలంగాణకే ఇచ్చిన వైతాళికుడు, పద్మవిభూషణ్ ప్రజాకవి కాళోజి నారాయణరావు

కాళోజి నారాయణ రావు అసలు పేరు “రఘువీర్ నారాయణ లక్ష్మీకాంత్ శ్రీనివాసరావు ” కాళోజి 1914 సెప్టెంబర్ 9న కర్ణాటక రాష్ట్రంలోని బిజాపూర్ జిల్లా రట్టెహెలి గ్రామంలో రమాభాయి, రంగారావు దంపతులకు జన్మించాడు. ఈయన పుట్టింది కర్ణాటక రాష్ట్రం అయిన ఈయన కుటుంబం వరంగల్ జిల్లా మడికొండలో స్థిరపడింది. కాళోజి తన ప్రాదమిక విద్యాభాసం మడికొండ, వరంగల్‌లో ఉన్నత విద్యను హైదరాబాద్‌లో అభ్యసించాడు.

కాళోజి గొప్ప మానవతావాది. ఆయనలో ఒక సంస్కర్త, ఉద్యమకారదు, సాహితివేత్త వంటి భిన్న పార్శ్వలు కనిపిస్తాయి. భావజాలంలోగాని, ఆచరణలో గాని ప్రధానంగా కనిపించేది వ్యక్తి స్వేచ్ఛ. విద్యార్థి దశనుండే కాళోజి నిజాం ప్రభుత్వం విధించిన నిషేద ఆజ్ఞలను వ్యతిరేకించి తెలంగాణలో అక్షర జ్యోతిని వ్యాపింప జేయడానికి తీవ్రంగా కృషి చేశాడు. కాళోజి రాజకీయ జీవితం అర్య సమాజంలో ప్రారంబం అయింది. ఈయన గాంధేయవాది “అహింస గొప్పదే కాని నేను పిరికితనం కన్నా హింసనే సమర్థిస్తాను ” అన్న గాందీజి సూక్తి కాళోజి ప్రభావితం చేసింది. 1930లో గ్రంథాలయోద్యమంలో, అర్యసమాజ్ నిర్వహించిన హైదరాబాద్ విమోచన ఉద్యమంలో 1952లో ఇడ్లి-సాంబార్ గో బ్యాక్ ఉద్యమం, నాన్‌మల్కి ఉద్యమం, వందేమాతర ఉద్యమం 1969 తెలంగాణ తొలి తరం ఉద్యమం, ఆంధ్రమహాసభ, ఆంధ్రసారస్వత్ పరిషత్ స్థాపన ఉద్యమాలలో కీలక పాత్ర పోషించాడు.

సాహిత్యాన్ని ఒక భాద్యతగా భావించి దాన్నే జీవితంగా మార్చుకున్న నిరాడంబరుడు. మన కాళోజి ఈయన రచనల్లో శ్రీశ్రీ వలె దేశి తెలుగు కనిపిస్తుంది. కవిత్వము కవిత్వము కొసమే కాకుండా జన చైతన్య ప్రయోజనం కోసం ప్రయోగించిన అక్షరాయుదం కాళోజి. కాళోజి కవిత్వంలో కవిత్వపు వస్తువులుగా అది ఇది అని ఎమిలేదు. ప్రేమ, నమ్మకం, మూడ నమ్మకాల నుండి వ్యంగ్యం, హస్యం, భోదన, జీవితం వరకు అన్ని కాళోజి కవిత వస్తువులే పాశ్చ్యత పొకడలకు దూరంగా తెలుగు సాహిత్య రణక్షేత్రంలో నిలబడి ఎదురెల్లి కవితను ఎక్కుపెట్టిన ఓ మహసాహిత్య వన వృక్షం కాళోజి నారాయణరావు.

అన్యాయంపై ఎక్కుపెట్టి అక్షరతూటాలు సందించిన ఆదునిక కవి కాళోజి ఇయన ప్రజల గొడవయే “నా గొడవగా” కాళోజి కదలు, అణాకదలు, పార్థివ వ్యయం, తెలంగాణ ఉద్యమ కవితలు, జీవనగీతాలు మొ॥గు రచనలు చేశాడు. ఇయన ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక సభ్యుడిగా, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగా పనిచేశాడు. ఇయనకు ఉత్తమ అనువాద రచయితగా, తామర పత్ర అవార్డు, పద్మవిభూషణ్ అవార్డ్, కాకతీయ విశ్వవిద్యాలయం నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్నాడు.

నేను ప్రస్తుతాన్ని, నిన్నటి స్వప్నాన్ని, రేపటి జ్ఞాపకాన్ని అని చెప్పుకున్న మహమనిషి, ప్రజల కోసమే జీవించిన ప్రజల మనిషి కాళోజి. సుదీర్ఘ కాలం పాటు ప్రజా జీవన చైతన్యంలో భాగం అయిన కాళోజి. 2002 నవంబర్‌లో ప్రజల మద్య నుండి వెళ్ళి పోయి. అకాశంలో ధ్రువతారగా నిలిచాడు. మన ప్రజాకవి కాళోజి నారాయణరావు.

కాళోజి నారాయణరావు మన మధ్యలో బౌతికంగా లేక పోయినప్పటికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆయన జన్మదినం ను ఒక పండగలా నిర్వహిస్తుంది. కాళోజి జన్మదినం అయిన సెప్టెంబర్ 9ని తెలంగాణ ప్రభుత్వం “తెలంగాణ అధికారా భాష దినోత్సవం ” గా ప్రకటించింది. కాళోజి పేరుతో సాహితి వేత్తలకు, కవులకు కాళోజి పురస్కారంను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వరంగల్ జిల్లాలోని భాల సముద్రంలో కాళోజి పేరుతో ఒక గొప్ప కళాక్షేత్రంను నిర్మిస్తుంది. వరంగల్ కాకతీయ మేడికల్ కళాశాల అవరణలో వైద్య విశ్వవిద్యాలయంకు కాళోజి పేరును నిర్ణయించింది. ప్రజాకవి అడుగుజాడల్లో ప్రభుత్వం నడుస్తూ అత్యుత్తమ ఫలితాలు సాధిస్తుంది.

మొదటి కాళోజి సరస్వతి పురస్కారంను ప్రజాకవి గోరేటి వెంకటన్నకిచ్చారు.

(సెప్టెంబర్ 9- తెలంగాణ అదికార భాష దినోత్సవం - 102వ జయంతి)

“ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక” కాళోజి

“అధికారం ఉన్నవాడే అన్యాయం చేస్తుంటే, అదుపులో పెట్టే రాజ్యం అసరాగా వినకుంటే, ప్రతిహింసకు పునుకున్న ప్రతి నరుడు నరసింహుడే” - ప్రజాకవి కాళోజి

**దొడ్డికుమార్**
**జూకల్, శంషాబాద్**

# షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల ఉప ప్రణాళిక స్థానిక అభివృద్ధి ప్రణాళిక



అనుగుణంగా మార్పులు చేర్పులు చేయబడి, చట్టములో పేర్కొన్న విధముగా ఖర్చు చేయవలసి ఉంటుంది.

ఈ చట్ట ప్రకారం ప్రతీ ఆర్థిక సంవత్సరము, ప్రభుత్వముచే అధికారము పొందిన ప్రభుత్వ శాఖ, మిగతా ప్రభుత్వ శాఖల షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికల ప్రతిపాదనలను పరిశీలించడం కొరకు పంపించవలసినదిగా కోరుట జరగుతుంది. ఆ ముసాయిదా ప్రతిపాదనల ప్రకారము ఉప ప్రణాళికలు రూపొందించబడి, సెక్షను 3 ప్రకారము నిధులు కేటాయించబడతాయి.

**ముఖ్యాంశాలు :**

షెడ్యూల్డు కులాలు మరియు తెగల నిరంతర ప్రగతితో ఆర్థిక, విద్యా, మానవ వనరుల అభివృద్ధితో పది సంవత్సరాలలో సమానత్వము సాధించి, వారికి భద్రత మరియు సాంఘిక ఔన్నత్యాన్ని సాధించుటతో పాటు, షెడ్యూల్డు కులాలు మరియు తెగల ఉపకులాల మధ్య సమానత్వము మరియు వారిలో సమతుల్యము సాధించే లక్ష్యముగా రాష్ట్ర ప్రణాళికా నిధులలో షెడ్యూల్డు కులాలు మరియు తెగల జనాభా దామాషా ప్రకారము నిధులను కేటాయించి, సమర్థవంతమైన యంత్రాంగము ద్వారా పథకాలను అమలుపరచి వారి సర్వతోముఖాభివృద్ధిని ఆశిస్తూ చట్టాన్ని చేయుట జరిగినది.

ఈ చట్టము ప్రకారము షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల అభివృద్ధికి నియమించిన రాష్ట్ర కౌన్సిల్ ఆమోదము పొంది సంబంధిత శాఖలో షెడ్యూల్డు కులాలు మరియు తెగల అభివృద్ధి సాధించుటలో ఉన్న వ్యత్యాసాలను తొలగించుటకు సాధారణ పథకాలలో షెడ్యూల్డు కులాలు మరియు తెగల అభివృద్ధికి ప్రత్యేక పథకాలకు నిధులను కేటాయించుటనే ఉప ప్రణాళికలుగా చెప్పవచ్చును.

**షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికల పథకాల, ప్రణాళిక, నిధుల కేటాయింపు :**

ఉమ్మడి రాష్ట్రం ప్రతి ఆర్థిక సంవత్సరము, ప్రణాళికా నిధుల మొత్తము నుండి షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వారికి, వారి జనాభా దామాషా ప్రకారము కేటాయించే నిధులను షెడ్యూల్డు కులాలు మరియు తెగల ఉప ప్రణాళికగా పరిగణించబడుతుంది. ఈ ఉప ప్రణాళికల నిధులను ఆర్థిక సంవత్సర ప్రారంభానికి ఆరు నెలలు ముందు కేటాయించి, రాష్ట్ర వార్షిక సాధారణ బడ్జెట్ ఆమోదమునకు

**ఈ ప్రణాళికల క్రింద చేపట్టవలసిన పథకాలు :**

వివిధ శాఖలు తయారుచేసే ఉప ప్రణాళికలు అభివృద్ధి లోపాలను సవరించేవిగా ఉంటూ, షెడ్యూల్డు కులాలు మరియు తెగల వ్యక్తులకూ, కుటుంబాలకు, వారు నివసించే ప్రాంతాల అభివృద్ధికి ఉద్దేశించినవిగా ఉంటూ, అభివృద్ధి ఫలాలు లబ్ధిదారులకు చేరే విధముగా ఉండాలి. ఈ ఉప ప్రణాళికలు ప్రణాళికా శాఖ ఇచ్చే ఆదేశాల మేరకు రాష్ట్ర వార్షిక బడ్జెట్, పంచవర్ష ప్రణాళికలు, రాష్ట్ర ప్రాధాన్యతలకు లోబడి ఉండాలి.

**ఈ ప్రణాళికల ద్వారా ఉపకులాలు అన్నింకి సమ న్యాయము :**

ప్రభుత్వ శాఖలు తయారు చేసే ఉప ప్రణాళికలు షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల ఉప కులాలకు చెందినవారందరూ సమాన లబ్ధిపొందేలా సమ న్యాయము జరిగేలా, సమతుల్యంగా అన్ని ఉపకులాలు అభివృద్ధి చెందే విధముగా ఉండాలి. షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలలో బాగా వెనుకబడిన వారి అభివృద్ధి లక్ష్యముగా ఉండాలి. షెడ్యూల్డు తెగల విషయములో షెడ్యూల్డు ప్రాంతాలలో నివసించే షెడ్యూల్డు తెగల వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గిరిజన ఉప ప్రణాళికను తయారుచేయవలసి ఉంటుంది.

**సాధారణ పథకాలలో షెడ్యూల్డు కులాలు మరియు తెగల వారికి వాటా మరియు భాగస్వామ్యము :**

ప్రజలు అందరికి సంబంధించిన సాధారణ పథకాలలో ఉప ప్రణాళికలతో సంబంధం లేకుండా అర్హులైన షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వారు అందరికి అన్ని పథకాలు, సదుపాయాలను అనుభవించే అవకాశము కల్పించవలసి ఉంటుంది.

**వివిధ శాఖల ఉప ప్రణాళికా పథకాల రూపకల్పన :**

ఈ చట్టంలోని సెక్షన్ 4 ప్రకారము సమాచారము అడిగిన తరువాత సెక్షన్ 5 లో పేర్కొన్నట్టు, రాష్ట్ర ప్రాధాన్యతలకు లోబడి ప్రతీ శాఖ, షెడ్యూల్డు కులాల మరియు షెడ్యూల్డు తెగల అభివృద్ధికి ఆటంకాలను గుర్తించి, వారి అభివృద్ధికి కావలసిన అవసరాల ప్రాధాన్యతలను గుర్తించి, చర్చల ద్వారా అభివృద్ధి పథకాలను రూపొందించవలసి ఉంటుంది.

**ఉప ప్రణాళికలను నోడల్ శాఖ పరిశీలనకు పంపుట :**

ప్రతీ శాఖ, ప్రతీ సంవత్సరము ఉప ప్రణాళికల కింద చేపట్టే పథకాలను నిర్దేశించిన సమయములోగా సంబంధిత నోడల్ శాఖకు నిర్దేశించిన నమూనాలో పరిశీలనకు పంపి, దాని ఆమోదముతో సాధారణ వార్షిక బడ్జెట్‌లలో ఉప ప్రణాళికల నిధులను పొందుపరచవలసి ఉంటుంది.

వివిధ శాఖలు పంపించిన షెడ్యూల్డు కులాలు ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళికల ముసాయిదాలను షెడ్యూల్డు కులాల నోడల్ ఏజన్సీ మరియు షెడ్యూల్డు తెగల నోడల్ ఏజన్సీలు పరిశీలించి, చట్టంలో ఉన్న నియమ నిబంధనల ప్రకారము ఉన్నదీ లేనిదీ పరిశీలించవలసి ఉంటుంది.

**ఈ ప్రణాళికల నిధుల కేటాయింపుకు నియమ నిబంధనలు :**

షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వారికి ప్రత్యేకముగా ఉపకారిగా ఉండి, షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల వ్యక్తులకు గాని, కుటుంబాలకు గాని ప్రత్యేకముగా లబ్ధిపొందే పథకాలకు 100 శాతము నిధులను షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళిక నిధుల నుండి కేటాయించవలసి ఉంటుంది.

షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల నివాస ప్రాంతాల అభివృద్ధికి దోహదపడే పథకాలకు 100 శాతము నిధులను షెడ్యూల్డు కులాలు ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళిక నిధుల నుండి కేటాయించవలసి ఉంటుంది. మిగతా ప్రాంతాలలో షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల జనాభా దామాషా ప్రకారము షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళిక కింద నిధులను కేటాయించవలసి ఉంటుంది.

అందరికీ అందుబాటులో ఉన్న సాధారణ పథకాలలో ఉప ప్రణాళిక విషయములో షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల వ్యక్తులకు ఉపయోగికారిగా ఉన్నప్పుడు, షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల లబ్ధిదారుల దామాషా ప్రకారము షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళికల నిధులను కేటాయించవలసి ఉంటుంది.

మౌలిక సదుపాయాల కల్పనలో ప్రత్యేకముగా షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగలకు నిధులను కేటాయించడానికి వీలుపడనప్పుడు ప్రభుత్వము ప్రత్యేకముగా నిర్ణయించిన మేరకు షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళిక కింద నిధులను కేటాయించవలసి ఉంటుంది.

ఈ చట్టము నిర్దేశించిన నిబంధలకు అనుకూలముగా ఉన్న అర్థవంతమైన పథకాలను బడ్జెట్ ప్రతిపానలకు ముందు సాంఘిక సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖల నోడల్ ఏజన్సీల అనుమతి పొందిన వాటిని ఉప ప్రణాళికల క్రింద పరిగణించబడానికి షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డు తెగల అభివృద్ధి కొరకు ఏర్పాటు చేసిన రాష్ట్ర కౌన్సిల్ ఆమోదము పొందవలసి ఉంటుంది.

షెడ్యూల్డ్ కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళిక అభివృద్ధి కొరకు ఏర్పాటు చేసిన స్టేట్ కౌన్సిల్ ఆమోదము పొందిన నిధులను మాత్రమే ఆయా శాఖల పద్దులలో సాధారణ వార్షిక బడ్జెట్‌లో ఉప ప్రణాళికల కింద నిధులు కేటాయించబడతాయి.

ఆర్థిక శాఖలో ఉప ప్రణాళికల అమలుకు ప్రత్యేక విభాగమును ఏర్పాటుచేసి, ఉప ప్రణాళికల చట్టము నిబంధనల మేరకు బడ్జెట్ ప్రతిపాదనలు అమలు వేసే అండ్ మీన్స్ పొజిషనులను పర్యవేక్షించుటకు ఒక కార్యదర్శిని నియమించుట జరుగుతుంది.

రాష్ట్ర వార్షిక సాధారణ బడ్జెట్‌లో షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికల కింద కేటాయించిన నిధుల మేరకు, బడ్జెట్ ఆమోదము పొందిన తరువాత సంబంధిత శాఖలకు నిబంధనల ప్రకారము శాసన సభ బడ్జెట్ మంజూరు ఉత్తర్వులను జారీ చేస్తుంది.

**రాష్ట్ర కౌన్సిల్ :**

ఈ చట్టము అమలు పర్యవేక్షణ బాధ్యతలను రాష్ట్ర ముఖ్యమంత్రి గారి అధ్యక్షతన ఏర్పడే షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల అభివృద్ధి కొరకు ఏర్పాటుచేసిన రాష్ట్ర కౌన్సిల్‌కు అప్పచెప్పడం జరిగినది. ఈ స్టేట్ కౌన్సిల్ కనీసము సంవత్సరానికి రెండుసార్లు సమావేశము కావలసి ఉంటుంది.

**రాష్ట్ర కౌన్సిల్ విధులు :**

షెడ్యూల్డ్ కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికల విధాన నిర్ణయాలకు సంబంధించిన విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి సలహాలను ఇస్తుంది.

పథకాల తయారు, అమలు విషయమై వివిధ శాఖలకు సూచనలను, సలహాలను ఇస్తుంది.

వివిధ శాఖల షెడ్యూల్డు కులాలు ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళికల వార్షిక ప్రణాళికలను ఆమోదిస్తుంది.

**నిర్ణయించిన, అనుకున్న ఇతర విధుల నిర్వహణ.**

**నోడల్ ఏజన్సీ మరియు నోడల్ శాఖలు :**

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అధ్యక్షతన ఏర్పడే నోడల్ ఏజన్సీకి, షెడ్యూల్డ్ కులాలు ఉపప్రణాళికకు మరియు గిరిజన సంక్షేమశాఖామాత్యుల అధ్యక్షతన ఏర్పడే నోడల్ ఏజన్సీకి గిరిజన ఉప ప్రణాళికల చట్టములో పేర్కొన్న మేరకు అమలు బాధ్యతలను అప్పచెప్పటం జరిగినది.

సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖలు ఈ ఉప ప్రణాళికలకు నోడల్ శాఖలుగా వ్యవహరిస్తూ సంబంధిత నోడల్ ఏజన్సీలకు సహాయ సహకారాలను అందచేస్తాయి.

**అధికారాలు :**

వివిధ శాఖలు ప్రతిపాదించిన షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికలు చట్టపరిధిలో నిబంధనల ప్రకారము ఉన్నదీ లేనిదీ పరిశీలిస్తుంది. రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికలను తయారుచేసి షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల రాష్ట్ర అభివృద్ధి కౌన్సిల్ పరిశీలనకు ఆమోదనానికి పంపిస్తుంది. షెడ్యూల్డు కులాలు ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళిక నిధులను ఒక శాఖనుండి మరియొక శాఖకు కేటాయించుట. షెడ్యూల్డ్ కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళిక క్రింద అమలు జరుగుచున్న పథకాల అమలును పర్యవేక్షిస్తూ, సమీక్షించుట. ఉప ప్రణాళికల పథకాల అమలులో ఉన్న అడ్డంకులను గుర్తించి, వాటిని అధిగమించుటకు సూచనలను చేయుట. రాష్ట్ర స్థాయి మరియు జిల్లా స్థాయి షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికల తయారీలను సమన్వయపరచుట. పారదర్శకముగా ఉండుటకు గ్రామాలవారి, పథకాలవారి, జిల్లాలవారి, లబ్ధిదారుల వివరాలు, ప్రగతి, ఖర్చు, ఫలితాలను షెడ్యూల్డు కులాల మరియు గిరిజన ఉప ప్రణాళికలో పేర్కొన్న నిబంధనలను తెలిసికొనుటకు అన్ని వివరాలను వెబ్‌పోర్టల్‌లో ఉంచవలసి ఉంటుంది. అనుకున్న లక్ష్యాలకు అనుగుణంగా మానవ అభివృద్ధి జరిగిందీలేనిది సమీక్షించుటకు, జిల్లా, రాష్ట్ర స్థాయిలో కనీసము సంవత్సరానికి ఒకసారి సామాజిక తనిఖీలను నిర్వహించవలసి ఉంటుంది. నోడల్ ఏజన్సీల సూచనలను ప్రభుత్వ శాఖలు తప్పనిసరిగా పాటించవలసి ఉంటుంది.

**సాంకేతిక సహాయము :**

నోడల్ శాఖలయిన సాంఘిక సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖల బలోపేతము చేయడానికి, పరిపాలన మరియు సాంకేతిక సహాయ యూనిట్‌ని మరియు ఉప ప్రణాళిక పరిశోధనా కేంద్రాన్ని ప్రభుత్వము ఏర్పాటు చేసి, నోడల్ ఏజన్సీ సమర్థవంతముగా పనిచేయుటకు సహాయపడుతుంది.

**సహాయక కేంద్రాలు :**

షెడ్యూల్డ్ కులాలు మరియు షెడ్యూల్డ్ తెగల ఉప ప్రణాళికలను అమలుపరచుటకు ఉప ప్రణాళిక సహాయక యూనిట్‌ని రాష్ట్ర కౌన్సిల్ ఏర్పాటు చేస్తుంది.

**జిల్లాలలో ఉపప్రణాళిక పథకాల అమలు :**

జిల్లాస్థాయిలో షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికల పథకాల అమలు బాధ్యతను జిల్లా కలెక్టరు అధ్యక్షతన ఏర్పాటుచేయబడే జిల్లా మానిటరింగ్ కమిటీని ప్రభుత్వము ఏర్పాటు చేస్తుంది. జిల్లా ప్రణాళికా కమిటీలకు షెడ్యూల్డు కులాల మరియు గిరిజన ఉప ప్రణాళికల అమలును సమీక్షించే బాధ్యతలను అప్పచెప్పుట జరిగినది.

**సమర్థవంతముగా ఉప ప్రణాళికల అమలుకు ఏర్పాటు :**

సమర్ధవంతముగా పథకాల అమలుకు, సమన్వయానికి సంస్థాగతముగా బలోపేతము చేస్తూ, సిబ్బందిని కేటాయిస్తూ వారికి దిశా నిర్దేశాలను, ఆదేశాలను జారీచేస్తూ, శిక్షణ ఇచ్చుటకు రాష్ట్ర, జిల్లా, ఉప జిల్లాస్థాయిలలో విభాగాలను ఆయా ప్రభుత్వ శాఖలు ఏర్పాటు చెయ్యాలి.

**ఉప ప్రణాళికల అమలులో జవాబుదారీ తనము మరియు పారదర్శకత:**

షెడ్యూల్డు కులాలు ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉపప్రణాళికల పథకాల అమలు అన్ని స్థాయిలలోను జవాబుదారీగా ఉంటూ పారదర్శకముగా ఉండానికి అన్ని శాఖలు తగు చర్యలు తీసుకోవాలి. ప్రతీ శాఖ ఉప ప్రణాళికలకు సంబంధించిన పథకాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలి.

**ప్రోత్సాహకాలు మరియు శిక్షలు :**

ఈ చట్టము అమలులో సమర్థవంతముగా పనిచేస్తూ, ఉన్నత ప్రమాణాలతో అత్యుత్తమ సేవలు అందించిన వారికి ప్రోత్సాహకాలు ఇచ్చుటకు మరియు బాధ్యతారాహిత్యముగాను, నిర్లక్ష్యముగాను పనిచేసే వారికి సంబంధిత సర్వీసునిబంధనల ప్రకారము వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకొనుటకు ప్రభుత్వము విధివిధానాలను తయారు చేస్తుంది.

**వార్షిక నివేదికలు :**

షెడ్యూల్డు కులాలు ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళికల అమలులో శాఖాపరంగా సాధించిన ప్రగతిని మరియు మురిగిపోయిన నిధుల వివరాలను తెలియచేస్తూ నివేదికలను ప్రతీ ఆర్థిక సంవత్సరము నోడల్ ఏజన్సీలు శాసనసభకు సమర్పించవలసి ఉంటుంది. షెడ్యూల్డు ప్రాంతాలకు సంబందించినంత వరకు గిరిజన ఉపప్రణాళిక నివేదికను ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలిని సంప్రదించి గవర్నరుకు సమర్పించవలసి ఉంటుంది.

**నియమనిబంధనల రూపకల్పనలో ప్రభుత్వ అధికారాలు :**

ఈ చట్టము పరిధిలోని ఇతర నియమ నిబంధనలకు లోబడి నోటిఫికేషను ద్వారా ఈ చట్టము అమలుకు సంబంధించి నియమనిబంధనలను తయారు చేసే అధికారము ప్రభుత్వానికి ఉంటుంది. ఈ క్రింది విషయాలలో ఇతర అంశాలకు విఘాతము కలగకుండా ప్రభుత్వము నియమనింబంధనలను తయారు చేస్తుంది:

సెక్షను 2 ప్రకారము షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల అభివృద్ధికి ఉన్న అడ్డంకులను గుర్తించుట.

సెక్షను 3 ప్రకారము ప్రణాళికా నిధులనుండి షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికలకు నిధుల కేటాయింపులు.

సెక్షను 8 ప్రకారము షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉపప్రణాళికల కింద అమలుకు పథకాలను గుర్తించి వాటి ఆధారముగా శాఖలపరముగా ఉపప్రణాళికలు తయారు చేయుట.

సెక్షను 9 ప్రకారము నోడల్ శాఖల పరిశీలనకు షెడ్యూల్డు కులాల మరియు గిరిజన ఉప ప్రణాళికలు తయారుచేయుట.

సెక్షను 14 ప్రకారము షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉపప్రణాళికల నిధుల వినియోగాన్ని సమీక్షించుట, ఆర్థిక శాఖను బలోపేతము చేయుట.



సెక్షను 16 ప్రకారము షెడ్యూల్డు కులాలు మరియు షెడ్యూల్డు తెగల అభివృద్ధికి స్టేట్ కౌన్సిల్ పరిపాలన, మెంబర్ల అర్హతలు, అనర్హతలు మరియు అనధికార సభ్యులకు జీతభత్యాల విషయమునకు సంబంధించి.

సెక్షను 18 ప్రకారము షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉప ప్రణాళికల అమలుకు నోడల్ ఏజన్సీల ఏర్పాటు.

సెక్షను 19 ప్రకారము నోడల్ ఏజన్సీల వెబ్ పోర్టల్‌ని నిర్వహించుట.

సెక్షను 20 ప్రకారము షెడ్యూల్డు కులాలు ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉపప్రణాళిక అమలు కొరకు సంబంధిత నోడల్ శాఖలకు పరిపాలన మరియు సాంకేతిక సహాయక విభాగాన్ని ఏర్పాటుచేయుట

సెక్షను 21 ప్రకారము ప్రతీ శాఖకు ఉప ప్రణాళిక సహాయ విభాగము ఏర్పాటు.

సెక్షను 22 ప్రకారము జిల్లాల పర్యవేక్షక కమిటీల నియామకము మరియు వాటికి సంబంధించిన విషయాలు.

సెక్షను 23 ప్రకారము షెడ్యూల్డు కులాల ఉప ప్రణాళిక మరియు గిరిజన ఉప ప్రణాళికలు సమర్ధవంతముగా సమన్వయ పరిచి, అమలుపరచుటకు రాష్ట్ర స్థాయి, జిల్లాస్థాయి మరియు జిల్లాల క్రిందస్థాయి వ్యవస్థల బలోపేతము చేస్తూ, ప్రజల భాగస్వామ్యముతో చైతన్యము తీసుకువచ్చి, సమర్ధవంతముగా పథకాల అమలు, పర్యవేక్షణకు, సాంఘిక తనిఖీలకు సంబంధించి; మరియు

సెక్షను 24 ప్రకారము షెడ్యూల్డు కులాలు మరియు గిరిజన ఉపప్రణాళికల అమలు విషయమై జవాబుదారీతనము మరియు పారదర్శకతలకు సంబంధించి నిబంధనల తయారు;

ఈ చట్టమునకు సంబంధించి చేసిన ప్రతీ నియమనిబంధనలను, సవరణలు, మార్పులు, చేర్పులు 14 రోజులలోగా శాసనసభ ముందు ఉంచి, శాసనసభ ఆమోదము పొందిన తరువాత గెజిట్‌లో ప్రకటించిన తేదీ నుండి ఆ సవరణలు, మార్పులు, చేర్పులకు సంబంధించిన నియమ నిబంధనలు అమలులోకి వస్తాయి.

**చట్టము అమలో అవరోధాలను తొలగించుట :**

ఈ చట్టము అమలుకు ఏవైనా అవరోధాలను గుర్తించినా, అవరోధాలు వచ్చినా ఆ అవరోధాల నిరోధానికి మరియు ఆ అడ్డంకులను తొలగించుటకు ఈ చట్టము అమలుకు ఆటంకముకలగని విధముగా ప్రభుత్వము ఉత్తర్వులను జారీచేస్తుంది. ఈ అధికారము చట్టము అమలులోకి వచ్చిన రెండు సంవత్సరాలలోపు మాత్రమే ఉంటుంది.

ఈ సెక్షను ప్రకారము చేసిన ప్రతి ఉత్తర్వు సాధ్యమైనంత త్వరగా రాష్ట్ర శాసన సభ ముందు ఆమోదము కొరకు ఉంచవలసి ఉంటుంది.

**ముగింపు :**

ప్రభుత్వం ఎన్ని చట్టాలను తీసుకువచ్చినప్పటికి దానిని అమలు చేసే యంత్రాంగం సక్రమంగా వాటిని అమలుచేయనప్పుడు మరియు ప్రజల భాగస్వామ్యం పూర్తిస్థాయిలో లేనప్పుడు ప్రభుత్వం నుండి ప్రజలకు ఆ ఫలాలు అనుకున్న స్థాయిలో అందడం లేదు అని చెప్పడంలో ఏ మాత్రం సందేహం లేదు.

**– కోటా మోహన్‌రావు**
**టి-సిపార్డ్**

# రైతుకు మేలు చేసే కొన్ని వ్యవసాయ సూచనలు

ప్రతికూల వాతావరణ పరిస్థితులు అంటే ఋతుపవనాల రాక ఆలస్యం కావటం, పొడి వాతావరణం, బెట్ట పరిస్థితులు, వరదలు, అకాల వర్షాలు, అకస్మాత్తుగా వడగళ్లు పడటం, వేడిగాలులు మరియు ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు వంటివి పంట దిగుబడిపై గణనీయ ప్రభావం చూపిస్తాయి.

రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ వాతావరణ విభాగం రాష్ట్రం మొత్తానికి మరియు దక్షిణ తెలంగాణా మండలానికి సంబంధించిన వాతావరణాధారిత వ్యవసాయ సలహాలను క్రోడీకరించి ప్రభుత్వం వారికి మరియు దూరదర్శన్, రేడియో మరియు పత్రికల ద్వారా రైతులకు అందజేస్తుంది. ఈ సలహాలను అనుసరించి రైతులు తగిన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టి పంట నష్టం మరియు ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకుని అధిక లాభాలను పొందవచ్చును.

**వాతావరణాధారిత వ్యవసాయం సూచనలు:**

1. జూన్ 1 తర్వాత 60-75 మి.మీ. వర్షపాతం పడినట్లయితేనే వర్షాధార పంటలను విత్తుకోవాలి.
2. ఎరువులు వేసే ముందు నేలలో తగినంత పదును ఉండాలి లేదా 20-25 మి.మీ. వర్షపాతం కురిసిన తర్వాత మాత్రమే ఎరువులను వేసుకోవాలి.
3. పంట మధ్యలో బెట్ట పరిస్థితులు ఏర్పడితే వర్షాధారపు పంటల్లో అంతరకృషి చేయాలి.
4. విత్తిన 48 గంటలలోపు పొలంలో తగిన తేమ చూసుకుని కలుపు మందును పిచికారి చేయాలి.
5. కలుపు మందులు పిచికారీ చేసిన తర్వాత కనీసం 4-6 గంటలు వర్షం లేకుండా ఉండాలి.
6. గాలి వేగం 15 కి.మీ. కంటే ఎక్కువ ఉంటే క్రిమిసంహారక మందులు మరియు కలుపు మందులు పిచికారీ చేయరాదు.
7. వర్ష సూచన ఉంటే క్రిమిసంహారక మందులు పిచికారీ చేయరాదు.
8. క్రిమిసంహారక మందులు పిచికారీ చేసిన తర్వాత కనీసం 6 గంటలు వర్షం లేకుండా ఉండాలి.
9. వర్ష సూచన ఉన్నచో నీటి తడులు ఇవ్వడం ఆపాలి.
10. వరి నాటిన 4-5 రోజుల వరకు మరియు పిలకలు తొడిగే దశలో 2 సెం.మీ. నీరు పెట్టాలి.
11. వరిలో అంకురల దశ నుండి గింజ గట్టిపడే వరకు 5 సెం.మీ. లోతు నీరు పెట్టాలి.
12. మొక్కజొన్నలో జల్లు మరియు పీచు దశలలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.
13. ప్రత్తిలో విత్తిన 15 రోజులకు అటు తర్వాత పూత దశకు వచ్చే ముందు వర్షాలు లేనట్లయితే ఒకసారి నీరు కట్టాలి. పూత దశ నుండి కాయ పెరిగే దశ వరకు నీటి ఎద్దడి లేకుండా చూడాలి.
14. వేరుశనగలో పూత దశ, ఊడలు దిగే సమయం మరియు కాయ పెరిగే సమయంలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.
15. ప్రొద్దు తిరుగుడులో మొగ్గ తొడుగు, పూత మరియు గింజకట్టే దశలలో నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి.

**డి.రాజశేఖర్, బి.రాజశేఖర్, కె.మహేష్‌చౌహాన్, ఎల్.మహేష్, కె.మానస, పి.సాధ్వీ, బి.క్రాంతికుమార్, ఎమ్మెస్సీ రీసర్చర్స్, పిజెటిఎస్ఎయు, రాజేంద్రనగర్.**






# కాలాన్ని బట్టి మారాలె!

ఒగ్గుకథ ఒక ప్రాచీన జానపద కళారూపం. గొప్పగా జనాదరణ పొందిన కళారూపం గూడా. కుర్మయాదవ కులస్థుల ఇండ్లల్లో శుభకార్యాలు, పెండ్లిళ్లు, పండుగుల సందరరేగా ఈ ఒగ్గుకథలు చెబుతారు. ఒగ్గు కళాకారులలో చదువుకున్నవారు చాలా తక్కువ. అయినప్పటికీ సుమారు అరవై డెబ్బై కథలు నేర్చుకొని, జ్ఞాపకముంచుకొని అవలీలగా చెబుతుంటారు. జ్ఞాపక శక్తి, లయ, సంగీత జ్ఞానము, నాట్య ప్రావీణ్యం, చతురత కలిసిన ఈ ఒగ్గు కథ కళారూపాన్ని ప్రత్యామ్నాయ కళా రూపంగాఎట్లా మలచవచ్చో చెప్పే ప్రత్యేక వ్యాసం ఇది.

ఒగ్గు కళాకారుల వేషధారణ, వారు ఏపయోగించే వాయిద్యాలు సాధారణమైనవే.డోలు వీరి ప్రధాన వాయిద్యం. కొందరు డమరుకంను కూడా ఉపయోగిస్తారు. దీనినే ఒగ్గు అని కూడా అంటారు. కంచు తాలం జోడును లయబద్ధంగా వాయిస్తుంటారు. కాళ్ళకు గజ్జెలు కట్టుకొని ఆయా దరువులకు అనుగుణంగా ఆడుతూ కథ చెబుతుంటారు. చేతిలో పొన్ను గర్ర పట్టుకొని ఆకర్రను అటూ ఇటూ ఊపుతూ కథ చెబుతుంటారు. ప్రత్యేకమైన డ్రెస్సులంటూ వీరికేమి వుండవు. పంచె అంగీలు ధరించి నడుంకు ఒక పట్టీకట్టుకుంటారు. చెవులకు కమ్మలు ధరించి మెడలో పూసల దండల్లాంటివి వేసుకుంటారు.

కథకు ముందు వీరు గంగా దేవిని శరణుశరణు మా గంగా భవానీ అంటూ స్తుతిస్తూ కథ మొదలుపెడతారు. తర్వాత శివుని గురించి ప్రార్థిస్తూ కథలోకి వస్తారు. వీరు చెప్పేకథలల్లో ఎక్కువగా శివుని మహిమలతో కూడిన కథలుంటాయి. మల్లన్న కథ, మాంధాత కథ, బీరప్ప కథ, ఎల్లమ్మ కథ, పెదరాజు పెద్దమ్మ కథ, నల్లపోశమ్మ కథ వంటివి వీరు చెప్పే కథల్లో ప్రధానమైనవి. ఇవి కాకుండా ఇంకా అనేక కథలను నేర్చుకొని గ్రామాలు తిరుగుతూ ప్రదర్శనలిస్తూంటారు. ఈ కథలు చెప్పే వారిలో చుక్కాసత్తయ్య, మిద్దెరాములు చాలా ప్రఖ్యాతి చెందిన వారిగా చెప్పవచ్చు. వీరు చెప్పిన కథలు వింటుంటే ఆద్యంతం రసవత్తరంగా వుంటాయి. హాస్య, కరుణ, దు:ఖ, రౌద్ర, బీభత్సం లాంటి నవరసాలు కథలో కన్పిస్తాయి.

తెలంగాణ ప్రాంతంలో ఒగ్గుకథ చాలా ప్రాచుర్యం పొందిన కళారూపం. ఎల్లమ్మకథను వింటే ఏడవని వారుండరు. కొమరవెల్లి, అయినవోలు లాంటి దేవస్థానాలలో వీరు ఒగ్గు పూజారులుగా వున్నారు. మరి కొంతమంది కళాకారుల బృందాలుగా ఏర్పడి కథలు చెప్పి పారితోషికం తీసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. నేటికి గ్రామాలలో పట్టణశివారు ప్రాంతాలలో ఎవరైనా చనిపోతే శవం దగ్గర రాత్రి వేళల్లో కథలు చెప్పి జీవనం గడుపుతున్నారు.

నేటి టి.వి ప్రపంచంలో వీరి కథలకు అంతగా ఆదరణ లేకుండా పోయింది. చుక్కాసత్తయ్య వంటి కొంతమందికి మాత్రమే సర్కారు గుర్తింపు లభించి అవార్డులు, మన్ననలు సత్కారాలు లాంటివి దక్కినవి.

### భయానకం ఆ వాతావరణం

మన తెలంగాణ ప్రాంతంలో వందలాది ఒగ్గు కళా బృందాలు సరియైన ఆధరణ లేనందున ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. టివిలు ఇంటిని ఆక్రమించిన తరుణంలో నేటి ప్రజానీకం ఈ ఒగ్గుకథలను పట్టించుకోవటం లేదు. ఇంతకు ముందు తరం ఒగ్గు కథ కళాకారుల పిల్లలు సైతం ఈ కళారూపాన్ని నేర్చుకోవడం కోసం ముందుకు రావటం లేదు. జాతర్లు, బోనాలు వంటి ప్రదర్శనల్లో ఈ ఒగ్గు కళాకారులు పఠించే బీజాక్షరాలతో కూడిన ఖడ్గాలు, కత్తులతో నృత్యాలు, డోలును నోటితో కరిచిపట్టి చేసే విన్యాసాలు చూపరులకు భయంగొలిపే రీతిలో వుంటాయి. వాయిద్యం చప్పుడుకు వారు చేసే న ృత్యాలకు, గుగ్గిలం మైశాచి పొగలకు పసుపు బండారుతో ఒక ప్రత్యేక భయానక వాతావరణం ఏర్పడుతుంది. ఈ వాతావరణంలో గ్రామీణ స్త్రీలు కొందరు పూనకం వచ్చి వూగుతూ ఆకర్షణగా నిలుస్తారు.

సినిమాలు పౌరాణికం నుండి జానపదం, సాంఘిక చిత్రాలుగా రూపొందినట్లు ఈ ఒగ్గు కథలు రూపాంతరం చెందలేదు. ఎనుకటి నుండి అవే ఎల్లమ్మ, మల్లన్న, మాంధాత, బీరప్ప కథలు.. నేటికీ అదే రూపంలో ప్రదర్శిస్తున్నారు. కొత్తదనం లేకపోవడం వలన ఆధునిక పద్ధతులలో ఆకర్షణీయంగా తయారుచేయక పోవడం వలన జనం నుంచి దూరమౌతున్నా యి ఇటువంటి కళా రూపాలు. అందుకే కాలాన్ని బట్టి మారాలె!

### బంతిపూల జెడలెయ్యవమ్మా..

ఇటువంటి ప్రత్యేక పరిస్థితులలో ఒగ్గుకథను బాగా ఇష్టపడేవాడిని కనుక నేటి ప్రజాసమస్యలను ఈ రూపంలో ప్రజల వద్దకు చేర్చాలని 1991లో మొట్టమొదటి ప్రయత్నం చేశాను. ఆ ప్రయత్నం విజయవంతమైంది కూడా. అక్షరాస్యతపై రాసిన ఆనాటి ఒగ్గుకథలో అత్తాకోడళ్ల మధ్య చదువు గురించి జరిగే ఒక సంవాదం చూపరులను బాగా ఆకట్టుకుంది. రాత్రి వేళల్లో ప్రదర్శన సాగుతుంటే నిద్రబోయిన వాళ్ళను పక్కవాళ్ళు నీల్లుచల్లి లేపి కూర్చోబెట్టి కథను చూసేలా చేసేవారు.

రెండవ ప్రయత్నంలో భాగంగా ఆడపిల్లలపై చూపే వివక్షతకు సంబంధించిన అంశం తీసుకొని ఆడపిల్ల బతుకు అనే ఒగ్గు కథను రాశాను. ఈ కథను రంగారెడ్డి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చారు. ''బంతిపూల జెడలెయ్యవమ్మా బడికి నన్ను పంపించవమ్మా'' అని తల్లిని బిడ్డ నిలదీసిన సంవాదంబీ ''ఒక్క బిడ్డ చాలు ఓ బావగారు నా బావగారు ఆపరేషన్ తోటి ఆపుకుందాము హాయిగుందాము'' అని కుటుంబ నియంత్రణ గురించి చెప్పిన సన్నివేశం చాలా ఆకర్షణీయంగా నిలిచాయి.

మూడవ కథ 'అప్పుల ఆంధ్ర' అనే పేరుతో ప్రపంచ బ్యాంకు షరతుల ప్రభావం మన ప్రజానీకంపై ఎలాంటి ప్రభావం చూపుతుందో అందులో తెలియజేయడం జరిగింది.

బహుళజాతి కంపెనీలు నకిలీ విత్తనాలు మంచివని చెప్పి అమ్మిమోసం చేసిన తీరుతో పత్తివిత్తనాల మానిశాంటో కంపెని నిజ స్వరూపం బయటపడింది. మార్కెట్లులో రైతును నిలువునా దోచే దళారి విధానం గురించి చెప్పిన కథలో రైతాంగం బాగా తెలుసుకున్నారు. ఖమ్మంలో ఒక సభలో ఈ కళారూపాన్ని ప్రదర్శించేటప్పుడు కంటతడి పెట్టని రైతు లేడంటే అతిశయోక్తి కాదు. రైతు బతుకు అనే ఈ కథ నేటికీ ప్రజానాట్యమండలి దళాలు ప్రదర్శిస్తూనే వున్నాయి.

కులవివక్షత పై కె.వి.పి.ఎస్ చేపట్టిన సైకిల్‌యాత్ర సందర్భంగా తయారుచేసిన 'అంటరానోళ్ళ కథ 'అనే ఒగ్గు కథ తమిళనాడులోని కోయంబత్తూరులో కూడా ప్రదర్శించారు. మన రాష్ట్రంలో కూడా బాగా జనాదరణ పొందిన కళారూపం ఇది.

1994లో మొట్టమొదటిసారి గ్రామీణ ఉపాధిహామీ పథకం ప్రచారంలో రాసిన ఒగ్గు కథను అందరు అవలీలగా పాడుకున్నారు. ఆడమగ తేడా చూపెట్టకుండా సమానపనికి సమాన వేతనం అనే నినాదంతో ఆనాడు ఈ కథ బాగా ప్రచారమయ్యింది.

వరంగల్‌లో జరిగిన ప్రజాతంత్ర ఉద్యమ మహాసభలప్పుడు రాసిన పోరుబాట అనే ఒగ్గు కథ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని తెలిపిన తీరు జనాలలో బాగా ఉత్సాహం నింపింది. భూస్వామ్య శక్తులు సామాన్యులతో వెట్టిచాకిరి చేయించుకున్న తీరు రజాకార్ల జులుం ప్రజల తిరుగుబాటు, భూమి పంపకం వంటి విషయాలపై జనాలకు బాగా వివరించడం జరిగింది. ఈ కథ ద్వారా.

పైన పేర్కొన కథలు చెబుతుంటే కొన్ని సందరాలేలో నాకు తెల్సిన కొంత మంది ఒగ్గు కళాకారులు ''సతైన్న కథ చెప్పడం మొదలు పెడితే మా కథలు మున్ముందు వినేవారు కరువౌతార''ని అన్న సందరాలు కూడా వున్నవి.

'ఆడపిల్ల బతుకు' ఒగ్గుకథ చెప్పే సమయంలో జోలపాట సన్నివేశంలో కళాకారులు జనం దగ్గరికి వెల్లి జోలెపట్టి అడిగి వసూలు చేసిన డబ్బులు దాదాపు లక్ష వరకు వుంటాయి. జనం స్వచ్ఛందంగా కళారూపానికి స్పందించి ఇచ్చిన విరాళరూపమే ఇది.

నేటి పేద మధ్యతరగతి ప్రజానీకం సంసారాలను ఈదలేక.. పేదరికానికి కారణం తెలుసుకోలేక మూఢనమ్మకాల బారినపడి మోసపోతున్న తరుణంలో ప్రజాసమస్యలను ఈ ఒగ్గుకథా రూపంలో చెబితే గ్రామీణ ప్రాంతపు ప్రజలు విననివారంటు వుండరు. ప్రజలకున్న ప్రతి సమస్యను ఈ రూపంలో ఆకట్టుకునే విధంగా చెప్పవచ్చు.

ప్రత్యామ్నాయ కళారూపాలను సృష్టిస్తే ప్రజలు వాటిని సొంతం చేసుకుంటారని పైన చెప్పిన కథల అనుభవం మనకు చెబుతుంది. అలా చేయడం వల్ల ప్రజలు చైతన్యవంతమవుతారు. సమస్యల నుండి బయటపడే మార్గం వారికి తెలుస్తుంది. ఇది నేటి ప్రజాకళాకారుల ప్రథమ కర్తవ్యంగా భావించాలి.

**- బండి సతైన్న**


# తెలంగాణ సాహిత్య రంగంలో ప్రముఖులు

ఇరవయ్యో శతాబ్దంలో తెలంగాణ సామాజిక చరిత్రలో కొత్త అధ్యాయాల్ని లిఖించడంలో స ృజనశీలుర పాత్ర ఉదాత్తమైంది. సాంస్కృతిక చైతన్యం మూలంగా వెల్లువెత్తిన సామాజిక, రాజకీయ ఉ ద్యమాలు తెలంగాణ ప్రయాణాన్ని మలుపు తిప్పాయి. దీనికి కారణమైన కవులు, రచయితలు, మేధావులు తెలంగాణ వైతాళికులుగా ప్రసిద్ధి చెందారు. ఈ కోవకు చెందిన వారి క ృషిని స్మరించుకోవడం మన కర్తవ్యం. అందువల్లనే తెలంగాణ రాష్ట్రంలో పోటీపరీక్షల సిలబస్‌లో సాహిత్య, సాంస్కృతిక రంగాలకు చెందిన వైతాళికుల క ృషి ప్రత్యేక భాగమైంది.

తెలంగాణ నేల మీద రచయితలు, కవులు కేవలం సాహిత్య రంగానికి పరిమితమై లేరు. సామాజిక, రాజకీయ ఉద్యమాల్లోనూ ప్రముఖ పాత్ర వహించారు. సంఘ సంస్కరణ కోసం కృషి చేశారు. నిజాం ప్రభువుల నిరంకుశత్వం మీద పోరాటానికి జనావళిలో చైతన్యం పాదు కొల్పారు. హైదరాబాద్ రాష్ట్రం చివరి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు జీవితమే ఇందుకు ప్రబలమైన ఉదాహరణ. తొలుదొలుత తెలంగాణ ప్రజల్లో సాహిత్య, సాంస్కృతిక చైతన్యాన్ని ప్రోది చేసేందుకు అనువైన పూర్వరంగం ఏర్పడటానికి కారణమైన వారిలో కొంతమందిని మొదట తలచుకోడం అవసరం.

## మాడపాటి హనుమంతరావు

**(22 జనవరి 1885–11 నవంబర్ 1970)**



కృష్ణాజిల్లా నందిగామ తాలూకా పోకునూరు గ్రామంలో జన్మించారు. అయిదేళ్ళ వయసులోనే తండ్రి చనిపోవడంతో సూర్యాపేట తహశీలు ఆఫీసులో పనిచేస్తున్న జమలాపురం వెంకట్రావు దగ్గరకు వచ్చి చదువుకున్నారు. హనుమంతరావు విద్యాభ్యాసం జడ్చర్ల, నల్లగొండ, వరంగల్ పట్టణాలలో జరిగింది. కొన్నాళ్ళు హనుమకొండలో ఉద్యోగం చేశారు. ఆ తర్వాత హైదరాబాద్ వచ్చి లా పూర్తి చేశారు. 1917 నుంచి న్యాయవాద వ ృత్తిలో స్థిరపడ్డారు.

- హనుమంతరావు తొలుత గ్రంథాలయోద్యమంలో భాగస్వాములయ్యారు. హనుమకొండ, హైదరాబాద్‌లో గ్రంథాలయాల స్థాపనలో పాల్గొన్నారు. శ్రీక ృష్ణదేవ రాయాంధ్ర భాషా నిలయం పురోభివ ృద్ధికి క ృషి చేశారు. 1912లో 'లా' చదవడానికి వచ్చినప్పట్నుంచి భాషా నిలయం సభ్యులుగా ఉ న్నారు. 1914–15 కాలంలో భాషా నిలయం కార్యదర్శిగా పనిచేశారు.
- తెలంగాణలో ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభ వంటి ప్రజా సంఘాల స్థాపనలో కీలకపాత్ర వహించారు. తద్వారా ఆంధ్రోద్యమానికి పునాదులు వేశారు. నిజాం రాష్ట్ర ఆంధ్ర జనసంఘం స్థాపనలో ప్రముఖపాత్ర వహించారు.
- భారతదేశంలో ప్రప్రథమ బాలికోన్నత పాఠశాలని మాడపాటి హనుమంతరావు ఏర్పాటు చేశారు. ఇది ఇప్పటికీ హైదరాబాద్‌లోని నారాయణగూడలో వుంది. ప్రత్యేకించి బాలికల కోసం మరెన్నో పాఠశాలలు ఏర్పాటు చేశారు.
- మాడపాటి వారు స్వయంగా కవి, రచయిత, అనువాదకులు. మొత్తం పదమూడు కథలు రాశారు. 'మల్లికాగుచ్ఛము' శీర్షితో పుస్తకంగా 1911లో ప్రచురించారు. ఇందులో ఏడు కథలు మాత్రమే ఉన్నాయి. భండారు అచ్చమాంబ కథలు లభ్యం కానంతవరకు తెలంగాణలో తొలి కథకునిగా మాడపాటి హనుమంతరావు గారిని పరిగణించారు.
- మాడపాటి వారు తొలుత బంకించంద్ర 'ఆనందమఠం' నవలను తెలుగులోకి అనువాదం చేశారు. కానీ ఇది అచ్చు కాలేదు. అలాగే గ్యారిబాల్డి జీవితచరిత్రను రచించారు కానీ అచ్చు వేయలేదు.
- నీలగిరి, తెనుగు, సుజాత, కృష్ణాపత్రిక, తెలంగాణా, గోలకొండ, దేశబంధు, ముషీరె దక్కన్ పత్రికలకు అనేక కథలు, వ్యాసాలు రాశారు.

**ఇతర పుస్తకాలు**


1. రోమన్ సామ్రాజ్య చరిత్రము
2. క్షేత్రకాలపు హింద్వార్యులు
3. మహాభారత సమీక్ష
4. తెలంగాణా ఆంధ్రోద్యమం

- మాడపాటి హనుమంతరావు రచించిన కథలలో హ్ృదయశల్యము, ఎవరికి, ముసలిదాని ముసురు, ఆత్మార్పణ, ఎవరి తప్పు?, న్యాయమా?, నిజమేనా? ఇక కావలసినదేమి? కథలు ప్రసిద్ధి చెందాయి.
- రాజకీయరంగంలోనూ చురుకైన పాత్ర వహించారు హనుమంతరావు. ఆంధ్ర మహాసభ, కాంగ్రెస్ పార్టీల రాజకీయ కార్యకలాపాల్లో ప్రముఖంగా పాల్గొన్నారు.
- 1952 ఎన్నికలలో మెదక్ జిల్లా గజ్వేల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు.
- హైదరాబాద్ తొలిమేయర్‌గా పనిచేశారు.
- 1958లో ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యునిగా ఎన్నికయ్యారు.

- 1958 నుంచి 1964 వరకు శాసనమండలి చైర్మన్‌గా పనిచేశారు.
- హనుమంతరావును తెలంగాణలో ఆంధ్రోద్యమం ద్వారా జనచైతన్యానికి పాదులు వేసినందుకుగాను 'ఆంధ్ర పితామహుడు' అనే బిరుదుతో వ్యవహరిస్తారు.
- ఉస్మానియా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది.
- భారత ప్రభుత్వం పద్మభూషణ్‌ని అందించి గౌరవించింది.

## సురవరం ప్రతాపరెడ్డి

**(28 మే 1896–25 ఆగస్టు 1953)**



మహబూబ్‌నగర్ జిల్లా ఇటిక్యాలపాడు గ్రామంలో జన్మించారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఏ, తిరువాన్కూరులో బి.ఎల్. చదివారు.

- పత్రికా సంపాదకుడు, పరిశోధకుడు, పండితుడు, కవి, రచయిత, ప్రేరకుడు, క్రియాశీల ఉద్యమకారుడు, తెలంగాణ సాహిత్యోద్యమ దీపధారిగా సురవరం ప్రతాపరెడ్డిని చెప్పుకోవచ్చు.
- తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ, ఆంగ్లం మొదలైన భాషలలో ప్రావీణ్యులు
- 3 మే 1925న ద్వైవార పత్రికగా గోలకొండ పత్రికని ప్రారంభించారు. వారి సంపాదకీయాలు నాటి నిజాం ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించాయి.
- 1930లో మెదక్ జిల్లా జోగిపేటలో జరిగిన తొలి ఆంధ్ర మహాసభకు అధ్యక్షత వహించారు. ఆంధ్ర మహాసభ కార్యకలాపాలన్నీ తెలుగులోనే జరగాలంటూ తీర్మానం చేయించారు.
- 1934లో తన సంపాదకత్వంలో గోలకొండ కవుల సంచికను తీసుకొచ్చారు. దీనిలో నాడు తెలంగాణలోని 354 మంది కవుల కవితలు, పద్యాలున్నాయి.
- 1942లో ఆంధ్ర గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు.
- 1943లో ఖమ్మంలో జరిగిన గ్రంథాలయ మహాసభకు అధ్యక్షత వహించారు.
- 1944లో ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షునిగా ఉన్నారు.
- 1951లో ద్విదినపత్రికగా 'ప్రజావాణి'ని ఆరంభించారు.
- గ్రంథాలయోద్యమంలో ప్రముఖపాత్ర వహించి గ్రామగ్రామాన గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేశారు.
- 1952లో వనపర్తి నుంచి హైదరాబాద్ రాష్ట్ర శాసనసభకు శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు.


**ప్రసిద్ధ రచనలు**

1. ఆంధ్రుల సాంఘిక చరిత్ర
2. హిందువుల పండగలు
3. హైందవ వీరులు
4. రామాయణ విశేషాలు
5. సంఘోద్ధరణ
6. మొగలాయి కథలు
7. ఉచ్ఛల విషాదం, తుకారం నాటికలు
8. హంవీర సంభవం
9. కోత్వాల్ రాజబహద్దూర్ వెంకట్రామిరెడ్డి జీవితచరిత్ర

- ఇటీవలి కాలంలో సురవరం కవిత్వం, సురవరం వారి తెలంగాణ వ్యాసాలు, కథలు ప్రత్యేక సంపుటాలుగా వచ్చాయి.
- ఆంధ్రుల సాంఘిక చరిత్ర – కేంద్ర సాహిత్య అకాడెమీ వారు ఉత్తమ గ్రంథం పురస్కారాన్ని అందుకుంది.

## బూర్గుల రామకృష్ణారావు

**(13 మార్చి 1899–14 సెప్టెంబర్ 1967)**



హైదరాబాద్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన బూర్గుల రామకృష్ణారావు బహుభాషా కోవిదులు. రచయిత, కవి, పండితులు. తెలంగాణ నవజాన్ని చైతన్యపథంలో నడిపిన విశిష్ట మేధావి. మహబూబ్‌నగర్ జిల్లాలో జన్మించారు. స్వగ్రామం బూర్గుల. ఇంటి పేరు పుల్లంరాజు. అయితే ఊరు పేరే వారి ఇంటిపేరుగా ప్రసిద్ధి చెందింది.

- పునె, ముంబయిలలో చదువుకున్నారు. పునెలో చదవడం వల్ల స్వాతంత్ర్యోద్యమ ప్రభావం వీరి మీద పడింది. రాజకీయ రంగంలోకి రావడానికి దోహదం చేసింది.
- 1923లో హైదరాబాద్‌లో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు.
- న్యాయవాదిగా పనిచేస్తూనే ఆంధ్రోద్యమం, గ్రంథాలయో ద్యమం, భూదానోద్యమం నిర్మాణాల్లో కీలకపాత్ర వహించారు.
- 1916లోనే హైదరాబాద్ యంగ్‌మెన్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసి వ్యవస్థాపక కార్యదర్శి అయ్యారు.

- 1923లో కాకినాడలో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు ప్రతినిధిగా హాజరయ్యారు.
- 1927లో శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం కార్యదర్శిగా పనిచేసి గ్రంథాలయ రజతోత్సవాల్ని ఘనంగా జరిపించారు.
- 1931లో దేవరకొండలో జరిగిన ఆంధ్ర మహాసభ ద్వితీయసభకు అధ్యక్షత వహించారు. నాడు తెలంగాణలో జరిగిన ఆంధ్రమహాసభ సమావేశాలన్నిటికి వారు హాజరయ్యారు.
- 1938లో హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ వ్యవస్థాపనలో కీలకపాత్ర పోషించారు.
- 1942లో క్విట్ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు.
- 1947లో నిజాం ప్రభుత్వం బూర్గుల వారిని అరెస్టు చేసి మూడు నెలలు జైలులో నిర్బంధించింది.
- 1948లో పోలీసు చర్య తర్వాత ఎం.కె.వెల్లోడి ముఖ్యమంత్రిగా ఉన్న మంత్రివర్గంలో బూర్గుల రెవిన్యూ, ఎక్సైజ్, విద్యాశాఖలు నిర్వహించారు.
- 1952లో ఎన్నికల అనంతరం హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. 1956 నవంబర్ 1న ఆంధ్రప్రదేశ్ ఏర్పడేవరకు ఆ పదవిలో కొనసాగారు.
- కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేశారు.
- బూర్గుల రామకృష్ణారావు బహుభాషా కోవిదులు. తెలుగు, పారసీ, ఉర్దూ, హిందీ, ఆంగ్లం, కన్నడం, మరాఠీ, సంస్కృత భాషలలో వారికి మంచి పాండిత్యం వుంది.
- ముఖ్యమంత్రిగా ఉన్న రోజులలో హైదరాబాద్‌లో ఉర్దూ, తెలుగు, హిందీ, కన్నడ, మరాఠీ పంచభాషా కవిసమ్మేళనాలు నిర్వహించారు.
- ఉమర్‌ఖయ్యాం రుబాయిల్ని అనువదించారు.
- జగన్నాథ పండిత రాయల సంస్కృత రచన 'పండిత రాజ పంచామృతము'ను తెలుగులోకి తీసుకొచ్చారు.
- శంకరాచార్యుల సౌందర్యలహరి, కనకధారాస్తవమును తెలుగులోకి అనువాదం చేశారు.
- సంస్కృతంలో శ్రీ వెంకటేశ్వర సుప్రభాతం, శారదస్తుతి, గౌరీ స్తుతి, వాణీ స్తుతి, లక్ష్మీస్తుతి, శ్రీకృష్ణాష్టకం రచించారు.
- సారస్వత వ్యాస ముక్తావళి గ్రంథంలో వారి వ్యాసాల సమాహారం.
- నవీన వ్మాయం-ఎంకిపాటలు, కాకునూని అప్పకవి జన్మస్థానం, రెడ్డిరాజుల కాలపు మతసంస్కృతులు వారి ప్రసిద్ధ వ్యాసాలు.
- పారశీక వ్మాయచరిత్ర, నివేదన (కవితలు) వారి ప్రసిద్ధ చెందిన గ్రంథాలలో ప్రముఖమైనవి.
- తెలంగాణ రచయితల సంఘం, ఆంధ్రమహాసభ, దక్షిణ భారత హిందీ ప్రచారసభ, సంస్కృత పరిషత్ వంటి సంస్థల పురోగతికి కృషి చేశారు.
- 1953లో ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లిటరేచర్ గౌరవ పట్టాను ప్రదానం చేసింది.
- 1956లో ఉస్మానియా విశ్వవిద్యాలయం డాక్టర్ ఆఫ్ లాస్ పట్టాను ఇచ్చింది.
- రాజకీయాల్లో గాంధేయవాదిగా ఉన్న బూర్గుల రామకృష్ణారావు జీవితమంతా విలువలకు కట్టుబడి వ్యవహరించారు.

**-కె.పి. అశోక్‌కుమార్**

# ఆర్.డబ్ల్యు.ఎస్.ఎస్ నూతన ఎఇఇలకు శిక్షణ ముగింపు




గ్రామీణ నీటి సరఫరా & సేనిటేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ల శిక్షణ ముగింపు సందర్భంగా టిసిపార్డు డిప్యూటిడైరెక్టర్ డా.జి.అంజనేయులు వారికి శిక్షణ సర్టిఫికేట్లను సెప్టెంబర్ 17వ తేదీన ప్రధానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఇండక్షన్ శిక్షణ కార్యక్రమం తమ ఉద్యోగ విధులను సమర్థవంతంగా నిర్వహించుటకు ఉపయోగపడుతుందని ఇంకా కొత్త విషయాలును తెలిసికోవాలని ఉద్బోధించారు.

సిడబ్ల్యుఎస్ సెంటర్ హెడ్ ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఇండక్షన్ శిక్షణలో తెలిసికొన్న అంశాలను సద్వినియోగపరచుకోవాలని సూచించారు. మొదటి దశలో నిర్వహించిన 5 బ్యాచ్‌ల శిక్షణాకార్యాక్రమంలో 204 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అసిస్టెంట్ ఇంజనీర్లకు, ఇండక్షన్ ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాల కోర్స్ కో ఆర్డినేటర్‌గా జే.ఆర్.పి శ్రీమతి విద్యల్లతా వ్యవహరించారు.

# విద్య – జాతి పునర్నిర్మాణం

> ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ సందర్భాలలో విద్యారంగం గురించి, వృత్తుల గురించి చెప్పిన విషయాలు గమనించదగినవి. కులాల వారిగా విభజించకుండా, అన్ని కులాల వారికి ఒకే చోట ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించడం ఇందులో ఒకటి. తండ్రి వృత్తినే కొడుకు చేపట్టాలనేమీ లేదు. చదువుకొని ఉన్నత స్థాయిలోకి పోవచ్చు. తనకు ఆసక్తి గల వృత్తిలోకి ప్రవేశించవచ్చు. ఆధునికయుగంలో కొన్ని వృత్తులు ప్రాధాన్యం కోల్పోవచ్చు. అలాంటివారి భవిష్యత్తు అంధకారం కాకూడదంటే ఆదర్శప్రాయమైన విద్యావిధానం అవసరం.



తెలంగాణవాదం భిన్నరంగాలను ఇమిడించుకుని విస్తారమైంది. తెలంగాణ ఉద్యమం సాగుతున్నప్పుడు జాతి విముక్తితో పాటు జాతి నిర్మాణానికి సంబంధించిన అనేక అంశాలపై ఆలోచనలు వచ్చేవి. కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ప్రచురణల విభాగం వెలువరించిన మౌలానా ఆజాద్ ప్రసంగాల పుస్తకం చూసినప్పుడు తెలంగాణ నిర్మాణంలోనూ విద్యారంగం కీలకమైంది కదా అనిపించింది. జాతి నిర్మాణంలో విద్యారంగ ప్రాధాన్యాన్ని, భిన్న కోణాలను గుర్తించడానికి ఈ పుస్తకం ఉపయోగపడింది.

విద్యారంగానికి సంబంధించిన విజ్ఞానం ఒక మహా సముద్రం. ప్లేటో మొదలుకొని అనేకమంది తాత్వికులు దీని ప్రాధాన్యాన్ని గుర్తించారు. విద్యారంగ తాత్విక భూమిక, బోధనా పద్ధతులు, సామాజిక అవసరం వంటి అనేక అంశాలను తెలంగాణలో ని ఉపాధ్యాయులు, బోధనావేత్తలు అనేకమంది ఇప్పటికే చదివి ఉన్నారు. అయితే అబుల్ కలాం ఆజాద్ ప్రసంగాల పుస్తకం వల్ల కూడా మరికొన్ని విషయాలు తెలుస్తాయి. స్వాతంత్ర్యం రాకముందు నుంచే ఆనాటి జాతీయోద్యమ నాయకత్వం విద్యారంగ స్వభావం గురించి చర్చించి స్పష్టతను ఏర్పరచుకొన్నది. జాతి నిర్మాణంలో విద్యారంగ ప్రాధాన్యాన్ని వారు గుర్తించారు. జిన్నా అనుయాయులు అబుల్ కలాంను కాంగ్రెస్ షో మాన్‌గా తెగ డి ఉండవచ్చు. కానీ దానివల్ల ఆయన ఔన్నత్యం, పాండిత్యం వెలిసిపోయేది కాదు.

ఆసియాలోని శిష్ట వర్గాలలోని ఒక పండిత కుటుంబంలో జన్మించిన అబుల్ కలాం ఆజాద్‌కు పాశ్చాత్య సామ్రాజ్యవాదం పట్ల వ్యతిరేకత ఉన్నది. పశ్చిమాసియాలోని, అవిభక్త భారత దేశంలోని సామ్రాజ్య వ్యతిరేకులతో, జాతీయవాదులతో విస్తృత చర్చలు జరిపారాయన. అం దువల్ల భారత జాతి నిర్మాణానికి విద్యారంగాన్ని ప్రధాన సాధనంగా చేసుకున్నారు.

విద్యార్థులకు జాతీయవాదాన్ని బోధించవలసిన పద్ధతులను కలాం గుర్తించారు. మన చరిత్రను పునర్నిర్మించుకోవాలని, మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారాయన. కళలు, క్రీడలు విద్యారంగంలో భాగం కావాలన్నారు. ఆటలు పోటీలలో గెలవడానికే కాదని, దృఢమైన జాతి నిర్మాణానికి, క్రీడా స్ఫూర్తిని పెంచడానికని ఆయన గుర్తించారు.

విద్యా, సాంస్కృతిక సౌధ నిర్మాణానికి పునాది బోధనారంగంపై ఉంటుందనీ, ఇందుకు ఉపాధ్యాయవర్గంపై శ్రద్ధ పెట్టాలని అబుల్ కలాం వివరించారు. స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన కొత్తలో– ఆనాటి జాతీయోద్యమ నాయకత్వం ఆలోచించిన తీరుకు కలాం ప్రసంగాలు అద్దం పడుతాయి. ఇప్పుడున్న విద్యా వ్యవస్థ జాతీయేతరులు, జాతీయేతర ప్రయోజనాల కోసం రూపొందించినది అంటూ– బ్రిటన్ ప్రయోజనాలకు అనుగుణమైన శిక్షణ, దృక్పథం, విధేయత నెలకొల్పడం ఈ విద్యావిధానం లక్ష్యమని మెకాలె చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా అబ్దుల్ కలాం గుర్తు చేశారు. ఈ విద్యా వ్యవస్థ కొద్దిమంది మేధావులను ప్రజా బాహుళ్యం నుంచి విడిపోయేలా చేసింది. వారిని భారతీయ సంప్రదాయ జీవన పోకడల నుంచి విడగొట్టే ప్రయత్నం చేసింది.

మన జాతీయ వారసత్వాన్ని తిరస్కరించి, పాశ్చాత్యులు సాధించిన అభివృద్ధిని చూసి మిరుమిట్లుగొనేలా చేసింది. విభజన పోకడలను పెంచి పోషించింది. ఒక్కమాట లో చెప్పాలంటే– ఈ విద్యావిధానం జాతీయ మేధస్సును అభివృద్ధి చేయడానికి తోడ్పడలేదు అని కలాం వివరించారు. ఆనాడు అబ్దుల్ కలాం వ్యక్తం చేసిన అభిప్రాయాలు తెలంగాణ జాతి నిర్మాణం సందర్భంగా గుర్తు

చేసుకోవాలె. జాతి పునర్నిర్మాణమనే తాత్విక దృక్పథం భూమికగా ఉన్నప్పుడే విద్యారంగ ప్రాధాన్యం అర్థమవుతుంది. విద్యారంగ సంస్కరణలో భాగస్వాములైన వారు ఈ విషయాన్ని గుర్తించా లె. విద్యారంగానికి సంబంధించి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు స్పష్టత ఉన్నప్పటికీ అన్ని స్థాయిలలో దానిని దట్టించాలనే స్పృహ మేధావులకు ఉండాలె.

విద్యారంగంలో చేపట్టవలసిన నిర్దిష్ట సంస్కరణల విషయానికి వస్తే కేజీ టు పీజీ పై తెలంగాణవాదులలో విస్తృత చర్చ జరుగుతున్నది. తెలంగాణ వికాస సమితి ఇప్పటికే విస్తృతమైనరీతిలో సూర్యాపేట, వరంగల్, హైదరాబాద్‌లలో సదస్సులను నిర్వహించింది. ప్రొఫెసర్ పాపిరెడ్డి గారు ఈ సదస్సులకు స్ఫూర్తి. ప్రొఫెసర్ సీతారామారావు గారు చర్చల సారాంశాన్ని క్రోడీకరించి విధాన పత్రాలను రూపొందించారు. ఈ పత్రంలోని సూచనల ప్రకారం– అంగన్‌వాడీలు శిశు సంరక్షణ కేంద్రాలుగా మాత్రమే ఉం డకూడదు. ఈ కేంద్రాలలో శిశువు బౌద్ధిక, శారీరక వికాసంపై, సామాజీకీకరణపై శ్రద్ధ పెట్టాలె.

పూర్వ ప్రాథమిక విద్య అనేది ఈ కాలంలో చాలా ప్రాధా న్యం పొందింది. పాఠశాలకు వెళ్ళే లోపే ఆటలు, పాటలు, అభ్యసన నైపుణ్యాలను పిల్లలకు పరిచయం చేయాలె. తగిన పోషకాహారం కూడా అం దించాలె. వీటికి ప్రత్యేక శిక్షణ పొందిన ఉపాధ్యాయు లు, ఆయా అవసరం. బాలల సంఖ్యను పెట్టి వీటిని పెంచాలె. చిన్న ఆవాసాలలో వీటిని ఏర్పాటు చేయవలసిందే. ఈ కేంద్రాలలో నైపుణ్యాలు పెంచుకున్న పిల్లలు పాఠశాల మొదటి తరగతిలో దర్జాగా అడుగు పెడతారు. ఇక్కడే తెలంగాణ సమాజం మొగ్గతొడుగుతుంది! ఆరవ తరగతి లోపు పిల్లలు తల్లిదండ్రుల దగ్గరనే ఉండాలె తప్ప హాస్టల్‌లో చేర్చకూడదు. మొత్తం సమాజ అవసరాలను తీర్చే స్థాయిలో రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం జరగడానికి కొంత కాలం పడుతుంది.

అందువల్ల ముందుగా ఇప్పుడు గ్రామాలలో ఉన్న పాఠశాలలను పటిష్టం చేయాలె.

విద్యా సదస్సులో వ్యక్తమైన మరొక ప్రధానాంశం నాణ్యమైన విద్య. పేద తల్లిదండ్రులు తాము కడుపు నిండా తినకపోయినా సరే, తమ కష్టార్జితాన్ని వెచ్చించి పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నారు. ఉదాహరణకు ఒక తండా లేదా ఊరు దగ్గరికి ప్రైవేటు స్కూలు బస్సు పోతుంది. తమ పిల్లలకు స్కూల్ డ్రెస్ వేసి టై కట్టి, షూజ్ తొడిగి, బస్సులో ఎక్కించి బై చెప్పడం తల్లిదండ్రులకు ఎంతో ఆనందాన్ని ఇస్తున్నది. కానీ ఆ ప్రైవేట్ స్కూల్‌లో అర్హత లేనివారి చేత పాఠాలు చెప్పిస్తుంటారు. తమ పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదనేది ఆ అమాయక తల్లిదండ్రుల కు తెలువదు. పునాది బాగా లేక ఉన్నత చదువులలో ఎదురు దెబ్బలు తింటారు. ఇటువంటి వారిని కాపాడటం ప్రభుత్వ బాధ్యత.

ప్రైవేటు పాఠశాలలు నిబంధనలను అమలు చేసే విధంగా కఠినంగా వ్యవహరించాలె. ప్రైవేటు పాఠశాలలు ఉంటే ఆ యాజమాన్యాలు ప్రభుత్వ రంగాన్ని దెబ్బకొడతాయని ప్రొఫెసర్ సీతారామారావు అన్నారు. దశలవారీగా పాఠశా ల విద్యారంగాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకోవడమే మంచిదని ఆయన సూచిస్తున్నారు.

వికాస సమి తి సదస్సులలో వ్యక్తమైన మరో బలమైన అభిప్రా యం ఇంటర్‌ను పాఠశాల విద్యలో భాగం చేయాలనేది. తెలంగాణ ప్రభుత్వానికి ఈ విషయంలోనూ స్పష్టత ఉన్నట్టు కనిపిస్తున్నది. పదవ తరగతి తరు వాత రెండేండ్ల పాటు విద్యాబోధన ఉంటుంది. పై చదువులకు వెళ్ళని వారు వృత్తిశిక్షణ పొందవచ్చు.

నా చిన్నప్పుడు ఉపాధ్యాయులకు ఎంతో నిబద్ధత ఉండేది. సమాజంలో వారికి అపార గౌరవం ఉండేది. ఆ తరువాత కాలంలో ఉపాధ్యాయుల ప్రమాణా లు, నిజాయితీ తగ్గిపోయాయనే విమర్శలు వచ్చా యి. కానీ మళ్ళా కొద్ది కాలానికే ఉపాధ్యాయ వృత్తిలోకి ఉత్తమ ప్రమాణాలు గలవారు రావడం మొదలైంది. వారు బోధనారంగంపై ఆసక్తి చూపడమే కాకుండా, సమాజం పట్ల నిబద్ధత కనబరుస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ఉపాధ్యాయ శిక్షణ పొంది ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న యువతరంలోని ఉత్సా హం, ఉత్తమ ప్రమాణాలు చూస్తే జాతి నిర్మాణమనే ఆకాంక్ష నెరవేరుతుందనే ఆశ కలుగుతున్నది. తెలంగాణ ఏర్పాటుకు ముందు అప్పటి పాలకవర్గం పెంచి పోషించిన భావజాలం, అనుసరించిన విధానాలే నేటి విద్యారంగ దుస్థితికి కారణం.

ప్రభుత్వ పాఠశాలలను పండబెట్టి ప్రైవేటు రంగాన్ని పైకి లేపడం ఆనాటి పాలకుల లక్ష్యమైంది. దాని ఫలితాలు కూడా అట్లానే ఉన్నాయి. ఇప్పుడు ఏ మాత్రం ఆర్థిక స్థోమత ఉన్న కుటుంబమైనా ప్రైవేటు పాఠశాలకు పిల్లలను పంపుతున్నది. సమాజం అట్టడుగు పొరల్లోని, గ్రామీణ నిరక్షరాస్య పేద కుటుంబాలలోని పిల్లలకు చదువు చెప్పే బాధ్యత ప్రభుత్వ ఉపాధ్యాయులకు మిగిలింది. అందువల్ల పరీక్షా ఫలితాల తేడాను చూసి ప్రభుత్వ పాఠశాలల ప్రమాణాలను తక్కువగా అంచనా వేయవద్దు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న పథకా ల వల్ల ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లో నమ్మకం ఏర్పడ్డది. కేసీఆర్ స్కూళ్ళు పెడితే అల్లాటప్పాగా ఉం డబోవని, వాటి లో పిల్లలను చేర్పాలని చాలా మంది తల్లిదండ్రులు అనుకుంటున్నారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ వివిధ సందరాలేలో విద్యారంగం గురించి, వృత్తుల గురించి చెప్పిన విషయాలు గమనించదగినవి. కులాల వారిగా విభజించకుండా, అన్ని కులాల వారికి ఒకే చోట ఉన్నత ప్రమాణాలు గల విద్యను అందించడం ఇందులో ఒకటి. తండ్రి వృత్తినే కొడుకు చేపట్టాలనేమీ లేదు. చదువుకొని ఉన్నత స్థాయిలోకి పోవచ్చు. తనకు ఆసక్తి గల వృత్తిలోకి ప్రవేశించవచ్చు. ఆధునికయుగంలో కొన్ని వృత్తులు ప్రాధాన్యం కోల్పోవచ్చు. అలాంటివారి భవిష్యత్తు అంధకారం కాకూడదంటే ఆదర్శప్రాయమైన విద్యావిధానం అవసరం.

మానవీయ విలువలను, ఆరోగ్యకర సామాజిక సంబంధాలను పరిరక్షించుకోవడం ఎంత అవసరమో కాలం చెల్లిన పాత కాలపు భావజాలాన్ని, తిరస్కరించదగిన సామాజిక సంబంధాలను నిర్మూలించడం కూడా అవసరం. కొత్త విద్యా విధానం ద్వారా మన చుట్టూ నిర్మించి ఉన్న కంచెలన్నీ పీకిపారేయాలె. కుల వివక్ష, మత విద్వేషపు విభజన రేఖలను చెరిపివేయాలె. జాతి నిర్మాణం లక్ష్యంగా చేపట్టే విద్యా విధానం వల్లనే ఇది సాధ్యపడుతుంది.

– వి.జి.స్వామి

# ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెరగాలి



రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమాభివ ృద్ధి కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం పెరుగాలని పంచాయతీరాజ్ గ్రామీణాభివ ృద్ధిశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ (టీఎస్ఐపార్డ్)లో జరిగిన ఖమ్మం, కరీంనగర్ జిల్లాల మండల పరిషత్ (ఎంపీపీ) అధ్యక్షుల రెండో బ్యాచ్ మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి జూపల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. నాటి పాలకులు సరైన విధానపరమైన నిర్ణయాలు తీసుకోని కారణంగా సగటు మనిషికి కనీస అవసరాలు తీరని పరిస్థితి కనిపిస్తున్నదన్నారు. ఉపాధిహామీ పథకంలో భాగస్వాములైన కూలీలకు పని కల్పించడంతో ఆ నిధులను ఉపయోగించి గ్రామంలో రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి వసతులను అభివ ృద్ధి చేసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ, మండల పరిషత్ , జిల్లా పరిషత్‌లో జరిగే ఆదాయ, వ్యయాలు, పనుల వివరాలను పారదర్శకత కోసం ప్రజలకు అందుబాటులో ఉండేందుకు ఆన్‌లైన్‌లో పొందుపర్చుతామని మంత్రి జూపల్లి చెప్పారు.

జిల్లా పరిషత్‌లకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ నిధులు వచ్చే ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదే విధంగా రాష్ట్రం లేదా దేశంలో పంచాయతీరాజ్ వ్యవస్థ మెరుగ్గా ఉన్న పంచాయతీలకు ఎంపీపీలను క్షేత్రస్థాయి పర్యటనకు తీసుకువెళ్లే ప్రయత్నం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్తు అధ్యక్షులు లేవనెత్తిన పలు సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని మంత్రి జూపల్లి హామీ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధులు పూర్తిగా సద్వినియోగ పరుచుకుని సమర్థవంతమైన పాలన ప్రజలకు అందించాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త సంచాలకుడు కే యాదయ్యగౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సెంటర్ హెడ్ బీ శేషాద్రి, రాఘువేంద్రరావు, జయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

# సంక్షేమ కార్యక్రమాలను ప్రజాప్రతినిధులే ప్రజల్లోకి తీసుకెళ్లాలి



ప్రభుత్వ నిధులను ఖర్చు చేయడం కన్నా... సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రజాప్రతినిదుల ముఖ్య బాధ్యత అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. తెలంగాణా రాష్ట్ర పంచాయతీరాజ్ మరియు గ్రామాణాభివృద్ధి సంస్థలో జరుగుతున్న ఎంపీపీల ముగింపు శిక్షణాతరగతులకు ముఖ్యఅతిథిగా హాజరై... ఎంపీపీలకు దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ఇచ్చే నిధులను ఖర్చు చేయడమే బాధ్యతగా ప్రజాప్రతినిదులు భావిస్తున్నారని...ఆ ఆలోచనా విధానాన్ని మార్చుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి...వాటిని పారదర్శకంగా అమలు చేస్తూ, అర్హులకు అందేలా చేయడం ప్రజాప్రతినిదులపై ఉన్న గురుతర బాధ్యతన్నారు. ఆ దిశగా ప్రతి ఎంపీపీ ముందుకు సాగాలని సూచించారు. గతంలో ఏ గ్రామానికి వెళ్లినా కరెంటు కోతలపై...మంచినీటి సమస్యపై నిలదీసే పరిస్థితులుండేవని గుర్తుచేశారు. తెలంగాణాలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరెంట్ కష్టాలనేవే లేకుండా చేయగలిగామన్నారు. అదే విధంగా మిషన్ భగీరథతో మంచినీటి సమస్యకు... ప్రాజెక్టుల నిర్మాణంతో సాగునీటి అవసరాలకు శాశ్వత పరిష్కారం ఇచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అదే విధంగా పించన్లు, కళ్యాణలక్ష్మిలాంటి పథకాలను రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ చేరవేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిదులదేనని గుర్తు చేశారు. తాను మొదటి సారి ఎమ్మెల్యేగా ఎన్నికైనప్పుడు ఏమీ చేయలేకపోయాయని...అసలు రాజకీయాల్లోకి ఎందుకు వచ్చానా అని కూడా బాధ పడ్డానని గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు సీయం కేసీఆర్ అమలు చేస్తున్న కార్యక్రమాలతో ప్రజాప్రతినిధిగా గర్వపడుతున్నానన్నారు. ప్రభుత్వ విధానాలే అభివృద్ధికి దోహదం చేస్తాయని... వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడమే ప్రజాప్రతినిధుల విధి అన్నారు. ప్రభుత్వ శాఖలు, పథకాలపై అవగాహన పెంచుకోవడం ద్వారా ప్రజలకు మెరగైన సేవలు చేయవచ్చన్నారు. ఎవరూ అడగకపోయినా ఎంపీపీల గౌరవ వేతనాన్ని 15 వందల నుండి 10 వేలకు పెంచిన ఘనత సిఎం కేసీఆర్ దే అన్నారు. కేంద్ర నిధులు నేరుగా పంచాయతీలకు అందజేయడం వల్ల తావేం చేయలేకపోతున్నామని పలువురు ఎంపీపీలు మంత్రి ద ృష్టికి తీసుకురాగా...స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నుండి మండల, జిల్లా పరిషత్‌లకు నిధులు ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. చివరి రోజు శిక్షణా తరగతుల్లో మెదక్, ఆదిలాబాద్ జిల్లాల ఎంపీపీలతో పాటు... సిపార్డ్ అధికారి శేషాద్రి పాల్గొన్నారు.



# సంపూర్ణ అక్షరాస్యత సాధ్యమే

**సంపూర్ణ అక్షరాస్యత దిశగా గ్రామాలను దత్తత తీసుకునే కొత్త సంప్రదాయానికి నాంది పలుకుదాం. అలాగే ప్రతి విద్యార్థి తన కుటుంబంలో ఎవరు నిరక్షరాస్యులు లేకుండా చేయగల్గితే, సంపూర్ణ అక్షరాస్యతాలక్ష్యం సాధించడం అసాధ్యమేమీ కాదు.**

| | | దేశంలో | | | తెలంగాణలో | | |
|---|---|---|---|---|---|---|---|
| క్ర.సం. | వయస్సు | మొత్తం | పురుషులు | స్త్రీలు | మొత్తం | పురుషులు | స్త్రీలు |
| 1. | 7-14 | 87.92 | 88.96 | 86.78 | 90.56 | 91.27 | 89.81 |
| 2. | 15-24 | 86.14 | 90.04 | 81.85 | 86.97 | 91.11 | 82.71 |
| 3. | 25-34 | 75.28 | 83.76 | 66.63 | 69.62 | 79.73 | 59.71 |
| 4. | 35-44 | 65.31 | 76.39 | 53.74 | 53.58 | 66.88 | 40.71 |
| 5. | 45-54 | 58.79 | 71.00 | 45.54 | 43.11 | 55.45 | 30.27 |
| 6. | 55-64 | 50.95 | 66.64 | 35.47 | 33.62 | 48.37 | 21.18 |
| 7. | 65-74 | 42.19 | 57.89 | 26.81 | 26.68 | 38.32 | 15.56 |
| 8. | 75- | 40.30 | 55.32 | 26.45 | 28.08 | 40.20 | 17.76 |
| | మొత్తం | **72.98** | **80.88** | **64.63** | **66.46** | **74.95** | **57.92** |

ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా 50వ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం జరుపుకోనున్నాం. ఈ సందర్భంగా యునెస్కో చదవడం అనేది పాతవిషయం భవిషత్తును రాయండి అనే నినాదాన్ని ఇచ్చింది. యాభై సంవత్సరాల కిందట నిరక్షరాస్యతను నిర్మూలించే ఉద్దేశంతో సెప్టెంబరు 8వ తేదీని అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా జరుపాలని అన్నిదేశాల విద్యా శాఖా మంత్రులు తీర్మానించారు. తద్వారా సమాజంలో అన్నివర్గాలను నిరక్షరాస్యత నుంచి వెలుగులోకి తీసుకురావడా నికి వారిని అక్షరాస్యులను చేసే బృహత్తర కార్యక్రమానికి పురిగొల్పడం జరిగింది.

ఈ యాభై సంవత్సరాలలో ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రపంచంలో 2015 మానవాభివృద్ధి అక్షరాస్యతలో నివేదికలో భారతదేశం 130వ స్థానంలో ఉన్నది. అక్షరాస్యతలో ప్రపంచంలో 140వ స్థానంలో ఉన్న ది. ప్రపంచంలో ఇప్పటివరకు 781 మిలియన్ల మంది కనీసం చదువడం, రాయడం రానివారున్నారని యునెస్కో గణాంకాలు చెబుతున్నాయి. వీరిలో భారతదేశంలోనే గరిష'ంగా 28 కోట్ల మంది ఉన్నారు. అంటే ప్రపంచంలోని నిరక్షరాస్యులలో 36 శాతం మంది మన దేశంలోనే ఉన్నారు. ఇటీవల యునెస్కో సహస్రాబ్ది లక్ష్యాలను ప్రపంచ దేశాల ముందు ఉంచింది. దీనికి 2030 గడువును నిర్దేశించిం ది. ఈ లక్ష్యాల లో ముఖ్యమైన నాలుగవ అంశం అందరికి నాణ్యమైన గుణాత్మక విద్యను అందించ టం, జీవన పర్యంతం విద్యావకాశాలు కల్గించడం. ఈ లక్ష్యాలను అమలు చేయటానికి భారత ప్రభుత్వం తన సమ్మతిని తెలియజేసింది.

దీనిలోభాగంగా 2030 సంవత్సరానికి యువతలో సంపూర్ణ అక్షరాస్యత సాధించడం ఎక్కువమంది వయోజనులలో కనీస అక్షరాస్యతను అందించటం సాధించవలసి ఉన్నది.సహస్రాబ్ది లక్ష్యాలలో భాగంగా, మనదేశంలో ప్రస్తుతం ఉన్న దేశ అక్షరాస్యత(74 శాతం)ను 90 శాతానికి చేర్చాలి. అలాగే 15 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సుగల యువత లో నూరు శాతం అక్షరాస్యత సాధించాలి. 25 సంవత్సరాలు పై బడిన వారిలో 80 శాతం అక్షరాస్యత సాధించాలి. అలాగే మహిళలలో, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలలో ఎక్కువ మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దటం అనే లక్ష్యాలను భారత ప్రభుత్వం నిర్దేశించుకున్నది. ఈ లక్ష్యాలను సాధించాలంటే, ప్రస్తుతం ఉన్న పరిస్థితిని తెలుసు కోవాల్సిన అవసరం ఉన్నది. 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో వివిధ వయస్సులలో అక్షరాస్యతాస్థాయి గణాం కాలు పరిశీలిస్తే అక్షరాస్యతలో మన స్థితి తెలుస్తుంది. పట్టికలో ఉన్న గణాంకాల ప్రకారం చూస్తే.. మన రాష్ట్రంలో 15 నుంచి 24 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారిలో ఇంకా 13 శాతం అక్షరాస్యత సాధించవలసి ఉన్నది. ప్రస్తుతం ఉన్న 67 శాతం




అక్షరాస్యతను 90 శాతం వరకు తీసుకోవలసి ఉన్నది.

మన రాష్ట్రంలో విద్యా విషయకంగా చూస్తే, 6-24 వయస్సు వారిలో దాదాపు 90శాతం దాకా అక్షరాస్యత సాధించాం. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ అయినప్పటికీ ఇప్పటికి 9శాతం మంది పిల్లలు ఇంకా బడి కి పోనివారని అర్థమవుతున్నది. వీరందరు ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాలకు చెందినవారు. ప్రధానంగా మన రాష్ట్రంలో మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాలు చాలా తక్కు వ అక్షరాస్యత శాతాన్ని కలిగి ఉన్నాయి. ఈ జిల్లాలలో గ్రామీణ జనాభాలో ఇప్పటికీ యాభై శాతం మంది కనీసం అక్షర జ్ఞానాని కి నోచుకోనివారున్నారు. రంగారెడ్డి, మెదక్ గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ పరిస్థితి ఉన్నది. మన రాష్ట్రంలో ప్రధానంగా ఈ జిల్లాలపై కేంద్రీకరించవలసి ఉన్నది.

ఈ లక్ష్యాలను సాధించాలంటే ఒక ప్రభుత్వపరంగానే కృషిచేస్తే సాధ్యపడదు. సమాజంలోని అన్నివర్గాలు ముఖ్యంగా విద్యాధికులు, స్వఛ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సంస్థ లు, విద్యాసంస్థలు, రాజకీయ సంస్థలు ముందుకురావాలి. గ్రామాలను దత్తతతీసుకొని సంపూర్ణ అక్షరాస్యత కోసం కృషి చేస్తే అనుకున్న లక్ష్యాలు సాధించడం సులువు అవుతుంది. ప్రస్తుతం మన రాష్ట్రంలో వివిధ సంస్థ లు, వ్యక్తులు, స్వఛ్ఛంద కార్యకర్తలు యాభై గ్రామ పంచాయతీలను దత్తత తీసుకొని, వాటిని సంపూర్ణ అక్షరాస్యత దిశగా నడిపిస్తున్నారు. సభ్యులు దత్తత తీసుకొన్న 22 గ్రామ పంచా,తీలు సంపూర్ణ అక్షరాస్యత దిశగా నడుస్తున్నాయి. ఈ అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం సందర్భంగా సంపూర్ణ అక్షరాస్యత దిశగా గ్రామాలను దత్తత తీసుకునే కొత్త సంప్రదాయానికి నాంది పలుకుదాం. అలాగే ప్రతి విద్యార్థి తన కుటుంబంలో ఎవరు నిరక్షరాస్యులు లేకుండా చేయగల్గితే, సంపూర్ణ అక్షరాస్యతాలక్ష్యం సాధించడం అసాధ్యమేమీ కాదు. అందరూ చేయి చేయీ కలిపితే సాధించలేనిదేదీ లేదని నిరూపిద్దాం. సంపూర్ణ అక్షరాస్యత సాధిద్దాం.

**సెప్టెంబర్ 8న అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం**



# సానుకూల ఫలితాలనిస్తున్న పల్లె సమగ్ర సేవా కేంద్రాలు

పంచాయతీ రాజ్ ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన పల్లె సమగ్ర సేవా కేంద్రాలకు ప్రజల నుండి మంచి ఆదరణ లభిస్తోంది. వన్ స్టాఫ్ కేంద్రాల ద్వారా అందుతున్న ఆర్థిక, పౌర సేవలతో గ్రామీణులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటి వరకు 150 వన్ స్టాప్ షాప్ లు పని చేస్తున్నాయి. వాటి సంఖ్యను 200 లకు పెంచడానికి పంచాయతీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ చర్యలు తీసుకుంటుంది. ప్రస్తుతం ఐదు శాఖలకు చెందిన 16 రకాల సేవలను గ్రామీణులకు అందుబాటులోకి తెచ్చారు. మరిన్ని సేవలను పల్లె సమగ్ర సేవా కేంద్రాల ద్వారా అందించడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లోని ప్రజలకు ఆర్థిక, పౌర సేవలను సులభంగా అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశం. వివిధ రకాల సేవలు ఒకే దగ్గర లభిస్తే ప్రజలకు సొమ్ము ఆదా అవుతుంది. సమయం కలిసి వస్తుంది అని అధికారులు పేర్కొంటున్నారు. 2015 అక్టోబర్ 2న 9 జిల్లాల పరిధిలో 105 కేంద్రాలతో గ్రామాల్లో ఆర్థిక, పౌరసేవలను ప్రారంభించారు. ప్రజల నుండి వస్తున్న స్పందన, వివిధ గ్రామ పంచాయతీల్లో కల్పస్తున్న వసతి ఆధారంగా ఈ కేంద్రాల సంఖ్యను 150 కి పెంచారు. మరో 50 పెంచడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేంద్రాల నిర్వహణ బాధ్యతలను స్త్రీ నిధి సంస్థకు అప్పగించారు. గ్రామ స్థాయిలోని స్వయం సహాయక సంఘాల్లో నుండి ఎంపిక కాబడిన గ్రామ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల ద్వారా వన్ స్టాప్ షాఫ్ లు పని చేసే విధంగా చర్యలు తీసుకున్నారు. ఈ కేంద్రాల నిర్వాహకులకు కార్యకలాపాల ఆధారంగా నెలకు రూ. 1000 నుండి రూ. 8000ల వరకు ఆదాయం వస్తుంది. వివిధ బ్యాంకుల ఆర్థిక సేవలను గ్రామీణులకు అందుబాటులోకి తేవడం, సామాజిక పింఛన్లు అందించడం. ఉపాధి హామీ వేతనాలను చెల్లించడం, మీ సేవలో లభించే పౌరసేవలను పౌరులకు అందచేయడం, ఇ పంచాయతీ సేవలను సమకూర్చడం, నగదు బదిలీ, ప్రజా సమస్యలను సంబంధిత శాఖలకు చేర వేసి, వాటిని పరిష్కరించడానికి కృషి చేయడం లాంటి కార్యక్రమాలను ఈ కేంద్రాల ద్వారా నిర్వహించడం జరుగుతుంది. దశల వారిగా ఈ కేంద్రాల సంఖ్యను 500లకు పెంచడంతో పాటుగా అన్ని గ్రామాలకు విస్తరింపచేసే విధంగా అధికారులు ప్రణాళిక రూపొందించుకున్నారు. ఐటీ ఆధారిత సేవలను మెరుగు పర్చడంతో గ్రామీణులకు మరింతగా దోహదపడేందుకు దశల వారిగా ప్రజలతో నేరుగా సంబంధం ఉండే శాఖలను ఈ కేంద్రాల పరిధిలోకి తేవడం జరుగుతుందని అధికారులు వెల్లడించారు. ఐటీని గ్రామాల వరకు విస్తరింప చేయాలని, వాటి ఫలాలను సామాన్యులు అందుకునే విధంగా చర్యలు ఉండాలని ప్రభుత్వం చేసిన సూచన మేరకు పంచాయతీ రాజ్ శాఖ గ్రామాల్లో ఐటి ఆధారిత పౌర సేవలు ప్రారంభించింది. అంతర్జాలం, కంప్యూటర్, ప్రింటర్, స్కానర్ ఉంటే ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసే వెసులుబాటు కలుగుతుంది. గ్రామాల్లో విద్యావంతులైన మహిళలకు ఉపాధి కల్పించడం, వివిధ ప్రభుత్వ సంస్థలు అందించే పౌర సేవల కోసం మండల, జిల్లా కేంద్రాలకు తిరగకుండా నామ మాత్రం రుసుముతో గ్రామ స్థాయిలోనే పొందడం లక్ష్యంగా ప్రారంభించిన ఇలాంటి కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు ఇప్పుడిప్పుడే అనేక గ్రామ పంచాయతీలు ముందుకొస్తున్నాయి. నగరాల్లో మీ సేవ కేంద్రాల్లో అందే అన్ని రకాల సేవలను వన్ స్టాప్ షాప్ లో అందించడానికి దశల వారిగా చర్యలు తీసుకుంటున్నారు. సంబందిత శాఖలను వన్ స్టాప్ షాప్ తో అనుసంధానం చేయడం, వాటి సేవలను జిల్లా, మండల స్థాయి అధికారులు పర్యవేక్షించడం తదితర అంశాలను పరిగణలోకి తీసుకొని భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని పంచాయతీ రాజ్ అధికారుల పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీలకు ఈ విధమైన సేవలు చేరువ కావడంతో స్థానికులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడించారు.





– శంకర్ పంతంగి

# ధీర వనిత ఐలమ్మ



దోపిడీ, అణిచివేతలకు వ్యతిరేకంగా దేశమంతా ఎన్నోప్రతిఘటనలున్నా, తెలం గాణ ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది. అణగారిన కులాలు ఆయుధాలెత్తిన వీర విప్లవ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ప్రపంచ పోరాటాల్లో అగ్రశ్రేణి గా నిలుస్తుంది. ఈ పోరాట వెల్లువకు కేంద్రంగా నిలిచింది వరంగల్ జిల్లా పాలకుర్తి పరిసర గ్రామాల సమాహారం. ఈ ప్రాంతంలో ఆవిర్భవించిన అణగారిన కులాల మహిళ చిట్యాల అయిలమ్మ, ఉరఫ్ చాకలి ఐలమ్మ. నీ బాంచెన్ కాల్మొక్త బానిస సంస్కృతికి ఎదురుతిరిగిన వీర వనితల్లో ఐలమ్మ కలికితురాయి. నిజాం రాజు పాలనకు వ్యతిరేకంగా సుదీర్ఘ కాలం న్యాయపోరాటం చేసి అజేయుడిగా నిలిచి అమరుడైన షేక్ బందగీకి, కామారెడ్డి గూడెం సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్యకు కడవెండి స్థావరాలయితే, వీటికి కేంద్రమైన పాలకుర్తి ఐలమ్మకు యుద్ధభూమి. సాధారణంగా గెలిచినవారితోనే చరిత్ర రాయ బడుతుంది. అణిచివేతకు గురవుతున్న కులాలకు తమ చరిత్ర తామే నిర్మించుకొని,రాసుకుని మీకు తెలియని మా చరిత్ర అని చెప్పవలసి ఉన్నది. అదే జరిగితే మంచాలకు, ఝాన్సీ రాణీ, రుద్రమ దేవిలకు ఏ మాత్రం తీసిపోని జీవితం ఐలమ్మది. ఐలమ్మ ధీర వనిత. ఆమెదిక ఒక వీర చరిత. పాలకుర్తిని ఆనుకొని ఉన్న రాయపర్తి మండలం కిష్టాపురంలో 1895 సంవత్సరంలో ఐలమ్మ పుట్టింది.

చిన్నతనం నుంచే పనిపాటల్లో అత్యం త ప్రతిభావంతురాలిగా పేరు తెచ్చుకున్నది. పుట్టింది పేద కుటుంబంలో అయినా తల్లిదండ్రులకు చేదోడువాదోడుగా నిలిచేది. ఐలమ్మకు 13 వ యేట పాలకుర్తికి చెందిన చిట్యాల నర్సయ్యతో వివాహం అయింది. కొద్దిరోజులకే కులవృత్తిలో ఉండే విష వలయం అర్థమైంది. అందులోంచి బయటకు రాగల ప్రయత్నాలను వెతుకసాగింది. ఆ ఆలోచనలోంచి పుట్టిందే వ్యవసాయం చేయాలనే కోరిక. పాలకుర్తి గ్రామం పక్కన పడి ఉన్న పనికిరాని భూమిని కౌలుకు తీసుకోవాలని, దాని సొంతదారుడైన ముక్తేదార్, కొండల్‌రావు దొరవద్దకు హైదరాబాద్‌కు వెళ్లి ఆయన ఆమోదం పొందింది. 40 పై చిలుకు గ్రామాలున్న కొండాల్‌రావుకు విస్నూర్ దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డికి సన్నిహితుడు.

ఐలమ్మకు వ్యవసాయం అందివచ్చింది. ఆమె భర్తతో పాటు చేతికి వచ్చిన ఐదుగురు కొడుకులు సోమయ్య, లచ్చ య్య, ముతిలింగయ్య, లక్ష్మీనర్సు, ఉప్పలయ్యతో పాటు కూతురు సోమ నర్సవ్వల శారీరక కష్టం కలిసి వచ్చింది. రజకుల కుల గురువు మడేల్ మాచన్న దేవత వద్ద నుంచి సాధించాడని చెప్పుతున్న ఉడకని అన్నం, వడకని వస్త్రం, ఇంకొక అదనపు పెట్టుబడి అయింది. ఐలమ్మ అతితక్కువ కాలంలో ఆసామిగా ఎదిగింది. ఛత్రశాల భవంతి నిర్మించుకున్నది. అణగారిన కులాలకు పెద్ద దిక్కుగా నిలిచింది. తాత్కాలికంగా వచ్చిన ఈ ఆర్థిక హోదా, సాంఘిక హోదాకు దారి తీస్తుందేమోననుకున్న ఒక సామాజిక వర్గం కలువరపడ్డది. వాళ్లలో చెలరేగిన ఈ కలకలం దేశ్‌ముఖ్ రాంచంద్రారెడ్డి వద్దకు చేరి ఎట్లాగైనా ఐలమ్మను పతనం చేయాలని పన్నాగాలు వేశారు. అదునుకోసం చూస్తున్న విస్నూర్ దొర, ఐలమ్మ పొలంలో పంట చేతికివచ్చే సమయానికి ఆ పంట తనకే చెందుతుందని, పండిన పంటను కొలుసుకురావాల్సిందిగా భూమిపైకి గూండాలను పంపాడు. ఆరుగాలం కష్టపడ్డ పంటను దోచుకోవడమంటే చంకలోని బిడ్డను పులినోట కరుచుకుపోతున్న భావనతో ఐలమ్మకు సహనం చచ్చింది. సాహసం హెచ్చిం ది. పక్కనే ఉన్న గుత్ప (దుడ్డుకర్ర) తీసుకొని గూండాలపైకి లగించింది.

వారు కాలికి బుద్ధి చెప్పినా, వెంబడించి దొరను గడీల వరకు తరిమింది. ఐలమ్మ ఉగ్రరూపం చూసిన దొర గడీ తలుపులు మూసుకోవలసి వచ్చింది. అప్పటి నుంచి ఐలమ్మ గుత్పకు సంకేతమయ్యింది. ఈ గుత్ప ఇప్పటికీ తెలంగాణ ఒక తిరుగుబాటు గుర్తు. ఐల మ్మ సాహసం ఆ ప్రాంతమంతా వ్యాపించింది. అది తెలుసుకొని పుచ్చలపల్లి సుందరయ్య పాలకుర్తిలోని ఐలమ్మ ఇంటికి చేరుకొని విశాలాంధ్రలో ప్రజారాజ్యం నినాదాన్నిచ్చి, ఆమె ఇంటి ఆవరణలోనే అరుణపతాకాన్ని ఎగురవేశాడు. అప్ప టి నుంచి ఐలమ్మ ఇల్లు కుటుంబమంతా కమ్యూనిస్టు పార్టీ పరమైంది.

ఐలమ్మ ధిక్కారం దొరతనానికి పెను సవాలైంది. ఆమెపై అక్రమ కేసులు బనాయించి, అనేక విధాలుగా హింసించారు. దీంతో ఐలమ్మ అన్నిరకాల యుద్ధవ్యూహాలు నేర్చిన ఆర్గనైజర్ అయింది. ఆయుధాలెత్తిన గెరిల్లానే కాదు, జనసమీకర ణ జరిపే నాయకురాలైంది. కడవెండి బేరమ్మ, దమ్మనపేట యాకమ్మలు వంతలుగా తాను ప్రధాన కథకురాలిగా బుర్రకథలు చెప్పింది. మెరికల్లాంటి యువతీయువకులను చేరదీ సి గెరిల్లా స్కాడ్‌లను తయారుచేసింది. ఈ ప్రాంతంలో పనిచేసిన భీంరెడ్డి నర్సింహారెడ్డి, చకిలం యాదగిరిరావు, కట్కూరి రాంచంద్రారెడ్డి, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, నల్ల నర్సింహులు, మల్లు స్వరాజ్యం, మద్దికాయల ఓంకార్‌లాంటి వాళ్ళలో కలిసి ఆమె పార్టీ నిర్మాణానికి పూర్తిగా అంకితమైంది. చాకలి ఐలమ్మ పోరాట పటిమ తెలంగాణ రాష్ట్ర విమోచనద్యోమం, రైతాంగ పోరాటం నలుదిశలా దేశదేశాల వ్యాప్తిచెంది. ఆమె దొరతనానికి వ్యతిరేకంగా చెయ్యెత్తిన క్షణం ఆమె వెనుక మార్క్స్ లేడు, మావో లేడు, కనీసం అంబేద్కర్ కూడా లేడు.

**– పూసాల సంపత్ రజక (నేడు చాకలి ఐలమ్మ 31వ వర్ధంతి)**

# ఫలిస్తున్న మిషన్ కాకతీయ
## పూడిక తీసిన చెరువులకు జలకల



తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు జరుపుతున్న మిషన్ కాకతీయ పథకం సానుకూల ఫలితాలనిస్తోంది. పూడిక తీసిన అనేక చెరువులు పొంగిపోర్లుతున్నాయి. గత సంవత్సరం వర్షాలు లేక చెరువుల్లోకి నీరు రాలేదు. ఇటీవల కురిసిన వర్షాలతో దాదాపుగా పూడిక తీసిన అన్ని చెరువుల్లోకి నీరు వచ్చి చేరింది. వేలాది చెరువులు నిండి పొంగిపొర్లడం చూసిన గ్రామీణుల సంతోషానికి అవదులు లేవనేది అతిశయోక్తి కానే కాదు.

గోదావరి బేసిన్లోని ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లోని అత్యధిక చెరువులకు ఎన్నో ఏళ్ల తర్వాత జలకల వచ్చింది. చెరువు గ్రామ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక వికాసానికి దోహదం చేస్తుందని గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా వేగవంతమైన చర్యలు తీసుకుంటుంది. ప్రజల భాగస్వామ్యంతోనే మిషన్ కాకతీయ పనులను ప్రభుత్వం కొనసాగిస్తుంది. పూడిక తీసిన చెరువుల గట్ల వెంట హరిత హారంలో భాగంగా చెట్లను కూడా పెంచేందుకు ప్రోత్సహించడంతో చెరువుల స్వరూపమే మారిపోతుంది.

ఇప్పటి వరకు గోదావరి బేసిన్లోని 3,740 చెరువులు పూర్తిగాను మరో 2,447 చెరువులు 50 నుండి 75 శాతం వరకు, అదే విధంగా 2,455 చెరువులు 25 నుండి 5 శాతం నీటితో కొత్త కల సంతరించుకున్నాయి. అత్యధికంగా ఆదిలాబాద్, ఖమ్మం జిల్లాల్లో చెరువులు పొంగిపొర్లాయి. క్రుషా? బేసిన్లో ఉన్న మహబూబ్ నగర్, నల్లగొండ, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లో 346 చెరువులు పూర్తిగాను, 734 చెరువులు 50 నుండి 75 శాతం వరకు, 1262 చెరువులు 25 నుండి 50 శాతం వరకు, 11,417 చెరువులు 25 శాతానికి నీటితో నిండయి.

చెరువుల పై ఆశలొదులుకున్న అనేక మంది రైతులు చెరువులే ఆధారంగా తమ పడావు పడిన భూములను సాగు చేయడానికి సిద్ధమయ్యారు. ఈ సంవత్సరం చెరువుల కింద వ్యవసాయం పుంజుకునే అవకాశం ఉంది. గత రెండేళ్లుగా కరవుతో విలవిలలాడిన తెలాంగాణ రైతాంగం చెరువులలో జలకల చూసి తేరుకొని నిలదొక్కుకునే అవకాశాలు మెరుగుపడుతున్నాయి. చెరువుల చుట్టూరా పాత కాలపు వృత్తులు దర్శనమిస్తున్నాయి. గ్రామీణ వృత్తులకు చెరువుల పూడిక తీత పనులు పునరుజ్జీవనం కలిగిస్తున్నాయని గ్రామీణులు పేర్కొనగం గమనార్హం.

గోదావరి బోసిన్లో 165 టీఎంసీలు, క్రుషా? బేసిన్లో 90 టీఎంసీలు మొత్తంగా 255 టీఎంసీలు చిన్న నీటి వనరులకు కేటాయించడం జరిగింది. నదీ జలాలను చిన్న నీటి వనరులకు తరలించడంలో గత కొంత కాలంగా నిర్లక్ష్యం జరిగిందని తెలంగాణ ప్రభుత్వం భావించింది. ఈ నీటిని వినియోగించి రైతాంగం సమస్యలకు శాశ్విత పరిష్కారం కనుగొనేందుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా చెరువులను పూడిక తీయడానికి మిషన్ కాకతీయ పథకానికి రూపకల్పన జరిగింది. తెలంగాణలోని 46,550 లకు పైగా చెరువులను పూడిక తీసేందేకు చర్యలు చేపట్టింది. చెరువుల పూడిక తీయడంతో దాదాపు 25 లక్షల ఎకరాలకు నీరందించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

చెరువుల్లో నీరు నిల్వ ఉండటం వల్ల భూగర ేజల మట్టాలు పెరుగుతాయి. బోర్ల కింద వ్యవసాయం పెరుగుతుంది. గ్రామాల్లోని ప్రజలు, పశుపక్షాదుల తాగునీటి సమస్య తీరుతుంది. చెరువుల పూడిక మట్టిని రసాయనిక ఎరువులకు ప్రత్యామ్నాయంగా వాడుకొనే వెసులుబాటు కలుగుంది. పూడిక మట్టి వాడకం వల్ల 50 శాతానికి పైగా రసాయనిక ఎరువుల వాడకం తగ్గుతుంది. పంటల దిగిబడి 15 నుండి 20 శాతం వరకు పెరుగుతుంది. ఈ మొత్తం ప్రక్రియతో రైతుల ఆదాయం పెరుగుంది.

ప్రతి సంవత్సరం 9,306 చెరువులను పునరుద్ధరణకు ఎంపిక చేయడం జరుగుతుంది. మొదలి దశలో 8,217 చెరువులను పూడిక తీయడానికి ప్రభుత్వం రూ. 2,611 కోట్లు మంజూరు చేసింది. 2015

మార్చి 12న ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు నిజామాబాద్ జిల్లా సదాశివనగర్ గ్రామంలోని పాత చెరువు పునరుద్దరణ పనులతో మిషన్ కాకతీయకు శ్రీకారం చుట్టారు. మొదటి దశ పనులను ఇప్పటికే పూర్తి చేశారు. రెండవ దశలో 9 వేల చెరువులను పూడిక తీయడానికి ప్రభుత్వం రూ. 3000 కోట్లు మంజూరు చేసింది. రెండవ దశ పనులు వివిధ దశల్లో ఉన్నాయి. అనేక చెరువుల పూడిక తీత పనులు పూర్తి కావచ్చే దశలో ఉన్నాయి. కొన్ని చెరువులను పూడిక తీయడం, అవి ఇటీవలి వర్షాలతో నిండి పొంగిపొర్లడం గ్రామస్తులు చూసి సంతోషం వ్యక్తం చేశారు.


చెరువుల పునరుద్దరణలో భాగంగా మట్టి కట్టలను బలోపేతం చేయడం, కొన్ని చెరువుల కట్టలను విస్తరించడం, వెడల్పు చేయడం, చెరువుల కట్టల మీద, చెరువులో పెరిగిన పిచ్చి చెట్లను తొలగించడం, తూము, అలుగులను మరమ్మతు చేయడం, అవసరమైన చోట పునర్నిర్మాణం చేయడం, ఫీడర్ ఛానళ్లను పునరుద్దరించడం, పంట కాలువలను పునరుద్దరించడం, ఆక్రమనలను తొలగించడం లాంటి పనులు చేపట్టారు. చెరువు గట్ల మీద ఈత, సిల్వర్ ఓక్, తదితర చెట్లను నాటడంతో పాత చెరువుల రూపే మారిపోయింది. జీవనోపాధికి దోహదపడే చెట్లు, సాగుకు ఊతమిచ్చే నీటితో పాత కాలపు చెరువులకు కొత్త కల వచ్చింది.

బీళ్లకు నీరిచ్చే పనులకు రైతులు, స్దానికులు సంపూర? సహకారం అందిస్తున్నారు. గ్రామీణులు వందల సంఖ్యలో వచ్చి పునరుద్దరణ పనులో పాల్గొన్న సంఘటనలు ఈ కార్యక్రమంలో కోకొల్లలు. రైతులు పోటీ పడి పూడిక మట్టిని తమ పొలాలకు తరలించుకు పోయారు. దాదాపు 7 కోట్ల 50 లక్షల క్యూబిక్ మీటర్ల పూడిక మట్టిని రైతులు తమ పొలాల్లోకి తరలించుకు పోయారు. ఈ విధంగా చెరువులను పూడిక తీయడంతో సుమారు 2.50 టిఎంసీల నీటి నిల్వ సామర్ధ్యం పెరిగిందని అధికారులు పేర్కొంటున్నారు. దాదాపు రూ. 400 కోట్ల విలువైన పూడిక మట్టిని రైతులు స్వఛ్ఛేదంగా తమ పొలాలకు తీసుకెళ్లారు.

కరవు వల్ల 13.52 లక్షల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. దాదాపు 21.78 లక్షల మంది రైతులు దెబ్బతిన్నారు. పత్తి, మొక్కజొన్న, సోయాబిన్ లాంటి పంటలు దెబ్బతిన్నాయి. దాదాపు 23,700 హెక్టార్లలో కూరగాయలు, మామిడి, బత్తాయి, పసుపు, మిరప లాంటి తోటలు దెబ్బతిన్నాయి. రైతులను ఆదుకొనేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. కరవు సహాయం సత్వరం విడుదల చేయాలని ఇప్పటికే కేంద్రాన్ని కోరడం జరిగింది. ఇలాంటి పరిస్థితులో భవిష్యత్ లో రాకూడదని భావించి ప్రభుత్వం జల వనరుల సద్వినియోగం పైన ద్రుష్టి కేంద్రీకరించింది. రైతులను అండగా నిలిచేందుకు వేల కోట్ల వ్యయంతో సాగునీటి రంగం అభివ్రుద్దికి చర్యలు తీసుకుంటుంది. క్రుషా?, గోదావరి లోని నీటి కేటాయింపులను వినియోగించేందుకు కార్యాచరణ అమలు జరుపుతుంది. కాకతీయుల నాటి చెరువులను కాపాడుకుంటే తెలంగాణలో కరవు పరిస్థితి ఉండేది కాదని ప్రభుత్వం గుర్తించింది. అందుకే చెరువులను పునరుద్దరించడానికి చర్యలు తీసుకుంటుంది. భారీ సాగు నీటి ప్రాజెక్టులను నిర్మించుకోవడంతో వరసగా రెండు మూడు సంవత్సరాల పాటు కరువ వచ్చినప్పటికీ సాగునీటికి, తాగు నీటికి ఇబ్బంది రాని విధంగా రిజర్వాయర్లను నిర్మించడానికి కార్యాచరణ అమలు జరుపుతుంది. సాగునీటి ప్రాజెక్టుల నిర్మిణం, చెరువుల పునరుద్దరణ, ఇంటింటికి నల్లాల ద్వారా మంచినీటిని సరఫరా చేయడంతో తెలంగాణలో నీటి సమస్యను అధిగమించాలని కేసీఆర్ ప్రభుత్వం భావించి వేగవంతమైన నిర?యాలతో నిర్మాణాత్మకమైన కార్యాచరణతో ముందుకు సాగుతుంది.

**– శంకర్ పంతంగి**





# సూక్ష్మ నీటి సాగు పద్ధతి (బిందు సేద్యం)

ప్రతిరోజు మొక్కకు కావాల్సిన నీటిని లేటరల్ పైపులకు అమర్చిన డ్రిప్పర్ల ద్వారా బొట్లు బొట్లుగా నేల ఉపరితలం మీద లేదా నేల దిగువన నేరుగా వేరు మండలంలో అతి స్వల్ప పరిమాణంలో గంటకు 1 నుండి 12 లీటర్ల వరకు అందించే విధానాన్ని 'బిందు సేద్యం' లేదా 'డ్రిప్ పద్ధతి' అంటారు. ఈ పద్ధతిలో డ్రిప్పర్ల వరకు నీరు పీడనం ప్రెషర్‌తో పైప్‌లైన్ల ద్వారా సరఫరా చేయబడుతుంది.


**డ్రిప్ నీటి పారుదల యాజమాన్యం:**

1. డ్రిప్ నీటి పారుదల పరికరాలన్ని బి.ఐ.ఎస్ ద్వారా ఐ.ఎస్.ఓ నాణ్యత ప్రమాణాలు కలిగి ఉండాలి.
2. డ్రిప్ పెట్టుకోవాలంటే ముందు మొత్తం నేల విస్తీర్ణం, నేల స్వభావం మరియు ఏటవాలు, నీటి వసతి మరియు నీటి నాణ్యత పరీక్ష ఫలితాల వివరాలు, మట్టి పరీక్ష ఫలితాలు, పండించవల్సిన పంటలు మరియు ఆ ప్రదేశం యొక్క వాతావరణ పరిస్థితులు తెలుసుకుని ప్రణాళిక తయారు చేసుకోవాలి.
3. ఏదైనా పంటలకు డ్రిప్ పెట్టుకోవాలంటే ఆ పంట యొక్క కీలక దశలో అత్యధిక నీటి అవసరాలు తెలుసుకోవాలి.
4. డ్రిప్ వ్యవస్థ యొక్క పరిమాణ పొలంలో అన్ని పంటలకు, అన్ని నేలలకు కీలక దశలలో నీరు సరఫరా చేయగలిగేదిగా ఉండాలి.
5. నేలలు, వాతావరణం పంటలు మరియు అవసరాన్ని బట్టి డ్రిప్ పరికరాలను ఎంచుకోవాలి.
6. డ్రిప్పర్ రంధ్రాల ద్వారా విడుదల అయ్యే నీరు భూమి మీద ప్రవహించే విధంగా ఉండకూడదు.

**డ్రిప్ పద్ధతి వల్ల కలిగే లాభాలు:**

1. వివిధ పంటలలో 21 నుండి 50% వరకు సాగునీరు ఆదా అవుతుంది.
2. మొక్కల వేళ్ళకు దగ్గరగా భూమిలో తేమ హెచ్చుతగ్గులు లేకుండా మొక్క పెరుగుదలకు అనుగుణంగా నీటిని, రసాయనిక ఎరువులను సరఫరా చేయడం వలన మొక్కలు ఏపుగా పెరిగి త్వరితంగా పక్వానికి వచ్చి అధిక దిగుబడులను (15 నుండి 50%) మరియు నాణ్యతమైన పంటను పొందవచ్చు.
3. అతి తేలికైన ఇసుక, నల్లరేగడి, లోతు తక్కువ మరియు ఎత్తుపల్లాలుగా ఉండే భూములకు, కొండ ప్రాంతాలకు ఎంతో అనువైనది.
4. ప్రతి చెట్టుకు నీరు ఒకే మోతాదులో సమానంగా అవసరాన్ని బట్టి అందజేయడం ద్వారా కొద్ది గంటలు మాత్రమే మోటారు నడపబడి కరెంటు వినియోగంలో దాదాపు 35-40% ఆదా అవుతుంది.
5. పోషక పదార్థాలను నీటిలో కరిగించి (ఫర్టిగేషన్ ద్వారా) నేరుగా మొక్కల వేళ్ళకు దగ్గరగా అందించడం వలన ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి (80-90%) దాదాపు (20-43%) ఎరువులు ఆదా అవుతాయి. ఈ పద్ధతి ద్వారా ఎరువులు నేరుగా మొక్కకు అందుతాయి.

**– పి.సాధ్వీ, బి.రాజశేఖర్, కె.మానస, బి.క్రాంతి, ఎల్.మహేష్, డి.రాజశేఖర్, పిజెటిఎస్ఎయు వ్యవసాయ కళాశాల రీసర్చర్స్, రాజేంద్రనగర్**



# బీమాతో ధీమా..

## (ప్రధానమంత్రి వ్యవసాయదారుల బీమాయోజన)

**రైతు ముంగిట పీఎంఎఫ్‌బీవై**
**ఖరీఫ్ నుంచే పథకం ప్రారంభం.**
**సంయుక్తంగా అమలు చేయనున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు**

అతివృష్టి, అనావృష్టి, ఇవి చాలదన్నట్లు చీడపీడల బెడద.. ఇలా సమస్యలతో సతమతవుతున్న రైతన్నకు ఉపశమనం కలిగించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా కొత్త పథకానికి శ్రీకారం చుట్టాయి. విత్తనాలు విత్తిన దగ్గర నుంచి పంట ఇంట్లోకి చేరేదాకా అనుక్షణం రైతు భయంగా బతుకాల్సిన పరిస్థితి ఉన్నది. పండించిన పంటకు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం జరిగినప్పుడు ఆ లోటును పూడ్చుకునేందుకు బీమా పథకాలున్నప్పటికీ ఫలితం మాత్రం శూన్యం. ప్రకృతి వైపరీత్యాల వల్ల, చీడపీడల వల్ల పంట నష్టం సంభవించినప్పుడు రైతులకు బీమా సౌకర్యం, ఆర్థికంగా చేయూతనివ్వడం. అంతేకాకుండా అధునాతన, నవ్య ఆవిష్కరణల అమలు దిశగా రైతులను ప్రోత్సహించడం, వ్యవసాయంలో పరపతి సౌకర్యాలు మెరుగుపరుచడం వంటి ప్రధాన ఉద్దేశాలు పీఎంఎఫ్‌బీవై పథకం లక్ష్యాలు.

**పథకాన్ని అమలుపర్చే ఏజెన్సీ..**

ఈ పథకాన్ని అమలుచేసేందుకు రాష్ట్రాన్ని మూడు క్లస్టర్లుగా విభజించారు. మొదటి క్లస్టర్‌లో ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాలున్నాయి. రెండో క్లస్టర్‌లో మహబూబ్‌నగర్, వరంగల్, కరీంనగర్ జిల్లాలు ఉండగా మూడో క్లస్టర్‌లో ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి జిల్లాలను ఎంపిక చేశారు. 1, 3 క్లస్టర్లకు నోడల్ ఏజెన్సీగా అగ్రికల్చ ర్ ఇన్స్యూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా ఈ పథకం అమలు చేస్తుంది. రెండవ క్లస్టర్‌లో ఉన్న జిల్లాలో బజాజ్ ఇన్స్యూరెన్స్ కంపెనీకి బాధ్యతలను అప్పజెప్పారు. ఇందుకు సంబంధించి జీవో ఆర్‌టీ నెం.250ను రాష్ట్ర ప్రభుత్వం మే 30న విడుదల చేసింది. ఆయా జిల్లాల్లోని ప్రధాన పంటలకు గ్రామ యూనిట్‌గా బీమా వర్తిస్తుండగా, మిగిలిన పంటలకు మండల యూనిట్‌గా చేసుకొని బీమాను అందజేస్తారు. ఖమ్మం, నల్గొండ, జిల్లాల్లోని వరి పంటలు, మెదక్, రంగారెడ్డి జిల్లాలకు మొక్కజొన్న, ఆదిలాబాద్ జిల్లాకు సోయాబీన్ పంటలకు గ్రామ యూనిట్‌గా చేసుకొని నష్టాన్ని అంచనా వేస్తారు. పంటల కోత ప్రయోగాల ద్వారా దిగుబడి అంచనాలు లభించే అన్ని పంటలకు ఈ బీమా వర్తిస్తుంది. గుర్తించిన పంటలను సాగుచేసే రైతులందరూ ఈ పథకాన్ని వినియోగించుకునే వెసులుబాటు కలుగుతుంది. అయితే బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందే రైతులు తప్పనిసరిగా పంట బీమా చేయాలి. పంట రుణాలు పొందని రైతులు ఈ పథకాన్ని స్వచ్ఛందంగా వినియోగించుకోవచ్చు.

**బీమా అమలు...**

అనుకూల వాతావరణ పరిస్థితుల వల్ల బీమా చెల్లించిన రైతులు పంట విత్తుట, నాట్లు వేయుట చేయలేని పరిస్థితుల్లో బీమా మొత్తంలో 25 శాతం గరిష్టంగా బీమా పొందేందుకు అర్హులు. రైతులు పంటను కోసి ఆరబెట్టిన సమయాల్లో తుఫాన్, అకాలవర్షాలు సంభవించినప్పుడు ఈ పథకం దోహదపడుతుంది. రైతు క్షేత్రం ప్రాతిపదికగా కోత అనంతరం గరిష్టంగా పధ్నాలుగు రోజుల వరకు బీమా వర్తిస్తుంది. బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందే రైతులకు బీమా మొత్తం పంట రుణానికి సమానం. అదేవిధంగా స్వచ్ఛందంగా పంటలు బీమా చేసుకునే రైతులకు బీమా మొత్తం పంటల మద్దతు ధరకు సమా నం. పంట రుణాలు పొందే రైతులకు పంట రుణానికి అదనంగా బీమా ప్రీమియాన్ని బ్యాంకులు అందించనున్నాయి. ఖరీఫ్‌లో

**నిర్ణీత పంట బీమా మొత్తం రైతు ఎకరాకు చెల్లించాల్సిన ప్రీమియం**

| పంటలు | బీమా కవరేజ్ | ప్రీమియం |
|---|---|---|
| మొక్కజొన్న | రూ.20 వేలు | రూ.400 |
| వరి | రూ.28 వేలు | రూ.420 |
| జొన్న | రూ.10 వేలు | రూ.200 |
| కందులు | రూ.13 వేలు | రూ.260 |
| పెసర్లు | రూ.10 వేలు | రూ.200 |
| మినుములు | రూ.10 వేలు | రూ.200 |
| వేరుశెనగ | రూ.16 వేలు | రూ.320 |
| మిర్చి(వర్షాధార) | రూ.24 వేలు | రూ.1200 |
| సోయా చిక్కుడు | రూ.13 వేలు | రూ.260 |

సాగు చేసే ఆహా ర, అపరాలు, నూనెగింజల పంటలకు రెండు శాతం బీమా ప్రీమియం. రబీలో సాగుచేసే పంటలకు 1.5 శాతం బీమా ప్రీమియాన్ని చెల్లించాలి. పంట దిగుబడి అంచనాల కోసం పంట కోత ప్రయోగాలు దోహదపడనున్నాయి. గ్రామస్థాయిలో ప్రధాన పంటలకు నాలుగు పంట కోత ప్రయోగాలు, మండల స్థాయిలో 10, జిల్లాస్థాయిలో 16 పంట కోత ప్రయోగాలు చేపట్టనున్నారు. ప్రస్తుతం పంటల కోత ప్రయోగాల ద్వారా వచ్చే దిగుబడి అంచనాలు పంటల బీమా క్లెమ్‌ల పరిష్కారానికి జాప్యం జరుగుతున్న సంగతి తెలిసిందే. నాణ్యత, త్వరితగతిన నమ్మకమైన దిగుబడి అంచనాలను అవసరం కోసం జీపీయస్ ఆధారిత సేవల కోసం మొబైల్ వ్యవస్థను వినియోగించనున్నారు. ఈ ప్రయోగాలకు అవసరమయ్యే వ్యయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరించనున్నాయి.

**కార్యాచరణ, కాలపట్టిక..**

రుతు పవనాల ఆగమనం, పంట విత్తే సమయం, పంట కాలం మొదలైన విషయాల ఆధారంగా పంటల బీమాకు వివిధ స్థాయిల్లో గడువు నిర్ణయించారు. పంట రుణాలు పొందే రైతులు ఖరీఫ్‌కు సంబంధించి ఏప్రిల్ నుంచి జూలై వరకు, రబీకి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు గడువు. పంటల బీమా దరఖాస్తులను ఖరీఫ్‌కు ఆగస్టు 10, రబీకి డిసెంబర్ 31 గడువు. అదే విధంగా బ్యాంకుల నుంచి రైతులు డిక్లరేషన్ ఫారాలు ఏజెన్సీకి అందించాలంటే పంట రుణా లు పొందే రైతులు 15 రోజుల్లో, పంట రుణాలు పొందని రైతులు నిర్దేశించిన గడువు తర్వాత ఏడు రోజుల్లోపు అందించాలి. బీమా క్లెయిమ్‌ల వివరాలు సంబంధిత నోడల్ బ్యాంకులకు బీమా ఏజన్సీ అందిస్తుంది. క్లెయిమ్‌ల లబ్ధిదారుల జాబితా బ్యాంక్ నోటీస్ బోర్డులపై ప్రదర్శింపబడుతా యి. ఈ పథకం అమలు కోసం కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను జారీ చేయనున్నది. పంట కాలంలో జిల్లాలో పంటల సాగు, విస్తీర్ణం, వాతావరణ పరిస్థితి, పంట పెరుగుదల, చీడపీడల పరిస్థితిని జిల్లాస్థాయి మానిటరింగ్ కమిటీ సమీక్షిస్తూ పక్షం రోజులకోసారి నివేదికను తయారుచేస్తుంది.

**– మద్దెల లక్ష్మయ్య, ఖమ్మం వ్యవసాయం**

# మిషన్ భగీరథ రెండో దశపై సర్కారు దృష్టి

రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ రెండో దశ పనులపై దృష్టిసారించింది. తొలి విడత ప్రాజెక్టును ఈనెల ఏడున మెదక్ జిల్లా గజ్వేల్‌లో ప్రధానమంత్రి ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రెండో దశకు సంబంధించిన పనులు జరుగుతున్నాయి. ఖమ్మం జిల్లా పాలేరు, వైరా సెగ్మెంట్లలో ఇంటేక్‌వెల్ పనులు సేఫ్‌స్టేజీకి చేరాయి. పైపులైన్ పనులు సైతం కొనసాగుతున్నాయి. పాలేరు సెగ్మెంట్‌లో నాయక్‌రామ్‌గూడెం తండాలో ఇంటేక్‌వెల్ పనులు ఇప్పటికే చేపట్టారు. దీనికి రూ.418 కోట్లను సర్కారు కేటాయించింది. దీని ద్వారా ఖమ్మం జిల్లాలోని పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాలు, వరంగల్ జిల్లాలోని 17 మండలాలకు తాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 750 హెచ్‌పీ సామర్థ్యంతో ఆరు పంపుసెట్లతో వరంగల్‌కు, 280 హెచ్‌పీ సామర్థ్యంతో రెండు పంపుసెట్లతో ఖమ్మం జిల్లాకు నీటిని సరఫరా చేయాలని నిర్ణయించారు. మొత్తం ఆరు పంపుసెట్లకుగాను నాలుగు ఎప్పుడూ పనిచేసేలా, మరో రెండు రిజర్వులో ఉండేలా మిషన్ భగీరథ ఇంజినీరింగ్ యంత్రాంగం ప్రణాళిక రూపొంది ంచింది. పాలెరు సెగ్మెంట్ కోసం జెల్లచెరువు వద్ద 90 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఇంటెక్‌వెల్ నిర్మాణం చేస్తున్నారు. ఇక్కడ 500 కేఎల్, 4000 కేఎల్ సామర్థ్యం గల రెండు సంపులు సైతం కొత్తగా అందుబాటులోకి రానున్నాయి. వైరా సెగ్మెంట్ పరిధిలో ముక్రీహిల్స్ వద్ద 56 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన సంపులను నిర్మిస్తున్నారు. ఇక్కడ నుంచి వైరా, కొంజెర్ల, బోనకల్, మధిర, ఎర్రపాడు, తల్లాడ, కల్లూరు, పినపాక, వెన్సూర్, ఎన్కూరు, జూలుపాడు, చింతకాని మండలాల్లో 138 అవాసప్రాంతాలకు తాగునీటి సరఫరా చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇక్కడ ట్రీట్‌మెంటు ప్లాంటు పనులు సైతం చేపట్టారు. దీనికి రూ.575 కోట్లు ఖర్చు పెడుతున్నారు. ఇదే సెగ్మెంట్ పరిధిలో సీతారామపురంలో 1.50 లక్షల ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఓహెచ్‌బీఆర్‌ను నిర్మిస్తున్నారు. ఎల్ అండ్ టీ చేపట్టే ఆయా నిర్మాణాలకు పార్మర్ టెక్నాలజీ, స్లీప్‌ఫామ్ టెక్నాలజీని వాడుతున్నారు. 30 మీటర్ల ఎత్తును కేవలం 12 రోజుల వ్యవధిలో పూర్తి చేసినట్టు ఆ కంపెనీ ఇంజనీర్లు చెప్పారు. ఇక్కడి నుంచి మాధాపూర్, కొత్తకొత్తూరు, బరారపల్లి, పటాలపాడు, చెవెల పాడు ప్రాంతాలకు నీటి సరఫరా చేయనున్నారు. దుమ్ముగూడెం ఇంటెక్‌వెల్స్ పనులు సైతం సేఫ్‌స్టేజీకి వచ్చినట్టు స్థానిక ఇంజినీర్లు తెలిపారు. ఇటీవల గొదావరి వరదల మూలంగా కొంత ఆలస్యమైనట్టు ఆర్‌డబ్ల్యూఎస్ అధికా రులు అంటున్నారు. ఇదే సెగ్మెంట్ పరిధిలో ఉన్న రథంగుట్ట దగ్గర ట్రీట్‌మెంటు ప్లాంటు నిర్మాణం సాగుతున్నది. ఇక్కడి నుంచి 22 మండలాల్లోని 1826 ఆవాసాలకు తాగునీటిని అందించే పనులు జరుగు తున్నాయి. దుమ్ముగూడెం సెగ్మెంట్‌లోని చర్ల మండలంలోని 91 ఆవాసాలకు నీటిని అందించనున్నారు. 145 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ట్రీట్‌మెంటు ప్లాంట్ నిర్మాణం చేపడుతున్నారు. దీని ద్వారా కొత్తగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా నియోజ కవర్గాలకు తాగునీటి సరఫరా చేయనున్నట్టు అధికారులు వివరిం చారు. ఈ గుట్టపై 3 జీఎల్‌బీఆర్‌లను నిర్మిస్తున్నారు. వీటిలో రెండు జీఎల్‌బీ ఆర్‌లు 1200 కేఎల్ సామర్థ్యం ఉన్నవి కాగా, మరొకటి 1000 కేఎల్ సామర్థ్యంతో కూడుకున్నది. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో జరుగు తున్న పనులను మెఘా ఇంజినీరింగ్, నాగార్జున కన్‌స్ట్రక్షన్స్, ఎల్ అండ్ టీ, కోయ, కావేరీ కంపెనీలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు.

**– వార్తాంశం**

# పంచాయతీపాలనలో మహిళలు చతురత

మహిళల వెనుకబాటుతనానికి ప్రధాన కారణాలలో వికేంద్రీకృత పాలన, పంచాయతీ ద్వారా అభివృద్ధిలో స్త్రీలు పాలుపంచుకోకపోవడం, స్త్రీల భాగస్వామ్యం లేకపోవడం, 73వ రాజ్యాంగ సవరణ అతి ప్రధానమైన స్థానిక ప్రభుత్వాలలో స్త్రీలకు భాగస్వామ్యం కల్పించింది. మహిళలకు రాజకీయ సాధికారత సిద్ధించే దిశగా 73వ రాజ్యాంగ సవరణను గొప్పముందడుగుగా చెప్పవచ్చును. పది లక్షల మందికిపైగా మహిళలు రాజకీయ ప్రజాప్రతినిధులుగా ప్రజా సంబంధ కార్యకలాపాలలో పాల్గొనగలిగినారు. సామాజిక మార్పులో మహిళల పాత్ర అద్వితీయమైంది. ప్రభుత్వ విధానాల్లో పరిపాలనలో అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో మహిళలు భాగస్వామ్యం కావడం వల్ల సత్ఫలితాలు వస్తాయి. రాజ్యాంగం 243(జి) అధికరణం ద్వారా మహిళలకు పంచాయతీరాజ్ సంస్థలలో 33 శాతం రిజర్వేషన్లు కల్పించడం వల్ల 1994 తర్వాత మార్పువచ్చింది. పంచాయతీ వ్యవస్థ సూత్రబద్ధ, స్వయంపాలిత అర్థవంతమైన రీతిలో సాగినప్పుడు మాత్రమే మహిళల చురుకైనా పాత్ర వారి హక్కులు, అభివృద్ధి పట్ల ప్రయోజకత్వం చేకూరుతుంది.



పంచాయతీరాజ్ వ్యవస్థలో స్త్రీలు అధిక సంఖ్యలో ప్రవేశించడం వల్ల పరిమాణపరంగానే గాక, నాణ్యతపరంగా కూడా మార్పువచ్చింది. స్త్రీలు స్థానిక ప్రభుత్వాలలో తమ అనుభవాన్ని రాష్ట్ర పాలనను పరిపుష్టం చేసేందుకు రాజ్యదారిద్ర్యం, అసమానత లింగవివక్ష మొదలైన అంశాల పట్ల స్పందన చూపిస్తున్నారు. గ్రామానికి సంబంధించిన రాజకీయాలలో వారు కూడా తమ గళాన్ని వినిపించగలుగుతున్నారు. అసెంబ్లీ పార్లమెంట్‌లో సభ్యులవడానికి ఇదొక శిక్షణగా ఉపయోగపడుతుంది. వికేంద్రీకరణ ప్రభుత్వ వ్యవస్థలో భారీస్థాయిన మహిళా ప్రాతినిధ్యం విస్తరించడం ఎన్నో ప్రయోజనాలకు దారి తీస్తుంది. అన్నిరంగాలలో మహిళలను భాగస్వామ్యం చేస్తూ కార్యక్రమాలను రూపొందించాలి. మహిళా రిజర్వేషన్ బిల్లు 2010ను పార్లమెంట్ ఎగువ సభ ఆమోదించడం ద్వారా మహిళలకు రాజకీయరంగంలో మరింత ప్రాముఖ్యత ఇవ్వడం అభివృద్ధి ప్రక్రియలో వారిని క్రియాశీల భాగస్వాములను చేయడంలో ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. పంచాయతీల్లో మహిళా రిజర్వేషన్లు రాజ్యాంగం మూడోవంతుకు పరిమితం చేసింది. ప్రపంచ జనాభాలో సగం ఉన్న మహిళలు ప్రపంచంలోని మూడింట రెండొంతులు పనిచేస్తున్నారు. అదే సమయంలో ప్రపంచ ఆదాయంలో కేవలం పదింట ఒక వంతు ప్రపంచ ఆస్తిలో వందలో ఒకటో వంతు మాత్రమే పొందుతున్నారు. మహిళలు సామాజిక కట్టుబాట్లు, పురుషాధిక్యత వంటి కారణాలతో కనీస అవసరాలను కూడా నోచుకోకపోయారు. లైంగిక దాడులు, వరకట్నవేధింపు, మరణాలు, ఆరోగ్యరక్షణలో వివక్షత, తక్కువ అక్షరాస్యత, పనిచేసే చోట వివక్ష, ఇంట్లో చిన్నచూపు తప్పించుకోలేని అంతులేని బాధలో కొనసాగారు. మనదేశంలో వ్యవసాయ శ్రమశక్తిలో మహిళలు 66 శాతంగా ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు, తల్లులు పౌష్టికాహార వివక్షతను ఎదుర్కొంటున్నారు. రక్తహీనత, పౌష్టికాహారలోపంతో బాధపడుతున్నారు. వేతన కార్మికుల్లో పురుషులకంటే మహిళలు చాలా తక్కువ. మహిళా కార్మికుల్లో 90 శాతం గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం, అనుబంధరంగాలలో పనిచేస్తున్నారు. మహిళలు, పురుషులు భాగస్వామ్యం ద్వారానే న్యాయమైన సమానత్వం సాధించిన దేశాన్ని నిర్మించగలం.

సాధికారత అంటే మహిళలు తామంతట తాముగా స్వీయ విశ్వాసం పెంచుకోవడం, స్వేచ్ఛగా ఎంపిక చేసుకునే హక్కును పదిలపరుచుకోవటం, తమను తాము తక్కువగా చేసుకొనే పద్ధతిని నిర్మూలించేందుకు ఎదురయ్యే సవాళ్లను అధిగమించేందుకు సహాయపడే వనరులపై నియంత్రణ సాధించడమే సామాజిక ఆర్థిక రాజకీయ సామర్థ్య అభివృద్ధి వంటిది. మహిళలకు విద్య అందించడం, వారికి మంచి ఆరోగ్య రక్షణ కల్పించడం, జీవనాధారం అందించడం, ఇంటిలో సమాజంలో నిర్ణయాలు తీసుకునే సమయంలో వారిని భాగస్వాములు చేయడం మహిళా సాధికారత ప్రభుత్వ పరిపాలన ప్రభావం స్పష్టంగా మహిళలపై సాధికారతకు అవినాభావ సంబంధం ఉంది. రాజకీయ

నిర్ణయాధికారం సంక్రమించేందుకు 73వ సవరణ చట్టం వలన దాదాపు 10 లక్షల మంది మహిళలు పంచాయతీ పాలకవర్గాల్లో ప్రవేశించారు. ఇందులో 40 శాతం అణగారిన వర్గాలకు చెందిన వారున్నారు. గ్రామీణస్థాయి స్థానిక ప్రభుత్వాలలో ప్రజాప్రతినిధులుగా ఛైర్‌పర్సన్లుగా అణగారిన వర్గాల






మహిళలు పదవులు అలంకరించడాన్ని ఆర్థిక, సామాజిక రాజకీయ సాధికారత గుర్తించవచ్చు. మనదేశంలో మహిళల సాధికారత కోసం మన రాజ్యాంగంలో ప్రత్యేకంగా మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం కొన్ని ప్రత్యేక హక్కులను కల్పించారు. ఆర్టికల్ 14 మహిళలందరికీ సమానత్వం కల్పించింది. ఆర్టికల్ 15(1) ప్రభుత్వవైపు నుండి వివక్షత ఉండకూడదు. ఆర్టికల్ 16 సమాన అవకాశాలు, ఆర్టికల్ 39(డి) సమాన పనికి సమాన వేతనం, ఆర్టికల్ 51(ఎ)(సి) మహిళల స్వాభిమానాన్ని కించపరిచే పద్ధతులను విడనాడడం ఆర్టికల్ 15(3) మహిళలు, పిల్లలకు ప్రభుత్వం ప్రత్యేక కేటాయింపులు చేసేందుకు రాజ్యాంగం అనుమతి ఆర్టికల్ (42) పనిలో న్యాయమైన మానవీయమైన వాతావరణం కల్పించుట మాతృత్వ వెసులుబాటు కల్పించడం మొదలైనవి. మహిళా ప్రజాప్రతినిధులకు సాంకేతిక సహాయంతో పాటు ఎన్నికైన స్థానిక ప్రభుత్వాలకు, మహిళ సంస్థలకు మధ్య సంబంధాన్ని పటిష్టం చేయడం ద్వారా స్త్రీల మధ్య సంఘీభావాన్ని నిర్మించడానికి కూడా సహాయం కావాలి. స్త్రీల నాయకత్వం పురుషుల నాయకత్వం కంటే భిన్నంగా ఎటువంటి ప్రయోజనాల్ని మహిళలకు గాని, మొత్తం సమాజానికి గాని చేకూరుస్తుంది. మహిళల్లో అక్షరాస్యత మహిళల ఆర్థిక, సామాజిక స్థితిగతులను ప్రభావితం చేస్తుంది. స్థానిక సంస్థలోని ప్రజాప్రతినిధులైన మహిళల్లో నిరక్షరాస్యులు ఉన్నారు. వారికి రాజకీయ అనుభవం లేదు. దీనిని ఆసరా చేసుకొని పురుషులే ఆధిపత్యం చెలాయిస్తున్నారని విమర్శలు ఉన్నాయి. పంచాయతీలలో లింగవివక్ష లేదని, సమావేశాల్లో తమ హాజరుకు ఆమోదం లభిస్తుందని వివిధ సమస్యలను స్వేచ్ఛగా ప్రస్తావించే అవకాశం లభించిందని మరింత చురుగ్గా పనిచేసే ప్రోత్సాహం లభించిందని మహిళా ప్రజాప్రతినిధులు వెలిబుచ్చారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో స్త్రీల అనుభవం వారిలో చాలా మందిని మార్చింది. సాధికారత, ఆత్మవిశ్వాసం, రాజకీయ అవగాహన, గుర్తింపు కోసం కృషి చేయడం మొదలైన మార్పులు తెచ్చింది. స్త్రీలు పోటీలేని సహకార ధోరణి ఉన్న కొత్త స్థితిని సారూప్య భావాలు, ఆకాంక్షలు ఉన్న స్త్రీలతో కలిసి పార్టీలకతీతతంగా పనిచేయడం ద్వారా నెలకొల్పుతున్నారు. ప్రస్తుత మహిళా ప్రజాప్రతినిధుల్లో అధికశాతం పురుష మద్ధతుదారులచేతిలో ఎంతమాత్రం కీలుబొమ్మలుకారు. వారిలో 60 శాతం ఎన్నికలలో పోటీపై స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకొంటున్నారు. మహిళా సాధికారత ద్వారా రాజకీయవ్యవస్థలో వారి పాత్రను ప్రోత్సహించే వ్యూహాల్లో లింగపరమైన రిజర్వేషన్ కీలకమైనది. మహిళల ఆధ్వర్యంలోని పంచాయతీల్లో ఆదాయవృద్ధి కూడా సాధించారు. నిరక్షరాస్యత, భాషాపరమైన ఇబ్బందులు, అనుభవం లేకపోవడం, గ్రామస్థలలో తగిన గుర్తింపులేకపోవడం వంటి సమస్యల ఎదుర్కొంటున్నారు. రాజకీయ సంకల్పం, విధానాలు, చట్టాలు, సామాజిక నేపథ్యం, దృక్పథాల పట్ల మహిళల్లో సరైన అవగాహన ఉండాలి. నాయకత్వం లేమి, పురుషుల ఆధిపత్యం, ప్రజలతో నేరుగా సంబంధ బాంధవ్యాలు లేకపోవడం నిరక్షరాస్యత, సామాజిక అవరోధాలు, ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన లేకపోవడం అధికారుల నుండి ప్రజాప్రతినిధులో ఉ ంటున్నది.

స్త్రీల రాజకీయ ప్రక్రియల స్వీయ ప్రయోజనాలనేకాక పరస్పర ప్రయోజనాలను నెరవేర్చింది. పంచాయతీరాజ్ వ్యవస్థలో స్త్రీల భాగస్వామ్యం స్త్రీలుగా ప్రత్యేకమైన గుర్తింపు స్థిరపరచుకోవడానికి, ఇతర స్త్రీల అనుభవాలను పంచుకోవడానికి సంఘటితమవడానికి దోహదం చేసింది. స్త్రీలు అధికసంఖ్యలో పాలనలోకి వచ్చే కొద్ది పాలనా వ్యవస్థలో స్త్రీల సమస్యలు, ఆకాంక్షలు ప్రతిబింబించే విధంగా వారిని మారుస్తున్నారు. పంచాయతీరాజ్‌వ్యవస్థ విజయం మహిళలు ××× నుండి రాజ్యం స్వరూపాన్ని మార్చడం మీద ఆధారపడి ఉంటుంది. పంచాయతీరాజ్ వ్యవస్థలో మహిళల సాధికారతకు వాస్తవంగా దోహదపడాలంటే వారి చురుకైన పాత్రను ప్రోత్సహించే సామాజిక, మానసిక, రాజకీయ పరిస్థితులను సృష్టించాలి. మహిళల సమస్యలపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించాలి. వారి కోసం స్వతంత్ర ప్రతిపత్తి మహిళ, బాలల అభివృద్ధి మంత్రిత్వశాఖను ఏర్పాటు చేసింది. మహిళకు చట్టబద్ధమైన సమానత్వం ప్రత్యేక బడ్జెట్ కోసం చట్టం ముందస్తు చర్యలు గైకొనాలి. మహిళల సంక్షేమ కార్యక్రమాలు, కార్యక్రమాలను మెరుగుపరిచేందుకు మహిళలకు కేంద్రం ప్రత్యేక బడ్జెట్ జెండర్‌బడ్జెటింగ్ ప్రవేశపెట్టి బడ్జెట్ కేటాయింపులు పెంచి మహిళలకు సంబంధించిన కార్యక్రమాలను, పథకాలను యుద్ధప్రాతిపదికన అమలు చేసేందుకు నేషనల్ మిషన్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్‌ను పటిష్టపరచాలి. ప్రభుత్వం నడిపిస్తున్న సూక్ష్మసంస్థ రాష్ట్రీయ మహిళాకోశ్‌ను పునర్‌వ్యవస్థీకరించాలి. మహిళా సహాయ గ్రూపులకు ఏకపక్ష సింగిల్‌విండో విధానంలో చేసేందుకు వీలుకల్పించాలి. ప్రభుత్వం రూపొందించి ఏ విధానపర రూపకల్పనలో పరిపాలనాపరంగా సామాజికంగా, ఆర్థికంగా మహిళా సాధికారత సాధించేందుకు నిర్ణయాలు అమలు చేయాలి.

# గ్రామీణ క్రీడలకు ప్రోత్సాహం

విజ్ఞాన వికాసాలకు విద్యతో పాటు ఆటపాటలూ ఉండాల్సిందే. ఎంత చదివినా సంస్కారం లేకపోతే ఆ వ్యక్తి పరిపూర్ణుడు కాలేడని చెప్పినట్లే. ఎంత విద్య చదివినా మానసికోల్లాసాన్నిచ్చే ఆటపాటల్లో కొంత లోటు ఉన్నట్లే చెప్పుకోవాలి. అందుకే క్రీడల్లో ప్రవేశమున్నా లేకున్నా ఎవరైనా కాస్త మందకొడిగా కనిపిస్తే చాలు అలా దిగాలుగా ఉన్నారేమిటి? కాస్త క్రీడాశక్తి ఉండాలోయ్ అనేస్తుండటం సహజం.



మడిసన్నాక కాస్త కళాపోషణుండొద్దూ! అంటూ 'ముత్యాల ముగ్గు' సినిమాలో రావుగోపాలరావు అన్నాడంటే దాని వెనుక ఇలాంటి మర్మమే వినిపిస్తుంది. ఎన్నో సందర్భాల్లో సరైన వ్యాయామం లేకపోతే డయాబెటిస్ వస్తుందనో, గుండెబలంగా ఉండాలంటే వ్యాయామం చేయాలంటూ డాక్టర్లే కాదు కాస్త సమాజాన్ని, సమాజంలోని మనుషుల ఆహారపుటలవాట్లను గుర్తించి తెలిసిన వారెవరైనా 'వ్యాయామం' ముచ్చట్లు ముచ్చటిస్తారు. ఈ కాలంలో మెదడుకు తగిన పదును పెట్టడమే సరిపోతోంది తప్ప శరీరానికి అసలు ఏ మాత్రం వ్యాయామం ఉండటం లేదు. అందువల్లనే మేధోశక్తి పెరుగుతోంది తప్ప శారీరక శ్రమకు అవకాశం లేక ఊబకాయంతో సతమతమైపోతున్న వారినెందరినో చూస్తున్నాం.



మెదడుతో సమానంగా శరీరానికి కూడా వ్యాయామాన్ని కలిగించే శక్తి ఉన్న క్రీడలను గ్రామీణ ప్రాంతాల్లో ఏనాటి నుంచో ఆదరిస్తున్నారు. అందుకే పట్టణవాసుల కన్నా గ్రామీణుల జీవన ప్రమాణమూ ఎక్కువగా ఉంటోంది. ఆధునిక కాలంలో ఎక్కడ్నించో అరువు తెచ్చుకున్న క్రికెట్ క్రీడ ప్రతి ఒక్కరిలో క్రీడాసక్తినింపుతోంది. ఎక్కడైనా క్రికెట్ ఆడుతుంటే నేటి విద్యార్థుల దృష్టి ఆటవైపే వెళ్లిపోతుంది. చిన్న చిన్న జీవనోపాధిపై బతికే వారే కాదు వంటింటి పనికే పరిమితమైన ఆడవారు, ఏడుపదుల బామ్మ గారు కూడా క్రికెట్ కామెంటరీలు వినడం, విశ్లేషించడం చేస్తుంటారు. అదేదో మైకమని అనుకోవడానికి లేదు. కేవలం క్రికెట్ కామెంటరీలు విని ఫలానా క్రికటర్ ఆడిన ఆటను కళ్లకు కట్టినట్లు స్మృతిపథం మీదకు ఆహ్వానించుకుని విశ్లేషణలు చేయగలుగుతున్నారంటే అది వారి మెదడుకు పదును పెట్టడంలో భాగమే. అతి ప్రాచీనకాలం నుండి గ్రామీణ క్రీడలు ప్రాశస్త్యం చెందాయి. వీటిలో ఎన్నో తరతరాలుగా వ్యాపించినా ఆధునికానికి కొన్నే మనుగడలో ఉన్నాయి. అయినా అమ్మమ్మలు, తాతయ్యలు ఇప్పటికే ఆ క్రీడల గురించి విశేషంగా చెబ్తుంటారు. జన పదాల్లో కలిసికట్టుగా ఉండేందుకే 'కబాడీ' వంటి ఆటలు నేర్చుకున్నా వ్యాయామానికీ వాటికీ కూడా అవినాభావ సంబంధమున్నట్లే భావిస్తుంటారు. ఆ జానపద క్రీడలే నేటి గ్రామీణ క్రీడలుగా విలసిల్లుతున్నాయి. ఈ నాటికీ పండుగలొచ్చాయంటే కబాడీ, ఖోఖో, కోడిపందాల వంటి ఆటలు నడుస్తున్నాయి. సంక్రాంతికి వీటి పోటీలు కూడా ఉంటుంటాయి. విశేషమేమిటంటే ఈ క్రీడలన్నీ యువకుల్లో క్రీడాసక్తిని పెంచి మానసికోల్లాసాన్ని కలుగజేస్తున్నాయి. ఉండ్రాళ్లతద్ది, అట్లతద్ది వంటి పండుగ రోజుల్లో యువతులు ఉయ్యాలలూగడం, దాగుడుమూత దండాకోర్, గచ్చగాయలు, తొక్కుడుబిళ్ల, వామనగుంటలు, చెమ్మచెక్క, ముక్కుడుగిల్లాటలు ఆడ్తుంటారు.



యువకులు వైకుంఠపాలి, చదరంగం, కోతికొమ్మచ్చి, చెడుగుడు, పులిమేకా వంటి ఆటలు ఆడటం కద్దు. కానీ రానురాను ఈ ఆటలు దాదాపు కనుమరుగైపోతున్నాయి. ఇలాంటి ఆటల మీద ఆసక్తి అవకాశము, సమయం, తగ్గిపోయి మరచిపోతున్నారు. అందుచేత ఈ ఆటల వలన జరిగే వికాసమూ తక్కువగానే ఉంటోంది.

పల్లెటూళ్ల నుంచి పట్నవాసానికి రావడంతో గ్రామీణ సంప్రదాయాలు, ఆటల సంస్కృతినీ మరిచిపోతున్నారు. ఏ ఆట ఎలా ఆడుతారో గుర్తుంచుకున్నవారు లేరు. అందుకే ఆ ఆటలు ఉనికి కోల్పోయాయి. నిజానికి గ్రామీణ క్రీడలు యుద్ధవిద్యలని కొందరు విశ్లేషించినా ఈ ఆటల్లో వెలికివచ్చేది క్రీడాసక్తి మాత్రమే. భారతదేశంలో పుట్టిన చదరంగం ఆట నిజానికి మెదడుకి మేతే కదా! మెదడుకు పదును పెడితేనే ఎత్తుగడలు వేసే ఆలోచన వస్తుంది. ఈ ఆటలో సాధన చేసే కొద్దీ నైపుణ్యం పెరుగుతుంది. చదరంగం ఆడేవారి ఐ.క్యూ. చూస్తే మామూలు వారిలో కన్నా ఎక్కువేనని కొన్ని అధ్యయనాలు చెప్పాయి. గోళీలాట, బిళ్లంగోడు, తొక్కుడుబిల్ల వంటి ఆటలు కూడా శారీరక మానసిక నైపుణ్యాన్ని పెంచుతాయి. ఈ ఆటలలో ఎదుటివారిని లేదా వారి జట్టును గెలవాలన్న లక్ష్యం ఉంటుంది. విజయం సాధించాలనే పట్టుదల, ఎత్తులు పై ఎత్తులు ఉంటాయి కనుక మెదడుకు పదును పెట్టాల్సిందే. అందుకే ఆటలు ప్రాచీనానివైనా, ఆధునికమైనవైనా మనవైనా, పరవారివైనా కూడా క్రీడాసక్తిని పెంపొందిస్తాయి. ఈ నేపథ్యంలోనే మనం మామూలుగా మాట్లాడుకునే 'స్పోర్టివ్‌నెస్' అనే పద నిర్వచనం గుర్తుకొస్తుంది. ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాన్ని చేరుకోవాలంటే క్రీడాసక్తితో ముందడుగువేయాలి. దానికి శారీరక



మానసిక వ్యాయామమూ అవసరమేనని ఎవరినడిగినా చెప్తుంటారు. కానీ మానసికంగా కష్టపడేవారు శారీరకంగా కష్టపడేలా చేయడానికి చిన్ననాటి నుంచే గ్రామీణ విద్య పట్ల ఆసక్తి కలిగి ఉండాల్సిందే! మరో విధంగా చెప్పాలంటే గ్రామీణ క్రీడావిద్యలను వదిలిపెట్టడంతో పాటు తాజాగా వ్యాయామాన్ని మరిచిపోతే వ్యక్తిగత ఆరోగ్యాలకు పట్టిన చీడను వదిలించడం కష్టమే. అందుకే క్రీడా విద్యను సంప్రదాయ వ్యాయామానికి ఆలవాలంగా కొనసాగించాల్సిన అవసరముంది.

# 'స్వచ్ఛ ఛాంపియన్'గా కరీంనగర్

## కలెక్టర్‌కు అవార్డు అందజేసిన సచిన్ టెండూల్కర్



ఈ సంవత్సరం 'స్వచ్ఛ ఛాంపియన్' అవార్డు కరీంనగర్ జిల్లాకు లభించింది. స్వచ్ఛభారత్ ప్రచారకర్త, భారతరత్న సచిన్ టెండూల్కర్ ఈ అవార్డును జిల్లా కలెక్టర్ నీతూప్రసాద్‌కు ఢిల్లీలో అందజేశారు. వ్యక్తిగత మరుగుదొడ్లకు ప్రాధాన్యమిస్తూ జిల్లాను 2017 మార్చి నాటికి పూర్తిగా బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి తీసుకుంటున్న చర్యలు, సాధించిన ఫలితాలకుగాను తెలంగాణ నుంచి కరీంనగర్ జిల్లా ఎంపికైంది. దేశవ్యాప్తంగా 22 జిల్లాలను స్వచ్ఛ ఛాంపియన్లుగా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ గుర్తించగా, అందులో కరీంనగర్ జిల్లా కూడా ఉంది. ఏ విధంగా కరీంనగర్ జిల్లా ఈ ఫలితాలను సాధించిందో స్వయంగా సచిన్ టెండూల్కర్ కరీంనగర్ జిల్లా కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ మొదలు ఎంపిటిసి, జెడ్పిటిసి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపి స్థాయి వరకు ప్రజాప్రతినిధులు స్వచ్ఛతెలంగాణలో ఏ విధంగా పాల్గొన్నారో, ప్రజల్లో ఏ విధంగా అవగాహన పెంచారో వివరించిన కలెక్టర్ సమిష్టి కృషి ద్వారానే సాధ్యమైందని తెలిపారు. ప్రజా ఉద్యమంగా నిర్వహించడం ద్వారానే ఇప్పటి మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100% బహిరంగ మలవిసర్జన రహితంగా ప్రకటించామని, అక్టోబర్ రెండో తేదీ నాటికి మరో రెండు నియోజకవర్గాలు, వచ్చే సంవత్సరం మార్చి నాటికి అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో 100% దీనిని పూర్తిచేస్తామని ఆమె సచిన్ టెండూల్కర్‌కు వివరించారు. అవార్డు కింద స్వచ్ఛభారత్ లోగోతో ముద్రించిన బ్యాట్‌పై స్వయంగా సంతకం చేసిన క్రికెట్ బ్యాట్‌ను సచిన్ కలెక్టర్‌కు అందజేశారు.

## పల్లెల జీవన విధానంపై

# సంస్కరణల ప్రభావం

ఆధునిక సమాజంలో సమాచార సాంకేతిక విప్లవం భారతీయజీవన విధానాన్ని పెను మార్పులకు గురిచేసింది. ఎందుకంటే స్వయం సమృద్ధమైన పల్లెబతుకులు ఆధారబూతంగా మారుతున్నాయి. అందుకు మన కుటుంబ వ్యవస్థ బలంగా ఉంది. కనుక ఆ మార్పులను తట్టుకొని నిలబడగలుగుతున్నాం. మన గ్రామీణ జీవితపు పునాదులు చాలా బలమైనవి. కనుక పాశ్చాత్య నాగరికత దాడులను నిలిపి ఆ మార్పులను మన సొంతం చేసుకొంటున్నాం. 1990లో ప్రారంభమైన నూతన సంస్కరణలు మన విశ్వాసం మీద దెబ్బకొట్టాయి. ఆ విశ్వాసం చొచ్చుకునిపోయి మన చదువు పనికిరానిది ప్రపంచానికి లింకు ఏర్పరచడం లేదని వాపోతున్న తరుణంలో నూతనతరం పుట్టుకొచ్చింది. అదే ఇంగ్లీషు విద్య. అది వస్తేనే ఈ పోటీలో నిలబడగలవదని గట్టిగా చెబుతుంది. డిగ్రీ పూర్తి చేసిన గమ్యం లేనిదిగా మార్చివేసింది. విశ్వాసాన్ని వమ్ము చేసింది. అమ్మ, నాన్న స్థానంలో మమ్మీ, డాడీ సంస్కృతి ప్రభావితం చేస్తుంది. అందుకు ఎవరిని నిందించకనక్కర్లేదు మార్పు సహజం. ఆ మార్పునకు త్వరగా అందుకొన్నవారు లాభపడుతున్నారు. ఆ మార్పును ఆలస్యంగా ఆహ్వానించినవారు అందుకొనే సమయానికి ఆ మార్పుకు విలువ లేకుండాపోతోంది. గత రెండు దశాబ్దకాలంలో మన పల్లెల్లో ఎన్నో మార్పులు చేటు చేసుకున్నాయి. ముఖ్యంగా మన పల్లెలో కట్టు, బొట్టు, నడక, నేర్పు అన్ని తారుమారైనాయి. మార్కెటు పల్లెముంగిటకు వచ్చి వస్తువులను అమ్ముకొంటున్నారు. అవసరం లేకపోయిన అనవర వస్తువులను కొని తంటాలు తెచ్చుకొంటున్నారు.

సమాచార సాంకేతికరంగం విస్తరణ వలన కేబుల్ టెలివిజన్ ప్రజలకు దాదాపు 84 శాతం మందికి అందుబాటులోకి వచ్చింది. టెలివిజన్ ద్వారా అవసరం లేని సమాచారాన్ని గుప్పించి వేస్తున్నారు.





24 గంటలు కేబుల్ నెట్‌వర్క్బ తమ ఛానల్‌ను అందరు చూసే విధంగా చేయాలంటే ఆకర్షణీయంగాను శ్రోత్రలకు లాభకరంగా మార్చవలసిందే. పల్లెల్లోని వస్త్రాధారణపై విపరీతమైన ప్రభావం చూపించింది. అదే స్థానంలో ప్యాంటు చొక్కాలు వచ్చాయి. చివరకు పొలం పనులు కూలీ కూడా ప్యాంటు, షర్టు ధరిస్తున్నారు. నాగలి దున్నే వారికి

సౌకర్యం కోసం పంచెకు బదులు ప్యాంటు వేసుకొని పనిచేస్తున్నారు. బ్రహ్మంగారు చెప్పినట్లు నీళ్ళు అమ్మబడుతున్నాయి. లీటరు నీళ్ల నేడు రూ. 10 అమ్ముతున్నారు. ఇది నేటి గ్రామీణుల జీవితం. పాలు గ్రామంలో 7.30 సమయం దాటితే దొరకవు. పట్టణంలో 24 గంటలు పాలు అందుబాటులో ఉన్నాయి. అంటే మార్కెటీకరణ మహత్యం అని చెప్పవచ్చు. ఉచితంగా దొరికే నీటిని లీటరు 10 రూపాయలకు మన నీరే మనకు అమ్ముతున్నారు. గతంలో ఇంటింటికి తిరిగే వారికి మర్యాద పూర్వకంగా మజ్జిగ ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడు టీ తాగండి అంటారు. ఆ టీ కూడా తాగే సమయంలో వెళ్లితేనే. అలా స్వేచ్ఛా జీవన విధానం పల్లె జీవనంగా మారింది. పని లేని సమయంలో వినోదం ఉండాలి కాని పని వదిలి వేసి వినోదంగా సీరియల్స్ చూడడం ఎక్కువైంది. నేడు సమాచారం మనిషికి కావలసిన దానికంటే ఎక్కువ ఇస్తున్నారు. అందుకు కారణం 24 గంటల టెలివిజన్ ప్రసారాలే కారణమని చెప్పకతప్పదు.

ఇంగ్లీషే గొప్పది తెలుగు వలన లాభం లేదు అనే భావన పల్లెల్లో ప్రచారంలో ఉంది. పల్లె వాసులు నేడు తక్కువ ధరకు దొరికే మిల్లు బట్టలను మన సంప్రదాయ దుస్తుల స్థానంలో వాడుతున్నారు. ఎందుకంటే మన దేశీయ బట్టల కంటే లేదా నూలు బట్టల కంటే సింథటిక్ వస్త్రాలు, జీన్స్ చౌకగా దొరుకుతున్నాయి. దానితో నాగలి దున్నే వారు పొలం పనులలో భాగస్వామ్యం పంచుకొనే వారు ఇంగ్లీషు దుస్తులు ధరిస్తున్నారు. అంటే విదేశీ సరుకులు, వస్తువులు, వస్త్రాలు తక్కువ ధరకు లభ్యమగుట వలన మార్కెట్లు తమ ఇంటిముందుకు వచ్చి అమ్మడం ద్వారా పల్లె ప్రజలు వాడుతున్నారు. అదే రీతిలో పొలంలో పంటలు వేయడం కూడా వరిధాన్యంకు బదులు వ్యాపార పంటలు వేయడం జరుగుతుంది. పంటలను పండించుటలో బహుళ జాతి కంపెనీలు అప్పులను రైతులకు పెట్టుబడులుగా ఇచ్చి జొన్న, మొక్కజొన్న పంటలు పండించుకోవడం, పామ్ ఆయిల్ తోటలు పెంచేందుకు డబ్బులు ఇవ్వడం ద్వారా ఆహారపు పంటల విస్తీర్ణం తగ్గిందని వ్యవసాయ నిపుణులు వెల్లడిస్తున్నారు. అంటే విదేశీ ధనం మన పల్లెవాసుల బతుకులను కూడా నియంత్రించే స్థితికి వచ్చాయనుటలో సందేహం లేదు.

మన వ్యవసాయం అంతా పశువుల నాగళ్ళతో జరిగి ఎక్కువమంది కూలీలు అవసరత ఉండేది. కాని ఇప్పుడు భూమి దున్నే యంత్రం, నాట్లు వేసే యంత్రం, కోతలు కోసే యంత్రాలు వచ్చాయి. కేవలం మనుషులు వాటి చేత పనిచేయించుటకు పరిమితమైపోయారు. కార్మికులకు పని కల్పించే స్థానంలో యంత్రాలు వచ్చాయి. కనుక కూలీలు గ్రామాలను వదిలి వెళ్తున్నారు. ఈ వలసలను ఆపేందుకు ప్రభుత్వం ఉన్న చోటే కూలి కల్పించేందుకు మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశపెట్టి అందు కమ్యూనిటీ అస్సెట్స్‌ను సృష్టించేందుకు ప్రయత్నం చేస్తుంది. ఇతర వాటర్‌షెడ్ కార్యక్రమాలు, పండ్లమొక్కలు పెంపకం తదితర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిశ్రమల యజమానులకు లక్షల కోట్లు రాయితీలు ఇచ్చి పరిశ్రమల సెజ్‌లను స్థాపిస్తున్నారు. కాని రైతులకు ఉచిత విద్యుత్, ధాన్యపు గింజలు విత్తనాలు సరఫరా చేయడంలో ఉదాసీన వైఖర్ని అవలంబిస్తున్నారు. కాని పల్లెలో ఆస్పత్రులకు మందులుండవు. డాక్టర్లుండరు. ప్రైవేటు వైద్యానికి పల్లెవాసులు వెళ్లే విధంగా చేస్తున్నారు. ఎవరో వచ్చి ఏదో చేయాలనే ధోరణిలో పనిచేసేందుకు పల్లె వాసులుండలేరు కదా! అందుకే ఉన్న భూమిని అమ్ముకొని కార్పొరేట్ ఆస్పత్రులను చూసుకొంటున్నారు. ఆ పొలం లేని జనం రోగం వస్తే ఎక్కడికి పోవాలి. ప్రభుత్వం ఆలోచించి పల్లెవాసులకు కావలసిన వైద్య సౌకర్యాలను కల్పించాలి. ప్రైవేటీకరణ వలన ఎన్నో సమస్యలు 60 శాతం మంది గ్రామీణ వాసులు ఎదుర్కొంటున్నారు. ఎన్నో అనుకొని ఆపదలను ఎదుర్కొనే రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సమాచారం చూపించే ప్రకటనల వలన అదే నిజమైన జీవితం అనుకొని అపోహతో జీవనం సాగిస్తున్నారు. కనుక ఈ విషయాలన్నింటిని కూలంకషంగా పరిశీలించి సంస్కరణలను అమలు చేయడం వలన వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు పనిచేయవలసి ఉంది. ఈ నేపథ్యంలో పల్లెజీవులు గ్రామ నిర్మాణ మార్గాన్ని అన్వేషించి పురోభివృద్ధి మార్గం వైపు నడవాలి.

**– డాక్టర్ కె. ఆసయ్య**





# గ్రామజ్యోతి స్ఫూర్తితో మెంటెపల్లి ఆదర్శ గ్రామంగా ఎంపిక

అవసరాలను గుర్తించి పరిష్కార మార్గాలను కనుగొననంతవరకు ఒక గ్రామంపై కోట్లాదిరూపాయలు ఖర్చు పెట్టినా ఆ గ్రామం అభివృద్ధి చెందదు అని అన్నారు గొప్ప వ్యక్తిత్వ నాయకుడు స్వామి వివేకానంద దేశాభివృద్ధికి అట్టడుగున ఉన్న గ్రామ వికాసం ప్రధాన కీలకం అని అన్నారు గ్రామ స్వరాజ్ స్ఫూర్తి దాత మహాత్మాగాంధీ.

నీ కోసం బతికితే నీవు నీవు గానే మిగిలిపోతావ్ జనం కోసం బ్రతికిచూడు వారి గుండెల్లో ఉండిపోతావ్ అని అన్నారు భారత రాజ్యాంగ నిర్మాత డా॥ బాబాసాహెబ్ అంబేద్కర్.

ఈ ముగ్గురు మానవతావాదుల ఆశయాలను పనికిపుచ్చుకుని, కృషి, పట్టుదల, అంకితభావంతో మంచి చొరవతో నిరంతరం శ్రమిస్తూ నీతి, నిజాయితీతో, జవాబుదారితనంతో, పారదర్శక పరిపాలనందించాలనే దృఢ సంకల్పంతో మెంటెపల్లి గ్రామ అభివృద్ధే ధ్యేయంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సమర్థ సర్పంచ్‌గా సకల రంగాలలో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నారు గ్రామ సర్పంచ్ మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారు.

సర్పంచ్ కాలపరిమితి తర్వాత వెనక్కి చూసుకుంటే ప్రేమానురాగాల మిగలాలని, ప్రజల మదిలో చెరిగిపోని ముద్రగా ఉండాలని, అది వందేళ్లయినా పదిలంగా ఉండాలని అందుకు గ్రామం అభివృద్ధి కొరకు ప్రజల భాగస్వామ్యంతో మంచి పనులు చేస్తూ ప్రజల కష్టాలను, తన కష్టంగా భావిస్తూ ప్రతి సమస్యను పరిష్కరిస్తూ మెంటెపల్లి గ్రామాన్ని రాష్ట్రంలోనే ఒక ఆదర్శగ్రామంగా/ అభివృద్ధి గ్రామంగా నిలపాలన్నదే తన ప్రధాన ఆశయం అని అంటున్నారు. ఆ గ్రామ ప్రథమ పౌరులు, గ్రామ సర్పంచ్ శ్రీ మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారు మహబూబ్‌నగర్ జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులుగా మరియు రాష్ట పంచాయితీ సర్పంచుల సంఘానికి కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

**అభివృద్ధి పల్లె - మెంటెపల్లె**

తెలంగాణ రాష్ట్రంలో విరివిగా వనరులు, అభివృద్ధికి అవకాశాలు ఉన్న మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి రెవెన్యూ డివిజన్ వనపర్తి మండలంలోని ఒక మారుమూల పల్లె మెంటెపల్లి, ఈ గ్రామం జిల్లా కేంద్రానికి 80 కి.మీ., వనపర్తి మండల కేంద్రానికి 18 కి.మీ. దూరంలో ఉంది. గతంలో నాటవెల్లి అను గ్రామ పంచాయతీ పరిధిలో ఇది ఆవాస గ్రామంగా ఉండేది. 1981 సం॥లో ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పడింది.

**మెంటెపల్లి అను పేరు రావడానికి కారణం**

పూర్వం ఈ గ్రామంలో నివసిస్తున్న రామన్న అను వ్యక్తికి మెల్ల కన్ను ఉన్నదట. అతడు పలు విలువిద్యల్లో ఆరితేరిన వ్యక్తిగా గుర్తింపు ఉండేది. ఒకనాడు ఒక విలువిద్యలో పాల్గొని నిర్దేశించిన లక్ష్యాన్ని సూటిగా/ నేరుగా గురితో కొట్టి విజయం సాధించాడు. అందువల్ల అక్కడివారు ఆ రోజు అతనిని అభినందిస్తూ శభాస్ మెంటోడా అని చెప్పడంతో నాటి నుండి ఆ పల్లెకు మెంటెపల్లి అని పేరు వచ్చింది.

మెంటెపల్లి గ్రామ పంచాయితీకి ప్రస్తుతం రాఘవేంద్రనగర్ కాలనీ అను ఒక ఆవాసం కలదు. ప్రస్తుతం మెంటెపల్లి గ్రామం 8 పంచాయతీ వార్డులతో విస్తరించి ఉన్నది. ఈ గ్రామంలో ప్రధానంగా ప్రజలు మెంటె (బి.సి.) మంద (ఎస్సీ) మరియు మైనారిటీ రాచాల (ఓ.సి.) సమూహాలు ఉన్నారు.

ఇక్కడ మొత్తం 264 కుటుంబాలు ఉండగా ఇందులో ఎస్సీలు 428 మంది, బి.సి.లు 341, ఓ.సి.లు 152 మంది మరియు 479 ఉండగా మొత్తం 965 మంది జనాభాతో 758 మంది ఓటర్లు ఉన్నారు.

1980 సం॥లో ప్రత్యేక పంచాయితీగా ఏర్పడిన ఈ గ్రామానికి మొదటి సర్పంచ్‌గా షెడ్యూలు కులానికి చెందిన వ్యక్తి యం.వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండవ సర్పంచ్‌గా బి.సి. కులానికి చెందిన యం. హన్మంతును ఎన్నికల ద్వారా ఎన్నుకున్నారు. 8వ సర్పంచ్‌గా షెడ్యూలు కులానికి చెందిన యం.దేవన్నను, 4వ సర్పంచ్‌గా జనరల్ మహిళా కోటాలో శ్రీమతి రాచాల విజయలక్ష్మి పురుషోత్తం రెడ్డి గారిని, 5వ సర్పంచ్‌గా బి.సి. కులానికి చెందిన పి. భారయ్యను ఎన్నుకున్నారు.

2018 సం॥ ఆగష్టులో జరిగిన 4వ సాధారణ ఎన్నికల్లో ఉన్నత విద్యావంతుడు, సామాజిక స్పృహ కలిగిన, మానవత్వం పరిమళించే మంచి మనిషి, నిగర్వి, నిరాడంబరులు, నిస్వార్థ సేవాపరులు, అభివృద్ధి ఆశాకిరణం శ్రీ మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారిని సర్పంచ్‌గా ఎన్నుకున్నారు.

మెంటెపల్లి ప్రత్యేక పంచాయితీగా ఏర్పడిన నాటి నుండి 2001 సం॥ వరకు ఆ ఊరి గురించి ఎవరికి తెలియదు. గ్రామానికి సరియైన రహదారులు ఉండేవి కావు. గ్రామస్థులు తీవ్రమైన నీటి ఎద్దడిని ఎదుర్కునేవారు.

కొరతల కొలిమిలో మగ్గిపోతూ నిస్సహాయంగా నిట్టూరుస్తున్న సమస్యల వలయంలో చిక్కుకొని ఉన్న మెంటెపల్లికి

**శ్రీమతి రాచాల విజయలక్ష్మి పురుషోత్తం రెడ్డి సర్పంచ్‌గా గెలుపు మెంటెపల్లి అభివృద్ధికి మలుపు**

2001 సం॥లో గ్రామ పంచాయితీకి జరిగిన 3వ సాధారణ ఎన్నికల్లో జనరల్ మహిళా కోటాలో ఉన్నత విద్యావంతురాలైన శ్రీమతి రాచాల విజయలక్ష్మి పురుషోత్తం రెడ్డి (బి.ఎస్సీ, బి.ఇడి.) గారిని గ్రామ ప్రజలు సర్పంచ్‌గా ఎన్నుకున్నారు. సర్పంచ్‌గా పదవీ బాధ్యతలు తీసుకున్న విజయలక్ష్మి తనదైన శైలిలో గతంలో ఏ సర్పంచ్ కూడా అభివృద్ధి పనులు చేయని రీతిలో ఒక ప్రణాళిక బద్ధంగా లక్ష్యాలను నిర్దేశించుకుని, ఆ లక్ష్యాలను తూచా తప్పక అమలుచేసి, మెంటెపల్లి గ్రామానికి మెరుగైన సేవలు అందించారు. విజయలక్ష్మి సర్పంచ్‌గా ఉన్న కాలంలో గ్రామానికి మెరుగైన సేవలను అందించి సాధించిన ప్రగతి పనులు.

1. మెంటెపల్లి గ్రామం నుండి కదుకుంట్ల గ్రామానికి బి.టి. రోడ్డు నిర్మాణం
2. మెంటెపల్లి నుండి నాచనహల్లి గ్రామం వరకు రహదారి నిర్మాణం
3. మెంటెపల్లి నుండి విలియంకొండ వరకు అసంపూర్తిగా ఉన్న మెటల్ రోడ్డును పూర్తి చేయడం
4. రాఘవేంద్రనగర్ కాలనీలో 20 వేల లీటర్ల సామర్థ్యం గల వాటర్ ట్యాంక్ నిర్మాణం
5. అంతర్గత సి.సి. రోడ్లు మరియు మురుగునీటి కాలువలను ఏర్పాటు చేయడం
6. గ్రామంలో త్రాగునీటి సరఫరా మొదలగు మౌళిక వసతులు కల్పిస్తూ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరిగింది.
7. గ్రామం నుండి జాతీయ రహదారికి, మండల కేంద్రానికి రహదారి వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగింది.

**అభివృద్ధి ఆశాకిరణం – పురుషోత్తం రెడ్డి**

మెంటెపల్లి గ్రామం ప్రత్యేక పంచాయతిగా ఏర్పడిన నాటి నుండి 5 గురు వ్యక్తులు 2011 వరకు సర్పంచ్‌లుగా పదవీ బాధ్యతలు నిర్వహించినా, 23-8-2011 నుండి 1-8-2013 వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగినా గ్రామంలో ఇంకా ముఖ్యమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదని గుర్తించి సర్పంచ్‌గా తన హయాంలో ప్రజలకు సుపరిపాలన అందించాలని ప్రజల భాగస్వామ్యంతో, గ్రామంలోని సమస్యలను గుర్తించి వాటిని ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నారు. మెంటెపల్లిలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, గ్రామ రూపురేఖలు సంపూర్ణంగా మార్చివేసి ప్రగతి ఫలాలను, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చెంతకు చేర్చుతూ, మెంటెపల్లి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచి సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపి అభివృద్ధి మార్గంలో ఆదర్శ మెంటెపల్లిగా తీర్చిదిద్దడానికి మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారు కంకణబద్ధులైనారు.

నిరంతరం/ ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలతో మమేకమై అభివృద్ధి పనులు అమలు చేస్తూ మరియు వివిధ శాఖల అధికారులతో కూడా మంచి సత్సంబంధాలు నెలకొల్పుకొని ఎవరిని నొప్పించక, ఇబ్బంది కలిగించకుండ మారుమూల గ్రామమైన మెంటెపల్లి గ్రామానికి మంచి కీర్తి ప్రతిష్టలు తెస్తున్నారు.

**మెంటెపల్లి సర్పంచ్‌గా పురుషోత్తం రెడ్డి సాధించిన ప్రగతి 100% ఇంటి పన్నువసూలు 100% నీటి పన్నువసూలు 100% విద్యుత్ బిల్లుల చెల్లింపు**

1. సంపూర్ణ మధ్యపాన నిషేద గ్రామం
2. ఎలాంటి గొడవలు, తగాదాలు లేని గ్రామం
3. గ్రామంలోని వీధులన్నీ రూ॥ 16 లక్షల విలువైన సిమెంట్ రోడ్ల నిర్మాణం
4. అన్ని వీధుల్లో ప్రతి స్థంబానికి సి.ఎఫ్.ఎల్. లైట్ల ఏర్పాటు
5. ప్రతి ఇంటికి మంచినీటి సౌకర్యార్థం నీటి కుళాయిల ఏర్పాటు
6. ప్రతి గృహానికి వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మాణం
7. ఇంటింటికి చెత్త బుట్టలు పంపిణి, వీధి వీధికి చెత్తకుండీల ఏర్పాటు తద్వారా ఊరి చెత్తను పోగు చేసి ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యారుకు తరలించడంతో పారిశుధ్య గ్రామంగా తీర్చిదిద్దారు.
8. మురుగు కాలువలు శుభ్ర పరచడం, బ్లీచింగ్ పౌడర్ చల్లడం
9. ప్రజల భాగస్వామ్యంతో గ్రామంలో ఉన్న ముళ్ల పొదలను తొలగింపు మరియు విచ్చల విడిగా విపరీతంగా వీధుల్లో పెరిగి ఉన్న పిచ్చి మొక్కలను యంత్రాల సహాయంతో తొలగించడం జరిగింది.
10. గ్రామంలోని 2 ఓ.హెచ్.ఆర్, ట్యాంకుల ద్వారా త్రాగునీరు ప్రతి ఇంటికి నల్లాల ద్వారా అందిస్తున్నారు.
11. రూ॥10 లక్షల విలువతో పాఠశాలకు ప్రహరీ గోడను నిర్మించడం జరిగింది.
12. ప్రతి వారం నీటి క్లోరినేషన్ చేయడం జరుగుతోంది.
13. **హరితహారం కార్యక్రమంలో భాగంగా :**
    ఎ. ఇంటింటికి మొక్కలు పెంపకం కొరకు 8 వేల మొక్కలు సరఫరా చేసి వాటిని నాటించడం జరిగింది.
    బి. పాఠశాల ఆవరణలో 500 మొక్కలు నాటి వాటిని ప్రత్యేక వాచ్మెన్తో సంరక్షణ చేస్తున్నారు.
    సి. బండింగ్ ప్లాంటు ద్వారా 18 వేల మొక్కలు నాటించడం జరిగింది.
    డి. ఉద్యానవన శాఖ ద్వారా 70 ఎకరాలలో ఆధునిక పద్ధతులలో పండ్లతోటల పెంపకం చేపట్టడం జరిగింది.
14. తేది : 10-9-2017 నాడు పల్లెవికాసం కార్యక్రమంలో

భాగంగా గౌ॥ ఎమ్మెల్యే జి. చిన్నారెడ్డి మరియు జడ్.పి.సి.ఇ.ఓ. లక్ష్మీనారాయణ గారి ఆధ్వర్యంలో స్వచ్ఛాభారత్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి గ్రామ ప్రజలు మరియు పాఠశాల విద్యార్థులచేత స్వచ్ఛాభారత్ పై అవగాహన ర్యాలీ నిర్వహించి వీధులను పరిశుభ్రం చేయడం జరిగింది.

**గ్రామజ్యోతి అనంతరం మెంటెపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలు**

పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి ప్రజలే సారథులు కావాలని, గ్రామ అభివృద్ధి ప్రజల భాగస్వామంతోనే సాధ్యమవుతుందని, ప్రభుత్వం ఇచ్చే నిధులు మరియు ప్రజల సంఘటిత శక్తి తోడైతే మార్పు సాధ్యమవుతుందని తద్వారా ప్రగతి సాధించాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన గ్రామజ్యోతి అనే వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగింది.

దేశాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలు కావాలన్న మహానీయుని మాటలే గ్రామజ్యోతి కార్యక్రమానికి పునాది. అభివృద్ధి ప్రక్రియలో ప్రజలను సంపూర్ణ భాగస్వాములను చేయడమే గ్రామజ్యోతి ముఖ్య ఉద్దేశం. పంచాయతీ ఉద్యమం, సహకర ఉద్యమం, భూదాన ఉద్యమం వీటన్నింటికి స్ఫూర్తి చాటేలా ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలుచేయాలన్నదే గ్రామజ్యోతి కార్యక్రమ లక్ష్యం.

పల్లెసీమల్లో కొత్తవెలుగు నింపడం, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కాంతులు ప్రసరింపజేయడం, గ్రామంలోని సామాజిక సమస్యలను అక్కడి వారి సహాయంతో రూపుమాపడం తెలంగాణ ప్రభుత్వం కొత్తగా రూపొందించిన గ్రామ జ్యోతి లక్ష్యాలు. ప్రతి పనిలో స్థానికులనే భాగస్వాములుగా చేస్తూ పల్లెల అభివృద్ధికి బాటలు వేయడం గ్రామ జ్యోతి ప్రధాన ఉద్దేశ్యం.

ఈ లక్ష్యసాధనలో మెంటెపల్లి గ్రామ సర్పంచ్ శ్రీ మెంటెపల్లి పురుషోత్తం రెడ్డి గారు ప్రతి పనిలో స్థానికులనే భాగస్వాములు చేస్తూ అభివృద్ధికి బాటులు వేస్తున్నారు.

**గ్రామజ్యోతి కార్యక్రమంలో 7 కార్యాచరణ కమిటీలు ఏర్పాటు చేశారు.**

1. పారిశుద్ధ్య మరియు త్రాగునీరు
2. ఆరోగ్యం మరియు పోషకాహారం
3. విద్య
4. సాంఘిక భద్రత మరియు పేదరికి నిర్మూలన
5. సహజ వనరులు యాజమాన్యం
6. వ్యవసాయం
7. మౌళిక వసతుల కల్పన

1. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంలో తన వంతుగా ప్రతి లబ్దిదారునికి ముందస్తు మద్దతుగా రూ॥ 3,000/- ఆర్థిక సహాయం అందించారు.
2. గ్రామంలో దట్టంగా ఉన్న ముళ్లపొదలను మరియు ఊరచెరువులో ఉన్న ముళ్లపొదలను తొలగించారు.
3. ఉపాధి హామి పథకం ద్వారా డంపింగ్ యార్డు ఏర్పాటుచేసి జిల్లాలోనే మొదటిసారిగా వాడుకలోకి తీకుసురావడం జరిగింది.
4. గ్రామం చుట్టూ అన్ని రోడ్లను కలుపుటకు అవసరమైన మేరకు సొంత నిధులతో భూమికొనుగోలు చేసి ఒక అద్భుతంగా రింగ్‌రోడ్డు నిర్మాణం చేయడం జరిగింది.
5. రింగ్‌రోడ్డు పొడవునా విద్యుత్ స్థంబాల ఏర్పాటు వాటి ద్వారా విద్యుత్ దీపాల ఏర్పాటు చేయడం జరిగింది.
6. ఊర చెరువును ఆహ్లాదకరంగా మినీ ట్యాంక్ బండ్‌గా మార్చడం దీని పొడవునా విద్యుత్ దీపాల ఏర్పాటు జరుగుతుంది.
7. హరితహారంలో ఇంటింటికి మొక్కల సరఫరా వాటిని నాటి సంరక్షించే చర్యలు చేపట్టడం జరిగింది.
8. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం
9. గ్రామ పంచాయితీకి అవసరమైన స్థలాన్ని గ్రామస్థల నుండి దానపూర్వకంగా (ఉచితంగా) స్వీకరించి గ్రామ పంచాయితీ ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం జరిగినది.
10. మెంటెపల్లిలో నాన్ సి.ఆర్.పి. కింద రూ॥ 8 లక్షల విలువ చేసే నిధులను ప్రభుత్వం నుండి తెప్పించి త్రాగునీటి సరఫరా పునరుద్ధరణ పనులు చేయడం జరిగింది.
11. రాఘవేంద్రనగర్ కాలనీలో రూ॥ 2 లక్షల విలువచేసే త్రాగునీటి పునరుద్ధరణ పనులు చేయడం జరిగింది.

**ఆరోగ్యం**

గ్రామంనకు పి.హెచ్.సి. 4 కి॥మీ॥ల దూరంలో ఉంది. ఈ గ్రామానికి వైద్య ఆరోగ్య శాఖవారి సేవలు బాగానే అందుతున్నాయి. ఈ గ్రామంలో ఎలాంటి మాతృమరణాలు గాని, శిశుమరణాలు గాని జరుగకుండా చర్యలు చేపట్టడం జరిగింది. వ్యాధినిరోధ టీకాలు చిన్న పిల్లలకు సకాలంలో వేస్తున్నారు. గృహ కాన్పులు లేవు. అన్ని ఆసుపత్రి కాన్పులకే గర్భవతులను ఎ.ఎన్.యం. / ఆషా కార్యకర్తలు చైతన్యం చేస్తున్నారు.

**పౌష్టికాహారం :**

గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో పనిచేస్తున్న టీచర్లు శాఖాపరంగా అందిస్తున్న సేవలు సక్రమంగా అందిస్తున్నారు. గర్భవతులకు, బాలింతలకు, కిషోర బాలికలకు కేంద్రాల ద్వారా ఆహారం, గుడ్డు, సకాలంలో అందించే విధంగా గ్రామజ్యోతి పౌష్టికాహార కమిటీ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుంది.

**విద్య:**

గ్రామంలో ప్రాథమిక పాఠశాల విశాలమైన వాతావరణం, పచ్చటి చెట్లతో కలకలలాడుతుంది. సరిపడు తరగతి గదులున్నాయి.

ఇక్కడ 7వ తరగతి వరకు ఉన్నా ఉపాధ్యాయ కొరతవల్ల 6, 7వ తరగతులలో విద్యార్థులు లేరు. 5వ తరగతి వరకే విద్యాభ్యాసం సాగుతుంది. ఇక్కడ ప్రస్తుతం ముగ్గురే ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇద్దరు వాలంటీర్లను సర్పంచ్ పురుషోత్తం రెడ్డి గారు రెమ్యునరైజేషన్ ఏర్పాటుచేసి విద్యాబోధన చేయడం జరుగుతుంది. పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న సెజాతీజేగం అనే మహిళను ప్రత్యేకంగా ఏర్పాటు చేసి మొక్కలు పెంచే బాధ్యతను అప్పగించడం జరిగింది. ప్రతిరోజు మొక్కలకు నీరు పోస్తు వాటిని సంరక్షిస్తుంది.

**సామాజిక సేవా పంథాలో**

- గ్రామ ప్రజలకు సామాజిక సేవలో భాగంగా ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి తూడుకుర్తి వారి ఆధ్వర్యంలో గ్రామంలో మెడికల్ మెగా కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి దృష్టిలోపం గల వారిని గుర్తించి మొత్తం 150 మందికి కంటి అద్దములను పంపిణీ చేయడం జరిగింది.

- తల్లిదండ్రులు లేని 3 అనాధ పిల్లలను తన సొంత ఖర్చులతో సర్పంచ్ పురుషోత్తం రెడ్డి గారు చదివించడం జరుగుతుంది.
- నిరుపేద కుటుంబాల వారు గ్రామంలో ఎవరు చనిపోయిన వారి అంత్యక్రియల నిమిత్తం రూ॥ 3000/-ల వరకు ఆర్థిక సహాయం సర్పంచ్ పురుషోత్తం రెడ్డి గారు అందిస్తుంటారు.
- పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం చేయుట కొరకు ప్లేట్లు మరియు గ్లాసుల పంపిణీ

**పంచాయతీ రికార్డుల నిర్వహణ**

మెంటెపల్లి పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజు గారు, పంచాయతీని స్థానిక ప్రభుత్వం పరిపాలనగా తీర్చిదిద్ది ప్రజలకు, పంచాయతీకి నిరంతరం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ పంచాయతీరాజ్ చట్టం 1994 ప్రకారం జీవో 30 తేది 20-1-1995, జీవో ఎంఎస్ నెం. 227 తేది 13-4-1995, జీవో ఎంఎస్ నెం. 496 తేది 11-6-1996, జీవో ఎంఎస్ నెం. 162 తేది 4-4-1997 ప్రకారం పంచాయతీస్థాయిలో నిర్వహించవలసిన వివిధ రకాల రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ ఇంకా అదనంగా ప్రత్యేకమైన రికార్డులతో పాటు మొత్తం 46 రకాల రికార్డులను నిర్వహించడం ఆశ్చర్యకరం. ఈ గ్రామ పంచాయితీని సందర్శించిన డి.పి.ఓ. వి.వెంకటేశ్వర్లు మరియు డి.ఎల్.పి.ఓ. కృష్ణ గారు రికార్డుల నిర్వహణ చూసి అభినందించారు.

**మెంటెపల్లికి అండగా ఉంటా:**

- రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడుతాం.
- అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యం
- గ్రామీణ ప్రాంతాల్లో మార్పు రావాలి
- పురుషోత్తం కల నెరవేరాలి - మెంటెపల్లి ఆదర్శంగా నిలవాలి.

**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు**
**గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

రాష్ట్రంలోనే అన్ని గ్రామాలకు ఆదర్శంగా మెంటెపల్లి నిలవాలని ఆ దిశగా తీర్చిదిద్దుతామని కావలసిన అభివృద్ధికి తన చేయూతనందిస్తూ అండగా ఉంటానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని వనపర్తి మండలంలో తాను దత్తత తీసుకున్న మెంటెపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి, జడ్.పి. సి.ఇ.ఓ. లక్ష్మినారాయణ, డి.పి.ఓ. వెంకటేశ్వర్లు, ఎస్.ఇ. ప్రసాద్‌రెడ్డి గారు ఆదర్శ గ్రామంగా ఎంపిక చేసిన సందర్భంగా తేది: 20-11-2015 నాడు జిల్లా కలెక్టర్ టి.కె. శ్రీదేవి గారు జిల్లా అధికారులతో మెంటెపల్లి గ్రామాన్ని సందర్శించారు.

గ్రామంలోని వీధులన్ని తిరిగి, స్వచ్ఛభారత్‌లో భాగంగా ఇళ్ల ముందు నిర్మించిన వ్యక్తిగత మరుగుదొడ్లు, హరితహారంలో భాగంగా ఇళ్ల ముందు నాటిన మొక్కలను, ఇంటికి ఏర్పాటు చేసిన నీటి కులాయిలను, సిమెంట్ రోడ్లను, గ్రామం చుట్టూ వేసిన రింగ్ రోడ్డును మరియు వీధి లైట్లను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సర్పంచ్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు శ్రీ పురుషోత్తం రెడ్డి గారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో గౌ॥ శ్రీ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు మాట్లాడుతూ మెంటెపల్లి గ్రామం రాష్ట్రంలోని మిగతా గ్రామాలకు ఆదర్శం కావాలని, కృషి పట్టుదల ఉంటే అసాధ్యాన్ని సుసాధ్యం చేయవచ్చునని అన్నారు. నేను దత్తత తీసుకున్న ఈ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధివైపు నడిపిస్తున్న గ్రామ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి గారిని అభినందిస్తూ ఇక్కడి ప్రజలకు, ఈ మట్టికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నానని అన్నారు. ఈ సందర్భంగా సమిష్టి కృషి, ప్రజల భాగస్వామ్యంతో ప్రజల ఆలోచనలే పెట్టుబడిగా సమగ్రాభివృద్ధి సాధించవచ్చునని ఈ ఆశయసాధనే గౌ॥ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు గారి లక్ష్యమని అదే ఒక్క వినూత్న గ్రామజ్యోతి కార్యక్రమం అని అన్నారు.

ఈ గ్రామంలో మీరు నిర్మించుకున్న వ్యక్తిగత మరుగుదొడ్లను నిరూపయోగంగా వదిలిపెట్టకుండా వాటిని వినియోగించుకుని గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామంలో ప్రజలంతా ఐక్యమత్యంగా పార్టీలకతీతంగా ఉండాలని ఐక్యమత్యమే బలమని, బలంగా మీరుంటే ఇకనుంచి మీ గ్రామానికి ఎంతో మంది సందర్శకులు వచ్చి వెల్లారని అన్నారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా చిరు వ్యాపారాలు చేసుకుని పాత పద్ధతులు వదిలేసి వాణిజ్య పంటలైన కూరగాయలు, పండ్ల, పూల తోటలు సాగుచేస్తే లాభాలు వస్తాయని ప్రతి ఒక్కరు ఆవులు, గేదెలు పెంచుకోవాలని పాలతో పాటు వాటి ఎరువులను పొలాలకు సేంద్రీయ ఎరువుగా వాడుకునే అవకాశముందని అన్నారు. మారుతున్న మార్పులకనుగుణంగా పల్లెల్లోని ప్రజల జీవితాలలో మార్పురావాలని దానికి అనుగుణంగా ఎదగాలని అధునాతన విజ్ఞానాన్ని అందుకుని ఆరోగ్యకరమైన కొత్త సమాజాన్ని ఏర్పరచుకుని అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని అన్నారు.

ఈ ప్రాంత రైతులకు సాగునీరందించి వారి కళ్లల్లో నీళ్లు తూడుస్తానని అన్నారు. వచ్చే ఖరీఫ్ నాటికి సాగు నీరు అందిస్తానని అన్నారు. భీమా కాలువను పూర్తి చేయడం జరిగిందని తన సొంత నిధులతో డైవర్షన్ బండ్ ఏర్పాటుచేసి కాలువలకు నీళ్లను విడుదల చేయించానని కృష్ణ సముద్రం నుండి లిఫ్టు ద్వారా మెంటెపల్లి గ్రామంలోని మిగులు భూముల సాగుకొరకు, మెంటెపల్లి చెరువుకు సాగు నీరందిస్తామని మెంటెపల్లి గ్రామానికి అండగా ఉంటానని మెంటెపల్లి అన్ని గ్రామాలకు ఆదర్శంగా నిలవాలని - అందుకు తన వంతు కృషి చేస్తానని రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడుతానని, రాష్ట్రంలోనే గుర్తింపు వచ్చేలా కృషిచేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గౌ॥ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారు అన్నారు.

**రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేయూత**

- గ్రామంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తిచేస్తే మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయిస్తానని చెప్పిన మాట ప్రకారం గ్రామ ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరు అందించుటకు శుద్ధజల ప్లాంటును మంజూరు చేస్తూ త్వరలో మంజూరు చేస్తూ శంఖుస్థాపన చేస్తానని అన్నారు.
- అధునాతన మురుగునీరు పారుదల వ్యవస్థ అయిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి తన నియోజకవర్గ అభివృద్ధి నిధులతో స్వంత నిధులతో రూ॥ 7,50,000/- మంజూరు చేశారు.

- మెంటెపల్లి గ్రామంలోనే 4.5 ఎకరాలలో ఉన్న ప్రభుత్వ భూమిలో నిరుపేదలందరికి డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి పేదలకు ఆవాస యోగ్యం కల్పిస్తామని అన్నారు.
- మెంటెపల్లి నుంచి జాతీయ రహదారి వరకు బి.టి. రోడ్డు నిర్మాణం కొరకు రూ॥ 1 కోటి 9 లక్షలు మంజూరు చేశామని తెలియజేశారు.
- మెంటెపల్లి నుండి జాతీయ రహదారికి దూరం తగ్గించుటకు విలియం కొండ తాండ వరకు రోడ్డు ఏర్పాటు చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

**గ్రామ జ్యోతి నిరంతర ఆరిపోని జ్యోతి కావాలి**
**ప్రజల భాగస్వామ్యమే చమురు, వత్తి కావాలి**
**ఆదర్శంగా మారాలంటే 5 సూత్రాలు పాటించాలి**
**జిల్లా కలెక్టర్ శ్రీమతి టికె. శ్రీదేవి ఐ.ఎ.ఎస్. గారు**

గౌరవ ముఖ్యమంత్రి గారు చేపట్టిన విప్లవాత్మకమైన గ్రామాభివృద్ధి కార్యక్రమం గ్రామజ్యోతి కార్యక్రమం అని ఇట్టి గ్రామజ్యోతిని నిరంతరం ఆరిపోని జ్యోతిగా వెలిగించే జ్యోతిగా ప్రజలు భాగస్వాములై తమ కృషి ద్వారా రెండు చేతులతో ఈ జ్యోతిని కాపాడుకోవాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి గారు అన్నారు.

గ్రామ జ్యోతి కార్యక్రమంలో భాగంగా ఆదర్శ గ్రామంగా ఎంపికచేసిన మెంటెపల్లి గ్రామాన్ని మొట్టమొదటిసారిగా సందర్శించి ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో కలెక్టర్ గారు ప్రసంగించారు. గ్రామంలో ప్రజలు ప్రతి ఒక్కరు మలమూత్ర విసర్జనకు బహిర్భూమికి వెళ్లకుండా మరుగుదొడ్లు నిర్మించుకుని, వాటిని వాడుకోవాలని ఇది మహిళల ఆత్మ గౌరవాన్ని పెంచుతుందని అన్నారు. బహిరంగ మల విసర్జన మరియు మేనరికం వల్లనే వికలత్వం వచ్చే అవకాశం ఉందని ఒక అధ్యయనంలో తేలిందని అన్నారు.

1. **100% పన్నులు చెల్లించాలి.**
2. **గ్రామంలో నూటికి నూరుశాతం మరుగుదొడ్ల నిర్మించుకుని వాటిని వాడుతూ సంపూర్ణ పారిశుద్ధం సాధించాలి.**
3. **విద్యాభివృద్ధికి కృషి చేస్తూ నిరక్షరాస్యతను నిర్మూలించాలి.**
4. **ఇంటింటికి, రోడు కిరువైపులా మరియు ఖాళీ ప్రదేశాలలో మొక్కలు నాటి హరితగ్రామంగా తీర్చిదిద్దాలి.**
5. **గ్రామంలోని గర్భవతులు ఆసుపత్రులలోనే కాన్పులు జరిగేటట్లు చూడాలి. మాతృశిశు మరణాలు లేకుండా ఉండాలి.**

ఈ ప్రకారం 5 లక్ష్యాలను అధిగమించిన గ్రామాలను ఆదర్శ గ్రామంగా ఎంపిక చేస్తామని తెలియజేశారు. మెంటెపల్లి గ్రామం ఈ లక్ష్యసాధనలో పయనిస్తున్నదని అందుకే ఆదర్శ గ్రామంగా ఎంపిక చేశామని కలెక్టర్ అన్నారు. ఈ గ్రామాభివృద్ధికి కృషి చేసిన గ్రామ సర్పంచ్ పురుషోత్తం రెడ్డిని, వారు సభ్యులను మరియు గ్రామ ప్రజలను కలెక్టర్ అభినందించారు. సర్పంచ్ పురుషోత్తం రెడ్డి గారి కోరిక మేరకు గౌ॥ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావును మెంటెపల్లికి రావాలని కోరుతామని అన్నారు.

గ్రామ జ్యోతి స్ఫూర్తితో జిల్లాలో మొత్తం 212 గ్రామాలు దత్తత గ్రామాలుగా ఉన్నాయని ఈ గ్రామాలే కాక జిల్లాలోని అన్ని 1880 గ్రామ పంచాయితీలను సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా మార్చి జిల్లానే ఒక ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని ఇందుకు ప్రజా ప్రతినిధులు, ప్రజలు, అధికారులు చొరవ చూపాలని గ్రామజ్యోతికి ప్రజలే చమురు, వత్తి కావాలని ఈ జ్యోతి ఆరిపోకుండా ప్రజలు కంటికి రెప్పలా దాచుకోవాలని అందుకు నిఘానేత్రాలు ఇచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి గారు కోరారు.

**సర్పంచ్ గారి అభ్యర్థన మేరకు గ్రామాభివృద్ధికి జిల్లాకలెక్టర్ గారి తోడ్పాటు**

1. గ్రామంలో భూగర్భ మురికినీటి పారుదల వ్యవస్థ నిర్మాణానికి రూ॥ 7 లక్షల 50 వేలు మంజూరు చేస్తానని చెప్పారు.
2. గ్రామంలో ఉన్న 4 ఎకరాల స్థలాన్ని పరిశీలించి ప్లాటింగ్ చేయడానికి గృహనిర్మాణ శాఖ అధికారులను పంపిస్తూ డబుల్ బెడ్‌రూం ఇళ్లకు ప్రణాళికలు తయారుచేయిస్తామని చెప్పారు.
3. ప్రాజెక్టు డైరెక్టర్ డి.ఆర్.డి.ఎ. మరియు జనరల్ మేనేజర్ పరిశ్రమల శాఖ ఇద్దరు అధికారులను గ్రామానికి పంపించి గ్రామంలో స్వయం ఉపాధి పథకాల అమలుకు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ఉన్నటువంటి అవకాశాలపై అధ్యయనం చేయిస్తానని చెప్పారు.
4. మహిళా సంఘాలకు సమావేశాలు నిర్వహించుటకు సమావేశ మందిరాన్ని ఏర్పాటు చేస్తానని చెప్పారు.

మెంటెపల్లి గ్రామ సర్పంచ్ పురుషోత్తం రెడ్డి మాట్లాడుతు మా గ్రామాన్ని దత్తత తీసుకున్నటువంటి గౌ॥ పెద్దలు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి గారికి కృతజ్ఞతగా ఉంటూ మా గ్రామం ఋణపడి ఉంటుందని వారిచ్చిన స్ఫూర్తితోనే నేను ఈ గ్రామాన్ని పట్టుదలతో అభివృద్ధిలోకి తీసుకువచ్చానని జడ్పీసి.ఇ.ఓ. గౌ॥ శ్రీ వి. లక్ష్మినారాయణ మరియు డి.పి.ఓ. వెంకటేశ్వర్లు గారు తరచు నన్ను ప్రోత్సహిస్తూ జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులుగా మీ గ్రామాన్ని మీరు ఆదర్శంగా అభివృద్ధి పరచాలని మీరు జిల్లా సర్పంచులందరికి స్ఫూర్తిగా ఉంటేనే మిమ్ములను స్ఫూర్తిగా తీసుకుని ఇతర గ్రామాలు కూడా అభివృద్ధి పథంలో పయనించే అవకాశం ఉందని నన్ను ప్రోత్సహించారు. ఈ ప్రోత్సాహాన్ని వారు కల్పించిన ఆలోచనను షరతుగా తీసుకుని పట్టుదలతో ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దడానికి కృషి చేశాను. ఇందుకు సహకరించిన వారు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి, గ్రామస్థాయి సిబ్బంది మరియు గ్రామ ప్రజలకు, మాజీ సర్పంచ్‌లకు అందరికి నా యొక్క కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు మరియు మా గ్రామాన్ని ఆదర్శగ్రామంగా ఎంపిక చేసిన గౌ॥ జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి గారికి మరియు జిల్లా అధికారులకు నా యొక్క కృతజ్ఞతలను తెలియజేశారు.

సమావేశం అనంతరం గ్రామ స్వరాజ్ స్ఫూర్తిదాత అయిన మహాత్మాగాంధీ గారి విగ్రహం ఏర్పాటు నిమిత్తం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు గౌ॥ శ్రీ సింగిరెడ్డి నిరంజన్ రెడ్డిగారు మరియు జిల్లా కలెక్టర్ శ్రీమతి టి.కె. శ్రీదేవి ఐ.ఎ.ఎస్. గారు శంఖుస్థాపన మరియు భూమి పూజను చేశారు.

**– బి.వెంకటయ్య,**
**జిల్లా శిక్షణ మేనేజర్**

# అక్షరమే ఆయుధం



**ప్రపంచంలో విద్య అత్యంత శక్తిమంతమైన ఆయుధం. దానితో ప్రపంచాన్నే మార్చివేయవచ్చు – నెల్సన్ మండేలా**

దేశ ప్రగతి విద్యతో ముడిపడి ఉంది. విద్యారంగంలో వెనుకబడిన దేశం తిరోగమిస్తుందని నిపుణుల మాట. అక్షరాస్యత దేశాభివృద్ధికి అవినాభావ సంబంధమున్నది. కుటుంబం, సమాజం, దేశం ముందుండాలంటే అక్షరాస్యత ఎంత అవసరమో తెలియచెప్పడానికి ప్రపంచ దేశాల విద్యామంత్రులు ఇరాన్ రాజధాని టెహరాన్‌లో 1965 నవంబర్ 17న యునెస్కో ఆధ్వర్యంలో సమావేశమై నిరక్షరాస్యత గురించి చర్చించి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని తీర్మానించారు.

- ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 8న ప్రపంచ అక్షరాస్యత దినోత్సవంగా జరుపుకోవాలని నిర?యించారు. 1966 నుంచి జరుపుకుంటున్నాం. ప్రస్తుత సగటు అక్షరాస్యత 84 శాతం ఉంటే దేశంలో అక్షరాస్యత 74.04 శాతం మాత్రమే ఉంది.
- ప్రపంచవ్యాప్తంగా 796 మిలియన్ల మందికి చదవడం గాని, రాయడం గాని రాదని యునెస్కో నివేదిక వెల్లడించింది. ఇందులో బాలికల్లో నిరక్షరాస్యులు ఎక్కువగా ఉన్నారు.
- 67 మిలియన్ల పిల్లలు ప్రాథమిక విద్యను, 72 మిలియన్ల పిల్లలు సెకండరీ విద్యను అభ్యసించడంలేదు.
- అక్షరాస్యత మానవుని జీవన స్థితిగతులను మారుస్తుంది. వారి సంస్కృతులను బలోపేతం చేసుకొనేందుకు, పేదరికాన్ని ఎదుర్కోవడంలో, మహిళలు సాధికారత సాధించడంలో, ప్రమాదకరమైన పనుల నుంచి పిల్లల విముక్తి , బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి, వెట్టిచాకిరి నుం చి, లైంగికదోపిడీ నుంచి కాపాడటంలోను, మానవహక్కులను, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలోను, పర్యావరణాన్ని పరిరక్షించడంలో, జనాభా పెరుగుదలను అరికట్టడంలో మూఢనమ్మకాలను తొలగించడంలో, పనికి తగిన వేతనం పొందడంలో, అంటరానితనాన్ని నిర్మూలించడంలో, నైతిక విలువలను పెంపొందించడంలో అక్షరాస్యత కీలకపాత్ర పోషిస్తుంది.
- మానవులకు గల సహజ హక్కుల్లో గాలి, నీరు, ఆహారం, నివాసం తర్వాత చదువుకునే హక్కు చాలా ప్రధానమైందని యునెస్కో గుర్తించింది.
- అక్షరాస్యతకు అభివ ృద్ధికి అవినాభావ సంబంధమున్నది. సంపూర్ణ అక్షరాస్యత సాధించిన దేశాలైన అమెరికా, కెనడా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ లాంటి దేశాలు వ్యవసాయకంగా, పారిశ్రామికంగా, సాంకేతికంగా, వైజ్ఞానికంగా పురోగమిస్తున్నాయి. అక్కడ జీవన ప్రమాణాలు అత్యున్నతంగా ఉన్నాయి.
- యునెస్కో అంచనాల ప్రకారం ప్రపంచంలో మొత్తంమీద నిరక్షరాస్యులు 79.6 కోట్ల మంది ఉన్నారు.
- ప్రపంచ వయోజన జనాభాలో 18 శాతం మంది నిరక్షరాస్యులే.
- యునెస్కో 1990ని అంతర్జాతీయ అక్షరాస్యత సంవత్సరంగా ప్రకటించడంతో పాటు ఐక్యరాజ్యసమితి 2003–12 అక్షరాస్యత దశాబ్దంగా ప్రకటించింది.
- లిటరసీ ఫర్ ఆల్, వాయిస్ ఫర్ ఆల్, లెర్నింగ్ ఫర్ ఆల్ అనే అంశాల్ని ఈ దశాబ్ది లక్ష్యంగా నిర్దేశించింది.
- ప్రపంచ నిరక్షరాస్యుల్లో 64 శాతం మంది మహిళలే.
- నిరక్షరాస్యుల్లో 26 శాతం మంది మనదేశంలో ఉన్నారు.
- రాష్ట్రంలో నిరక్షరాస్యులు 34 శాతం ఉన్నారు.
- దేశంలో స్వాతంత్ర్యం కంటే ముందే అక్షరాస్యత కోసం అహర్నిశలు క ృషి చేశారు. 1872లోనే జ్యోతిరావ్‌పూలే ప్రజలందరికీ విద్య కావాలని, ప్రభుత్వం ఆధ్వర్యంలోనే పాఠశాలలు ఎక్కువ స్థాపించాలని, ప్రభుత్వ యాజమాన్యంలోనే పాఠశాలలు ఉండాలని కోరారు.
- అన్ని రాష్ట్రాల్లో బేసిక్ విద్యను అమలుచేయాలని 1937లో గాంధీజీ కాంగ్రెస్ విద్యామంత్రులను కోరారు. ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా ఉంచడానికి నాడు అంబేద్కర్ విఫలయత్నం చేశారు.
- 1950లో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తర్వాత పదేండ్లలోపే అంటే 1960 నాటికి 6 నుంచి 14 ఏండ్ల బాలబాలికలందరికీ నిర్బంధ ఉచిత విద్యను అందించాలని రాజ్యాంగంలోని 45వ అధికరణం ఆదేశించినప్పటికీ నేటికీ అది అమలుకు నోచుకోలేదు.
- 1944లోనే నాలుగు దశాబ్దాలు అంటే 1984 నాటికే భారత్ సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని తీర్మానం చేసింది కానీ సంపూర్ణ అక్షరాస్యత సాధించలేదు.
- 2011 జనాభా లెక్కల ప్రకారం దేశంలో 27.3 కోట్ల మంది నిరక్షరాస్యులు ఉన్నారు.
- దేశానికి స్వాతంత్ర్యం వచ్చేనాటికి అక్షరాస్యత 18.33 శాతం మాత్రమే. కానీ అక్షరాస్యత కోసం ప్రవేశపెట్టిన వివిధ పథకాల వలన అక్షరాస్యతను 74.04 శాతం పెంచగలిగాం. కానీ ఇతర దేశాలతో పోల్చి చూస్తే అక్షరాస్యతలో ఎంతో వెనుకబడి ఉన్నాం.
- సిరియా (79.6 శాతం), ఇరాక్ (80.2 శాతం), సౌదీఅరేబియా (86.6 శాతం), ఇరాన్ (86.8 శాతం), లెబనాన్ (93.9శాతం), లిబియా (94.2 శాతం), వైశాల్యంలో మనకన్నా చిన్న దేశాలైన కామెరూన్ (75 శాతం), ఘనా (76.6 శాతం), కాంబోడియా

(77.2 శాతం), జమైకా (88.7 శాతం), మయన్మార్ (93.1 శాతం), మలేషియా (93.1 శాతం), సింగపూర్ (95.9 శాతం), దక్షిణ కొరియా (97.9 శాతం), శ్రీలంక (98.1 శాతం) నిత్యం కరువుతో సతమవుతున్న ఎరిత్రియ (80 శాతం), ఉగాండ (78.4 శాతం) లాంటి దేశాలు అక్షరాస్యతలో మనకన్నా ముందుండటం మన వెనుకబాటుతనాన్ని తెలుపుతుంది.

- 2011 జనాభా లెక్కల ప్రకారం జాతీయ అక్షరాస్యత (2001 జనాభా లెక్కలు- 65 శాతం) 74.04 శాతం పెరిగినప్పటికీ నిరక్షరాస్యులు 35 (2001) నుంచి 25 శాతానికి తగ్గినప్పటికీ అక్షరాస్యతలో అనుకొన్నంత పురోగతి సాధించలేకపోయాం.
- 2001 జనాభా లెక్కలతో పోల్చితే 9.2 శాతం మాత్రమే అక్షరాస్యత పెరిగింది.
- 2011 జనాభా లెక్కల ప్రత్యేకత ఏమిటంటే పురుషుల అక్షరాస్యత 6.88 శాతానికి పెరిగితే మహిళల అక్షరాస్యత 11.79 శాతం పెరిగింది.
- 2001 జనాభా లెక్కల ప్రకారం పురుషులు, మహిళల అక్షరాస్యతలో అంతరం 21.59 శాతం ఉంటే 2011లో 16.68 శాతానికి తగ్గడం శుభపరిణామం.
- జాతీయ అక్షరాస్యత 74.04 కంటే 24 రాష్ట్రాలు ఎగువన ఉండటం గమనించదగ్గ విషయం.
- జాతీయ అక్షరాస్యత కంటే దిగువన ఉన్న 12 రాష్ట్రాల్లో తెలంగాణ (66.50), ఆంధ్రప్రదేశ్ (67.41)లు ఉన్నాయి.
- పాఠశాల విద్యకు దూరమైపోతున్న విద్యార్థుల్లో ఎక్కువమంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులే ఉన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా వీరు విద్యకు దూరంగానే ఉన్నారు.
- కొందరు పిల్లలు బడి బయట ఉంటున్నారు, మరికొందరు చదువును కొనసాగించలేక మధ్యలోనే చదువులకు స్వస్తి చెబుతున్నారు.
- ఒకటి నుంచి ఐదో తరగతి మధ్య విద్యకు ఎస్సీ బాలురు, బాలికలు 21.68 శాతం వంతున, ఎస్టీ బాలురు, బాలికలు 37.31 శాతం వంతున, మొత్తంగా 40.90 శాతం దూరం కావడం గమనార్హం.
- ఒకటి నుంచి పదో తరగతి వరకు తెలంగాణలో ఎస్సీ బాలు రు 42.05 శాతం, బాలికలు 38.52 శాతం, ఎస్టీ బాలురు 60.40 శాతం, బాలికలు 60.34 శాతం పాఠశాల విద్య నుంచి వైదొలుగుతున్నట్లు గణాంకాలు తెలుపుతున్నాయి.

**దేశంలో అక్షరాస్యత 1951-2011**

| సంవత్సరం | అక్షరాస్యత | పురుషులు | స్త్రీలు | వ్యత్యాసం (స్త్రీ-పు) |
|---|---|---|---|---|
| 1951 | 18.33 | 27.16 | 8.86 | 18.30 |
| 1961 | 28.30 | 40.40 | 15.35 | 25.05 |
| 1971 | 34.45 | 45.96 | 21.97 | 23.98 |
| 1981 | 43.57 | 56.38 | 29.76 | 26.62 |
| 1991 | 51.21 | 64.13 | 39.29 | 24.84 |
| 2001 | 64.83 | 75.26 | 53.67 | 21.59 |
| 2011 | 74.04 | 82.14 | 65.46 | 16.68 |

**తెలంగాణలో అక్షరాస్యత**

| జిల్లా | అక్షరాస్యత |
|---|---|
| ఆదిలాబాద్ | 61.01 |
| నిజామాబాద్ | 61.25 |
| కరీంనగర్ | 64.15 |
| మెదక్ | 61.42 |
| హైదరాబాద్ | 83.25 |
| రంగారెడ్డి | 75.87 |
| మహబూబ్‌నగర్ | 55.04 |
| నల్గొండ | 64.20 |
| వరంగల్ | 65.11 |
| ఖమ్మం | 64.81 |

- స్వాతంత్ర్యానంతరం 1950-51లో మొత్తం బడ్జెట్‌లో విద్యపై ప్రభుత్వ వ్యయం రూ. 64 కోట్లు ఉండగా, 2013-14 బడ్జెట్లో విద్యపై ప్రభుత్వ వ్యయం రూ. 65, 867 కోట్లు కేటాయించారు.
- మొదట పంచవర్ష ప్రణాళికల్లో మొత్తం ప్రణాళిక నిధుల్లో 7.60 శాతం కేటాయించగా 11వ పంచవర్ష ప్రణాళికలో మొత్తం ప్రణాళిక నిధుల్లో 19.40 శాతం కేటాయించారు.
- స్వాతంత్ర్యానంతరం అక్షరాస్యత పెంపుదల కోసం ప్రభుత్వం చాలా కమిటీలను నియమించింది. వాటిలో 1948-49లో విశ్వవిద్యాలయ కమిషన్ / రాధాక ృష?న్ కమిషన్, 1952-53లో మొదలియార్ కమిషన్, 1964-66లో భారతీయ విద్యా కమిషన్ లేదా కొఠారీ కమిషన్, 1976లో స్వరణ్‌సింగ్ కమిటీ, 1977లో ఈశ్వరీభాయి కమిటీ, 1977లో మాల్కం ఆదిశేషయ్య కమిటీ, 1990లో ఆచార్య రామ్మూర్తి కమిటీ, 1992లో ఎన్. జనార్దన్‌రెడ్డి కమిటీ, 1993లో యశ్‌పాల్ కమిటీలను నియమించింది.
- 2015 నాటికి ప్రపంచం మొత్తం సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించాలనే ఐక్యరాజ్యసమితి సహస్రాబ్ది లక్ష్యాలకు దేశం అడ్డుగోడగా నిలిచింది. ఈ నేపథ్యంలో దేశంలో సార్వత్రిక ప్రాథమిక విద్యను సాధించాలనే లక్ష్యంతోపాటు, దేశాన్ని ఒక విజ్ఞాన కేంద్రంగా మార్చే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం విద్యాహక్కు చట్టాన్ని రూపొందించింది.
- 6-14 ఏండ్ల బాలబాలికలకు ఉచిత నిర్బంధ విద్యకు హామీ ఇస్తూ అమల్లోకి వచ్చిన ఈ చట్టంతో విద్యాహక్కు కలిగి ఉన్న 135 దేశాల జాబితాలో భారత్ చేరింది.
- 2002లో 86వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుగా మార్చుతూ 21 (ఏ) అధికరణను చేర్చారు.
- ప్రాథమిక విద్యాహక్కు చట్టం జమ్ముకశ్మీర్‌ను మినహాయించి దేశవ్యాప్తంగా 2010 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.
- అక్షరాస్యత పెంపుదల కోసం సర్వశిక్షా అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్ష అభియాన్, మధ్యాహ్న భోజన పథకం, ఉచితంగా రెండు జతల దుస్తులు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, సాక్షర భారత్ వంటి పథకాలను ప్రవేశపెట్టి ఎంతో కొంత అక్షరాస్యతను పెంపొందించడం జరిగింది.

# గ్రామాల ప్రగతే గీటురాయి

దేశంలో 69 శాతం ప్రజలు గ్రామాల్లోనే జీవిస్తున్నారు. గ్రామాలు ప్రగతిపథంలో పయనించినప్పుడే దేశం సమగ్రాభివృద్ధి చెందుతుంది. నేటికీ గ్రామాలకు అభివృద్ధి ఫలాలు చేరలేదు. గ్రామీణ ప్రాంతాల్లో అధిక శాతం ప్రజలు పేదరికంలో మగ్గుతున్నారని ఇటీవల కేంద్రం నిర్వహించిన సామాజిక ఆర్థిక కులగణన సర్వేలో వెల్లడైంది. మరోవైపు అధికారిక గణాంకాలు దేశ సగటు వృద్ధి రేటు బాగా పెరిగినట్లు వెల్లడించాయి. కాబట్టి గ్రామాలు ప్రగతి పథం లో పయనించాల్సిన అవసరం ఉన్నది. దీన్నిబట్టి దేశ ఆర్థికాభివృద్ధిని వివిధ వర్గాల ప్రజల జీవనప్రమాణాలు, ఆదాయాలు, ఆర్థిక పరిస్థితిని నిర్ణయించడానికి వృద్ధిరేటు సరైన కొలమానం కాదని స్పష్టమవుతున్నది.

1934తర్వాత తొలిసారిగా 2011లో కేంద్ర ప్రభుత్వం సామాజిక ఆర్థిక కులగణన సర్వే నిర్వహించింది. క్షేత్రస్థాయి వాస్తవాలను ఈ ఫలితాలు పూర్తిగా ప్రతిబింబించకపోవచ్చు. ప్రణాళికాసంఘం గతంలో ఆదాయ ప్రాతిపదికపై పేదరికాన్ని అంచనా వేసింది. ఈసారి గత పద్ధతికి భిన్నంగా ఏడు ప్రాతిపదికలు ఎంచుకున్నారు. ఆదాయం, గృహవసతి, అక్షరాస్యుడైన వయోజనుడు, అంగవైకల్యం, చేస్తున్నపని లాంటివి వీటిలో ఉన్నాయి.

ఏదోఒక దాని లో కొరత ఉన్న వాళ్లు గామీణ జనాభాలో 19 శాతం వరకు ఉన్నారని సర్వేలో వివరించారు. దేశ గ్రామీణ వ్యవస్థలో సుమారు 30 శాతం మందికి సాగుభూమి లేదు. మరో ప్రధాన సమస్య విద్య లేకపోవడం. గ్రామీణ జనాభాలో 36 శాతం నిరక్షరాస్యులున్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతా ల్లో ఉన్నత విద్యావంతులు 3.45 శాతం మాత్రమే ఉన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గ్రామీణ కేంద్రాలుగా విద్యారంగంలో మనదేశం వెనుకబడటానికి ఈ గణంకాలే నిదర్శనం. నోబెల్ అవా ర్డు గ్రహీత, ఆర్థిక శాస్త్రవేత్త అమర్త్యసేన్ సూత్రీకరణ ప్రకారం.. విద్యలో అసమానతలు ఆదాయ అసమానతలకు, పేదరికానికి దారితీస్తా యి. మన గ్రామాల్లో 94 శాతం మేరకు సొంత ఇండ్లు ఉన్నా వాటిలో 54 శాతానికి ఒకటి రెండు గదుల నివాసాలే ఉన్నాయి. గ్రామీణ భారతంలో 13.5 శాతం కుటుంబాలు మట్టి గోడలు గల పైకప్పు లేని ఒంటిగది కచ్చా ఇళ్ళల్లో నివసిస్తున్నారు. అధికారిక గణాంకాల ప్రకారం 5.14 శాతం గ్రామీణ కుటుంబాలు ఉపాధి కోసం నిత్యం కష్టపడి పనిచేయాల్సిందే. వ్యవసాయరంగంపై ఆధారపడి జీవిస్తున్న వారు 30.10 శాతం ఉన్నారు. వీరందరికి ఆదాయ భద్రత లేదు. మన గ్రామీణ వ్యవస్థలో 9.68 శాతం కుటుంబాలకు మాత్రమే వేతనాదాయం ఉన్నది. సుమారు 75 శాతం గ్రామీణ కుటుంబాల నెలసరి ఆదాయం ఐదు వేల రూపాయల కన్నా తక్కువే ఉన్నది.

స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలైనా గ్రామీణ భారతదేశం ఇంత పేదరికంలో మగ్గిపోవాల్సిన పరిస్థితులు ఎందుకున్నాయి? గ్రామాల్లో ఉన్న పేదరికాన్ని నిర్మూలించడానికి పరిష్కారమార్గాలున్నాయి. దేశంలో 69 శాతం పైగా ఉన్న గ్రామీణ జనాభాలో వ్యవసాయ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇందులో పెట్టుబడుల శాతం పెరిగినప్పుడే వ్యవసాయ రంగంలో ఉత్పత్తి పెరిగి గ్రామీణ రైతుల ఆదాయాలు పెరుగుతాయి. అభివృద్ధి చెందిన అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా లాంటి దేశాల్లో 22-28శాతం వరకు రైతులకు సబ్సిడీలు ఇస్తున్నారు. మనలాంటి వెనుకబడిన అభివృద్ధి చెందుతున్న దేశంలో చిన్న, సన్న కారు రైతులు, మధ్య తరగతి రైతులకు కనీసం 30-40 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీలు అందజేసి వ్యవసాయ ఉత్పత్తిని ప్రోత్సాహించాలి. అంతేకాకుండా జాతీయ బ్యాంకులు దేశంలో ఇచ్చే మొత్తం అప్పుల్లో కనీసం 50శాతం అప్పులు గ్రామీణ రంగంలో ని రైతులు, ఇతర పేద వర్గాలకు ఇచ్చి గ్రామీణ ప్రజల ఆదాయాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలి. దీనివల్ల గ్రామీణ భారతదేశంలో రైతులు, పేద, బలహీన వర్గాల ఆదాయాలు, జీవన ప్రమాణాలు పెరుగుతాయి. ఆర్థికవేత్త అమర్త్యసేన్ రూపొందించిన సిద్ధాంతం ప్రకారం- వెనుకబడిన దేశంలోని మొత్తం గ్రామీణ రంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ బడ్జెట్ల నుంచి 50 శాతం నిధులు కేటాయించినట్లయితే గ్రామీణ ప్రజల ఆదాయాలు పెరిగి వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది. దీంతో పారిశ్రామిక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుంది. దీనివల్ల జాతీయ వృద్ధిరేటు పెరిగి దేశంలోని అన్ని రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. నూటికి నూరు శాతం విద్యావంతులు ఆరోగ్యవంతులైన సమాజంలో సహజ వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఆర్థికాభివృద్ధిని వేగంగా సాధించవచ్చు. అందువల్ల దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, వైద్యం, వ్యవసాయం, మౌళిక రంగాల్లో అధిక పెట్టుబడులు పెట్టడంతోపాటు అర్హులైన పేదలు, నిరుద్యోగులు అనాథలకు వివిధ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా గ్రామాల్లో పేదరికాన్ని నిర్మూలించవచ్చు.

గ్రామీణ భారతంలోని రైతులు, వ్యవసాయ కూలీలు, చేనేత వృత్తుల వారు, అల్పాదాయ వర్గాలు, ఆర్థిక భద్రతలేని ఇతర అన్ని వర్గాలు, పట్టణాలలోని పేదలు, అల్పాదాయ వర్గాలు, ఆర్థిక భద్రతలేని బలహీన వర్గాలు, మధ్య తరగతి వర్గా ల వారందరికి ప్రభుత్వం ఆరోగ్య కార్డులు జారీచేసి ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అన్ని జబ్బులకు ఉచిత వైద్యం అందించాలి. అంతే కాకుండా పైన పేర్కొన్న బలహీన వర్గాలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారందరకి ప్రైవేట్ కార్పొరేట్ విద్యా సంస్థలలో ఉచిత విద్య అందించాలి. ఆర్థిక భద్రతలేని వ్యవసాయ కూలీలకు, రైతులకు, అల్పాదాయ వర్గాలకు ఉపాధి చూపించాలి. 60 ఏండ్లకు పైబడిన వారందరికీ ఆర్థిక భద్రత కల్పిం చేందుకు ప్రభుత్వాలు మెరుగైన పింఛన్ సౌకర్యం కల్పించాలె.

గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని సంస్కరించి దాని పరిధిని పెంచాలి. ఈ పథకాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయాలి. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయ రంగంలోని ఉత్పత్తికి అనుసంధానం చేయ డం ద్వారా వ్యవసాయరంగంలో ఉత్పత్తి పెరగటానికి దోహదం చేస్తుంది. రైతుల ఆదాయమూ పెరుగుతుంది. ఉపాధి హామీ పథకం ద్వారా సంపద సృష్టించే నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు అమలు చేసినట్లయితే గ్రామీణ రంగంలో అన్నివర్గాల వారికి శాశ్వత ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి.



# జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యంలో మన గ్రామసీమల్లో త్రాగునీటి వసతుల కల్పన మరియు నిర్వహణ వంటి అంశాలను సంబంధిత గ్రామ సమాజాలే చేపట్టాలన్నది ఒక ముఖ్యమైన అంశం. దీనికి అనుగుణంగా గ్రామ పంచాయితీల కీలక పాత్రను గుర్తించి వాటి బాధ్యతలు, అధికారాలను రూపొందించి 73వ సవరణ ద్వారా భారత రాజ్యాంగంలో పొందుపరచటం జరిగింది. దీని స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను తెచ్చాయి. వివిధ పథకాలను రూపొందించాయి. వాటిలో ఒక ముఖ్యమైన పథకం జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకము (ఎన్.ఆర్.డి.డబ్ల్యు.పి)

అంతకు ముందు అమలులో ఉండిన ఎఆర్‌డబ్ల్యుపి పథకాన్ని సవరించి 1-4-2009 నుండి జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకాన్ని భారత ప్రభుత్వం ప్రవేశపెట్టింది. పంచాయితిరాజ్ సంస్థలు, సభ్యులు నీరు మరియు పారిశుద్ధ్య కమిటీలు తమతమ గ్రామాలలోని త్రాగునీటి వనరులను, త్రాగునీటి వ్యవస్థలను నిర్వహించుకొనేటంతగా బలోపేతమయ్యే దిశలో తమ స్వార్థాలను పెంచుకొనేందుకు తగిన వాతావరణాన్ని కల్పించడం ఈ పథకంలోని ముఖ్యమైన అంశాల్లో ఒకటి

**జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం (ఎన్.ఆర్.డి.డబ్ల్యు.పి)**

**విధాన పరిధి:-** క్లుప్తంగా చెప్పాలంటే జాతీయ గ్రామీణ త్రాగునీటి పథకం ఉద్దేశం ఇలా ఉంది.

**1. జాతీయ గమ్యం:** ప్రతి గ్రామీణ వ్యక్తికి త్రాగడానికి, వంటకు మరియు ఇతర గృహ ఉపయోగ ప్రాథమిక అవసరాల కోసం అవసరమైన మేరకు సురక్షిత నీటిని స్థిరత్వప్రాతిపదికపై అన్ని వేళలా అన్ని పరిస్థితులలో లభ్యమయ్యేలా చేయటం.

**2. ప్రాథమిక సూత్రం:** ప్రతి వ్యక్తికి త్రాగునీరు పొందే హక్కు ఉంది. కేవలం వ్యాపార దృష్టితో చూడకుండా మార్కెట్ శక్తులకు పూర్తిగా వదిలివేయకుండా ప్రజారోగ్య కారణం దృష్ట్యా గ్రామపంచాయితి, ప్రజారోగ్య శాఖల మధ్య భాగస్వామ్యాన్ని పెంపొందింప చేసి ప్రజలకు కనీస అవసరాలకు తగ్గకుండా త్రాగునీటి సరఫరా అయేటట్టు చూడటం ప్రభుత్వ కార్యాకలాపాల్లో ఒక అతిముఖ్యమైన అంశం. ఈ క్రమంలో నీటిచార్జీలు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై భారాన్ని ఇతర వర్గాలు కొంతవరకు భరించేటట్లు నిర్ణయించటం.

**3. పథకం ఆశయాలు :** గ్రామీణ ప్రాంతాల్లో

1. అన్ని కుటుంబాలకు తగు దూరము లోపల సురక్షిత త్రాగునీరు అవసరమైన మేరకు అందుబాటులోకి వచ్చేటట్లు చేయటం.
2. గ్రామీణ సమాజాలే వారి పరిధిలోని త్రాగునీటి వనరులపై పర్యవేక్షణ, నిఘాలు నిర్వహించేటట్లుగా చేయటం
3. ప్రజలు నిర్వహించుకొనే తాగు నీటి సరఫరా వ్యవస్థ రూపకల్పనలో వనరుల స్థిరత్వము, వినియోగదారుల ప్రాధాన్యతలు, సౌకర్యము, నమ్మకమైన లభ్యతలను మూల సూత్రాలుగా దృష్టిలోనుంచుకొనేటట్లు చేయటం.
4. బహిరంగ మల విసర్జన రహిత స్థాయి కొన చెరిన గ్రామ పంచాయితీలకు త్రాగునీటి సరఫరా వసతిని (ముఖ్యంగా పైపుల ద్వారా) కల్పించడంలో ప్రాధాన్యతనివ్వడం.
5. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలకు సురక్షిత త్రాగునీరు అందుబాటులోకి వచ్చేలా చేయటం.
6. పంచాయితీరాజ్ సంస్థలు, స్థానిక ప్రజలు తమ త్రాగునీటి వనరులను, సరఫరా వ్యవస్థలను తామే నిర్వహించుకొనేందుకు అనువైన పరిస్థితులను కల్పించి బలపరచటం.
7. పారదర్శకత, సమాచారధారిత నిశ్చయాల కోసం "ఆన్‌లైన్" వ్యవస్థ ద్వారా సంబంధిత సమాచారాన్ని ప్రజల ముందుంచటం.

**లక్ష్యాలు :**

12వ పంచవర్ష ప్రణాళిక దృక్పథానికి అనుగుణంగా ఎన్ఆర్‌డిడబ్ల్యుపి పథకం ద్వారా ఈ క్రింది లక్ష్యాలను భారత ప్రభుత్వం ఎంచుకొంది.

2017 నాటికి దేశలంలోని గ్రామీణ ప్రజానికములో కనీసము 50%కు తమ గృహాలలోకాని లేదా గరిష్టంగా 100 మీటర్ల పరిధిలో పైపుల ద్వారా 55 ఎల్‌పిసిడి మేరకు త్రాగునీరు అందుబాటులోకి రావడం - కనీసం 35%కి తమ గృహాలోనే పైప్ కనెక్షన్లు రావటం - పంచాయితిరాజ్ సంస్థలు మరియు ప్రజా సమూహాలే 60% గ్రామాలలో త్రాగునీటి పథకాన్ని నిర్వహించడం.

2022 నాటికి గ్రామీణ ప్రజానీకములో కనీసము 90%కు తమ గృహాలలో కాని లేదా గరిష్టంగా 50 మీటర్ల పరిధిలో పైపుల ద్వారా 70 ఎల్‌పిసిడి మేరకు త్రాగునీరు అందుబాటులోకి రావటం - కనీసం 80%కి తమ గృహాల్లోనే పైప్ కనెక్షన్లు రావటం - పంచాయితిరాజ్ సంస్థలు మరియు ప్రజా సమూహాలచే త్రాగునీటి వనరులు, వ్యవస్థలు పూర్తిగా నిర్వహించబడడం.

ఎన్ఆర్‌డిడబ్ల్యుపి పథకం అమలులో మారిన దృక్పథం : 12వ పంచవర్ష ప్రణాళిక దృక్పధానికి అనుగుణంగా ఎన్ఆర్‌డిడబ్ల్యుపి అమలులో చోటు చేసుకున్న కొన్ని ముఖ్యమైన మార్పులు ఇలా ఉన్నాయి.

- పైపుల ద్వారా నీటి సరఫరాలకు ప్రాముఖ్యత
- ఒకేమనరుపై ఆధారపడకుండా వివిధ నీటి వనరులతో గ్రామ స్థాయి నాటి ప్రణాళికల తయారి
- నీటి సంరక్షణ, భూగర్భజలాల భర్తీకి ప్రణాళికలు
- వివిద స్థాయిలలో నీటి వనరుల దీర్ఘకాల స్థిరీకరణకు ప్రాముఖ్యము
- గ్రామీణ నీటి సరఫరా పథకాలతో పారిశుద్ధ్య పథకాల సమన్వయం
- త్రాగునీటి నాణ్యతా ప్రమాణాలు
- గృహ సముదాయములోని అన్ని కుటుంబాలకు తప్పనిసరిగా త్రాగునీరు అందుబాటులోకి వస్తే తప్ప ఆ గృహసముదాయము సంపూర్ణ నీటి లభ్యత ఉన్నట్లుగా పరిగణించకపోవడం.




# మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు/ఉపాధ్యక్షులు

## విధులు –బాధ్యతలు

మండల ప్రజాపరిషత్‌కు నేరుగా ఎన్నికకాబడిన మండల ప్రజాపరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు (యం.పి.టి.సి) తమలో ఒకరిని చైర్‌పర్సన్‌గా ఎన్నుకుంటారు. మండల ప్రజాపరిషత్ పరిపాలనా వ్యవహారాలను సక్రమంగా నిర్వహించడానికి మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు నాయకత్వం వహిస్తారు. మండల ప్రజాపరిషత్ మెజారిటీ సభ్యుల నిర్ణయంతో చేసిన తీర్మానాలను మండల అభివృద్ధి అధికారి ద్వారా అమలు చేయించే బాధ్యత ఛైర్‌పర్సన్‌పై ఉంటుంది. మండల ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ తన కర్తవ్యాలను నిర్వర్తించడానికి ఈ క్రింది అధికారాలను కలిగి ఉంటారు.

**పరిపాలనా నియంత్రణ అధికారము :**

- మండల ప్రజాపరిషత్ సమావేశములందు ఆమోదించబడిన తీర్మానములు అమలు జరుపు నిమిత్తం యం.పి.డి.ఓ.పై పరిపాలనా నియంత్రణాధికారము కలిగి వుండును. (సెక్షన్ 165 (1)ఎ)
- మండల ప్రజాపరిషత్ రికార్డులన్నింటిని పరిశీలించవచ్చును. (సెక్షన్ 165 (1) సి.)
- మండల ప్రజాపరిషత్ మొత్తం సిబ్బందిపై ప్రభుత్వ నిబంధనల మేరకు పరిపాలనా నియంత్రణాధికారము కలిగి ఉండుట.
- జిల్లా మరియు రాష్ట్రస్థాయి కార్యాలయాలకు పంపే ముఖ్యమైన ప్రతిపాదనలు అధ్యక్షుని ఆమోదంతో పంపాలి. (జి.ఓ.యం.యస్.నెం.40, పంచాయితీరాజ్ తేది : 23.1.1990)

**మండల ప్రజాపరిషత్ సమావేశాల నిర్వహణ :**

- మండల ప్రజాపరిషత్ సమావేశములకు అధ్యక్షత వహించి వివిధ కార్యకలాపాలను నిర్వహించు హక్కును కలిగి వుండును. (సెక్షన్ 165 (1) బి)

- మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు మండల ప్రజాపరిషత్‌కు సంబంధించి ఏదైనా కార్యక్రమం అమలుచేయాలని ఆలోచనలో ఉన్నప్పుడు విషయ పరిజ్ఞానము కలిగి వుండి, ఏ రాజకీయ పార్టీ లోను కార్యవర్గ సభ్యుడుగా లేని వ్యక్తిని ప్రత్యేక ఆహ్వానితునిగా మండల ప్రజాపరిషత్ సమావేశములకు ఆహ్వానించవచ్చును. (సెక్షన్ 159)
- మండల ప్రజాపరిషత్ సమావేశములకు సంబంధించిన తేదీ, సమయము, అజెండా అంశాలకు ముందుగా మండలాధ్యక్షులు తమ ఆమోదం తెలియజేయాలి.
- మండల ప్రజాపరిషత్ సమావేశములలో క్రమ శిక్షణ పాటించని సభ్యులపై తదుపరి సమావేశాలలో పాల్గొనకుండా నాలుగు నెలల వరకు సస్పెండ్ చేయు అధికారము మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు ఉంది.

**అత్యవసర పరిస్థితుల్లో అధికారము :**

- అత్యవసర పరిస్థితుల్లో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు యం.పి.డి.ఓతో సంప్రదించి ప్రజల సేవ లేక భద్రతకు సంబంధించిన ఏ నిర్మాణ పనినైననూ లేక అట్టి ఏ కార్యమునైనను చేయవలసినదిగా ఆదేశించవచ్చు. అయితే మరుసటి సమావేశములో పై పనిని చేపట్టుటకు గల కారణములను మండల ప్రజాపరిషత్‌కు తెలియపర్చవలెను.
- అయితే ప్రభుత్వము యొక్క ఏదేని ఉత్తరువును ఉల్లంఘించే ఏ నిర్మాణపు పనినైనను చేయవలసినదని లేక ఏ కార్యమునైనను చేయవలసినదని ఆదేశించరాదు. (సెక్షన్ – 165(2) )

**విద్యాభివృద్ధిలో :**

- మండల విద్యా కమిటీ చైర్మన్ హోదాలో పాఠశాల విద్యా కమిటీల పనితీరును సమీక్షించి తగు మార్గదర్శకత్వం వహించాలి.
- మండల ప్రజాపరిషత్ పాఠశాలలను సందర్శించి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలి.

**అభివృద్ధి కార్యక్రమాల అమలులో :**

- మండల ప్రజాపరిషత్ నిధుల నుండి మరియు ప్రభుత్వ నిధులతో చేపట్టు అభివృద్ధి పనులను తనిఖీ చేసి, అమలును సమీక్షించవచ్చును. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి సొసైటీ చైర్మన్ హోదాలో మండల ఆరోగ్య కార్యక్రమములను సమీక్షించవచ్చును.
- మండల స్థాయిలో జరిగే బ్యాంకర్సు కన్సల్టేటివ్ కమిటీలో పాల్గొని బడుగువర్గాలకు మరింత ఋణ సదుపాయం కల్పించుటకు చర్యలు తీసుకొనవచ్చును.
- ల్యాండ్ అసైన్‌మెంట్ కమిటీ నందు మెంబరు హోదాలో భూమి పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించవచ్చును.
- మండల ఆహార సలహా కమిటీ సభ్యుని హోదాలో ప్రజా పంపిణీ వ్యవస్థను సమీక్షించవచ్చును.
- మండల ఆహార ధరల నియంత్రణ కమిటీ అధ్యక్ష హోదాలో చౌకధరల షాపుల నిర్వహణను సమీక్షించి, ధరలను నియంత్రణ చేయవచ్చును.
- ప్రభుత్వం ఇటీవల మండల ప్రజాపరిషత్‌కు బదిలీ చేసిన అంశాలకు సంబంధించిన అధికారులను సమావేశ పరచి, వారి కార్యక్రమాలను తరచు సమీక్షించవచ్చును.
- సాంఘిక సంక్షేమ హాస్టళ్ళను, అంగన్‌వాడీ కేంద్రాలను, మహిళా సమాఖ్యలను సందర్శించి తగు సూచనలు చేయవచ్చును.
- ఉపాధి కల్పనా కార్యక్రమాలలో నిబంధనల మేరకు కనీస వేతనాల అమలును సమీక్షించవచ్చును.

**జిల్లా ప్రజాపరిషత్ సమావేశాలలో :**

- జిల్లా ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశాలలో శాశ్వత ఆహ్వానితునిగా మండల సమస్యలను జిల్లా పజాపరిషత్తు దృష్టికి తీసుకొని వెళ్ళి పరిష్కారమార్గాలు అన్వేషించవచ్చు

**మండలప్రజాపరిషత్ ఉపాధ్యక్షుల అధికారాలు–విధులు(సె. 165)**

1. మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షునికి వ్రాత పూర్వకంగా దఖలు పరచు అధికారములను వినియోగించవలెనని వ్రాసి ఇచ్చినచో అట్టి విధులను నిర్వర్తించవలెను.
2. మండల ప్రజాపరిషత్ అధ్యక్షుని పదవి ఖాళీగా ఉన్నప్పుడు, మండల ప్రజాపరిషత్తు ఉపాధ్యక్షుడు, క్రొత్త అధ్యక్షుని ఎన్నుకొనబడునంత వరకు అధ్యక్షుని అధికారములను వినియోగించవలెను మరియు అతని విధులను నిర్వర్తించవలెను.
3. మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు వరుసగా 15రోజులకు మించి మండలంలో లేనిచో లేక 15 రోజులకు మించి అశక్తుడైనచో, ఆ సమయంలో అతని అధికారాలను మరియు విధులు ఉపాధ్యక్షునికి సంక్రమించును.
4. అధ్యక్షులు, ఉపాధ్యక్షులు ఇద్దరూ 15 రోజులకు మించి మండలములో లేనిచో లేక 15 రోజులకు మించి అశక్తులైనచో మండల ప్రజాపరిషత్‌కు ఎన్నికైన సభ్యులలో ఒకరిని అధ్యక్షులుగా ప్రభుత్వము నియమించవచ్చును.

# నైతిక విలువలు

**నైతిక విలువలు అని చెబితే మనలో చాలా మంది నవ్వునివారు వుండరేమో ఇందుకు కారణాలు అనేకం.**

**అయితే విధి నిర్వహణలో నైతిక విలువలు పాటించవలసిన అవసరం ఏమిటి? మనకు ఒకరు నైతిక విలువలు నేర్పడం ఏమిటి? మనకు నైతిక విలువలు తెలియవా? లేవా? అనే సందేహాలు మనలో చాలా మంది మదిలో తలెత్తుతుంటాయని ఊహించగలం!**

మనలో చాలామంది ఒక వ్యవస్థను అనుసరించే సమయంలో, అసలు వ్యవస్థ నియమాలను కాకుండా ప్రస్తుతం వ్యవస్థలో ఏమి జరుగుతుందో అదే వ్యవస్థ అని అపోహపడుతుంటారు. అంటే.. ప్రస్తుత వ్యవస్థలోని అవినీతి, బంధుప్రీతి, అలసత్వం, రాజకీయ ప్రేరణలు, అధికారదర్పం మొదలైన అవలక్షణాలు సహజమైనవనీ, వాటినే కొనసాగించాలనే ఉద్దేశ్యంలో ఉంటారు. ఐతే ఇదే సమయంలో మనలో మరికొన్ని ఆలోచనలు కూడా వస్తుంటాయి. అవి..... ఈ వ్యవస్థకు అనుగుణంగా వ్యవహరించక పోతే మనం మనుగడ సాగించలేమనే భయం, "కొందరు పెద్దల బెదిరింపులు" ఒకవైపున, మరో వైపున "మనం మంచి అధికారం, ఆదాయంగల ఉద్యోగంలో ఉన్నాం, ఈ అధికారం, ఆదాయంతో మనం, మన కుటుంబం నిశ్చింతగా బ్రతకగలం" అనే ధోరణి కనుక, వ్యవస్థలోని దుర్లక్షణాలను వ్యతిరేకించకుండా సరుకుపోవడం పూర్తిగా రాజీపడడము ద్వారా అంతా సజావుగా సాగిపోతుందని" భావిస్తాం.

అతి తక్కువ కాలంలోనే పెరిగి పెద్దదై, తనలాంటి అనేక విషపు మొక్కలను విస్తరింప చేసే పార్థీనియం మొక్కను చూసి కూడా మనం ఏ విధంగా తొలగించటం లేదో అదే విధంగా ప్రాథమికస్థాయిలోనే ఈ చెడు సంస్కృతిని నిర్మూలించకపోతే, దుర్లక్షణ భరితమైన ప్రస్తుత వ్యవస్థలో ఆ లక్షణాలు పెరిగి రకరకాల రూపాలలో అన్ని రంగాలకు, అందరు వ్యక్తులకు చేటు చేయవచ్చు.

"ఐతే. నాకేంటి? నేను నా పిల్లలకు తరగని ఆస్తిపాస్తులను వారసత్వంగా ఇస్తున్నాను. కనుక వారికి భవిష్యత్లో ఏ బాదరబంది ఉండదుకదా! అని అనుకుంటూ ఉంటే.. అది అమాయకత్వమే!

మన ప్రక్క ఇంట్లో ఆకలికి అలమటిస్తున్న వ్యక్తి ఉంటే అది మనకు ప్రమాదం! ఏవిధంగా అంటే ఆకలికి తట్టుకోలేని వ్యక్తి మన ఇంటి పైకే దోపిడికి పాల్పడవచ్చు. మన ఊరిలోని కలరాను మనం నిర్మూలించడానికి ప్రయత్నించక పోతే అది మన ఇంటికి కూడా వ్యాపించవచ్చు. ఈ రోజున భారత వాణిజ్య రాజధాని ఐన 'ముంబాయిలో పెచ్చు పెరిగిన మాఫియా సంసృతికి అవసరమైన రిక్రూట్ మెంట్ అక్కడి మురికివాడల నుండి జరుగుతుందనేది ఎవరూ కాదనలేని వాస్తవం. దీనికి కారణం తీవ్రమైన ఆర్థిక అసమానతలు, నిర్దేశిత ప్రభుత్వ నిధులు, పథకాలు అరులైన లక్షిత వర్గాలకు చేరకపోవడమే. కాని దీని వలన పెరిగిన నేర సంస్కృతిలో భాగంగా జరుగుచున్న అపహరణలు, బెదిరింపులు, భూకబ్జాలు, హత్యలు, మొదలైన నేరాలు ఎక్కువగా సంపన్న మధ్యతరగతి వారిపైనే జరుగుచున్నాయి. దీనిని బట్టి ఒక ప్రాంతం వ్యవస్థలోని దుర్లక్షణాలను ప్రాథమిక స్థాయిలో అదుపు చేయకపోవడం లేక పూర్తిస్థాయిలో అరికట్టలేకపోవటము వలన, ఆ ప్రాంతం అభివృద్ధి నేర సంస్కృతిలో చీకటి కోణంగా పెరుగుతుందని గుర్తించవచ్చు. సదరు ఆర్థికాభివృద్ధి లోపభూయిష్టమై, దీని ద్వారా లబ్దిపొందిన వారు కూడా దుష్పరిణామాల బారిన పడతారని గ్రహించవచ్చు. దీనికి సంబంధించి ఒక వాస్తవ గాథను తెలుసుకుందాం.

"చాలా సంవత్సరాల క్రిందట మనదేశంలోని ఒక ప్రాంతంలో తలెత్తిన కరువుకాటకాల వలన ఒక ఊరిలోని యువకులు, పని చేయగలవారు వలసపోయారు. ఆ ఊరిలోని అతికొద్ది మందితో పాటు ఒక వృద్ధ జంట మాత్రం అక్కడే ఉండిపోయారు. ఐతే వారు బ్రతుకు తెరువు కోసం ఆ గ్రామంలోని మరికొందరు చేసినట్లే, ఆ ఊరి మీదుగా పోయే బాటసారులపై దాడిచేసి, దోచుకోవడం వృత్తిగా చేసుకున్నారు. 6, 7 సంవత్సరాల తర్వాత ఒక రోజున ఆ గ్రామం మీదుగా వెళుతున్న ఒక యువకుడిని చూసిన ఆ దంపతులు దాడిచేసి దోచుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో ఆ దంపతులలోని భార్య ఒక దుడుకర్రతో వెనకగా వెళ్ళి ఆ ప్రయాణికుడి తలపై బలంగా కొట్టింది. ఆ దెబ్బకు గాయపడిన ప్రయాణీకుడి నుండి విలువైన వస్తువులు,



డబ్బుని వెదకడంలో నిమగ్నమైన ఆ దంపతులకు, చావు బ్రతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఆ ప్రయాణీకుడి పలవరింతలు వినిపించాయి. " నాపేరు రాధాశ్యామ్! మా తల్లిదండ్రుల పేర్లు భారతీబాయి, రాజేందర్. మాది ఈ వూరే. బ్రతుకుతెరువు కోసం వలసపోయి చాలా కాలం తర్వాత మా అమ్మనాన్నల కోసం వచ్చా. నన్నెవరో కొట్టారు. నేను చచ్చిపోతున్నాను. మా అమ్మనాన్నలకు చెప్పండి." అనే పలవరింతలు విన్న ఆ దంపతులు నిశ్చేష్టులై నిలిచిపోయారు. కారణం ఆ అమ్మనాన్నలు వేరెవరో కాదు!. ఆ దంపతులే!. ఆ ప్రయాణీకుడు అక్షరాలా వీరి రక్తం పంచుకుని పుట్టిన వీరి కొడుకే. 6,7 సంవత్సరాల క్రితం పనికోసం దూరంగా ఉన్న పట్టణానికి వలసపోయి తన తల్లితండ్రులను సుఖపెట్టడానికి ధనాన్ని సంపాదించి తెచ్చిన ఆ కొడుకు అతని తల్లితండ్రుల చేతిలోనే మరణించాడు".

పై వాస్తవ గాధనుండి మనం గ్రహించాల్సినదేమిటి?. మనం ఒక చెడ్డ వ్యవస్థని లేదా వ్యవస్థలోని దుర్లక్షణాలను కొనసాగించడం, పాటించడం వలన కలిగే దుష్పరిణాల బారిన మనమే పడే ప్రమాదం ఉందని!. కనుక తాత్కాలిక ప్రయోజనాలను ఆశించి చెడుని సమర్ధించడం లేదా ఉపేక్షించడం వలన వ్యవస్థలోని చెడు సంప్రదాయాలను కొనసాగించడం వలన మనకు మన పిల్లలకు, మన భవిష్యత్ తరాల వారికి ఒక కలుషితమైన, ప్రమాదభరితమైన వ్యవస్థను మాత్రమే అందించగలము!. ఇదేనా మనం రేపటి తరాలకు ఇచ్చే/ ఇవ్వబోయే ఆస్తి? అలాంటి ప్రమాదభరితమైన వ్యవస్థలో భావి భారత పౌరులు స్వేచ్ఛగా, సంతోషంగా, సౌభాగ్యంతో ఎలా జీవించగలరో,?? .. ఆలోచించండి!.

ఐతే మనలో చాలామంది వ్యవస్థలోని దుర్లక్షణాలను గుర్తించినా, వాటి వలన భవిష్యత్లో తలెత్తే దుష్పరిణామాలను గుర్తించడం/ ఊహించడం లేదు. మరికొంతమంది వ్యవస్థలో చాలాకాలం నుండి నెలకొని ఉన్న సాంప్రదాయక దుర్లక్షణాలను. అసలు దుర్లక్షణాలుగానే గుర్తించలేని స్థితిలో ఉన్నారు. అంటే చాలాకాలం నుండి ఒక డిపార్ట్మెంట్ వ్యవస్థలొ ఆచరించబడుతున్న చెడు పద్ధతులు, లంచాలు, అధికార, దురహంకార వైఖరులు 9 డిపార్ట్మెంట్/వ్యవస్థ యొక్క 'సహజ లక్షణాలు' గా పొరపాటు పడటం జరుగుతుంది. ఉదాహరణకు పోలీసులు థర్డ్ డిగ్రీని యధేచ్ఛగా ప్రయోగించడం, బ్రెజరీలలో బిల్ విలువలో నిర్దిష్ట 'పర్సంటేజ్లను ఆశించడం, ఆస్తుల రిజిస్ట్రేషన్ సమయంలో నకలు పత్రాల కొరకు అదనంగా కొంత మొత్తాలను చెల్లించడం, వర్క్ బిల్లులలో వివిధ స్థాయిలలో నిర్దిష్ట పర్సంటేజ్లు చెల్లించడం, రాజకీయ సిఫార్సుల ఆధారంగా సాంఘిక సంక్షేమ పెనన్లు, సబ్సిడీలు, ఉద్యోగుల ట్రాన్స్ఫర్లు మొదలైన పనులను చేయడం అనేవి చెడు సంప్రదాయాలని గుర్తించలేని స్థాయిలో మనలో చాలా మంది ప్రస్తుత వ్యవస్థలోని వివిధ శాఖలలో చెలామణి కావడం మనం గమనించవచ్చు.

ఐతే . దీనికి పరిష్కారం ఏమిటి?... ఊరు మొత్తం శుభ్రంగా ఉండాలంటే, ముందు వ్యక్తి స్తాయి నుండే ఆ ప్రయత్నం మొదలుకావాలి! వ్యక్తి స్థాయి నుండి కుటుంబ స్థాయికి, కుటుంబస్థాయి నుండి గ్రామస్థాయికి ఈ ప్రయత్నం తాలూకు సత్ఫలితాలు విస్తరించి, మనం ఆశించిన గ్రామం ఆవిష్కరించబడుతుంది.

ఇదేవిధంగా వ్యవస్థలో నెలకొని ఉన్న చెడులను నిర్మూలించడం మన వృత్తి, ఉద్యోగ నిర్వహణలో భాగంగానే ప్రారంభించాలి. మన విధి నిర్వహణలో భాగంగా మన పరిధిలో జరిగే అనేక ప్రజాసంక్షేమ, పాలనా కార్యక్రమాలలో నైతిక విలువలను పాటించడం ద్వారా, మనం భావి తరాలకు అందించాలనుకుంటున్న మంచి వ్యవస్థను రూపొందించవచ్చు. ఐతే వ్యవస్థను మార్చడం లేదా మంచిగా తీర్చిదిద్దడం నా ఒక్కడి వల్లే ఎలా సాధ్యం అవుతుంది?!. అనేది మనలోని చాలా మందికి వచ్చే సత్వర సందేహం!!

దీనికి ఒకటే సమాధానం. ప్రతి సుదీర్ఘ ప్రయాణం ఒక అడుగుతోనే మొదలవుతుంది! ప్రతి పెద్ద నిర్మాణం ఒంటరి ఇటుకతోనే ప్రారంభిస్తాం! ఓ కవి చెప్పినట్లు "ఎవరో ఒకరు, ఎపుడో అపుడు, నడవరా ముందుకు" అన్నట్లుగా మొదటి అడుగు ఎప్పుడూ ఒంటరే మరి!. వెనుక వచ్చు వారికీ బాటే అదీ!. అనే వాస్తవాన్ని గుర్తించి, ప్రతి ఒక్కరూ తమవిధి నిర్వహణలో నైతిక విలువలను పాటించి, భవిష్యత్ భారతాన్ని నిర్మించుదాం!!!

## ప్రభుత్వ ఉద్యోగులు – నైతిక విలువలు

ప్రజల నమ్మకానికి పునాది ప్రజాసేవే! ప్రభుత్వోద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు అనుసంధాన కర్తలుగా ఉంటూ, ప్రభుత్వ చట్టాలకు బద్ధులై, స్వంత లాభాన్ని ఆశించక జాతీయ లక్ష్యాల సాధనకై కృషి చేయాలి. ప్రభుత్వం నుండి ప్రజలు ఆశించే నిజాయితీ, నిష్పాక్షికత మరియు నిబద్ధతలు ప్రభుత్వ ప్రతినిధులైన ప్రభుత్వ ఉద్యోగులలో ప్రతిఫలించాలి. ఉద్యోగులు తమ నైపుణ్యాలను, జ్ఞానాన్ని అనుభవాన్ని మెరుగుపరచుకుంటూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చవలసి ఉంటుంది. ఈ క్రమంలో ప్రజల నమ్మకాన్ని పొందడానికి, జాతీయ సమైక్యత, సమగ్రతలను కాపాడేందుకు మరియు దేశ సమగ్రాభివృద్ధిని సాధించేందుకు – ప్రభుత్వోద్యోగులు కొన్ని వ్యక్తిగత నియమాలను, వ్యవహారశైలిని పాటించాలి.

**నైతిక నియమావళి – కీలక అంశాలు:**

**1. వ్యక్తిగత జవాబుదారీతనం:**

- విధి నిర్వహణలో నిజాయితీ, ఆసక్తి, సావధానత, నిపుణత, నిష్పాక్షికత మరియు సమైక్యత భావనలను కలిగి ఉండాలి.
- కేవలం చట్టపరమైన లేక విధానపరమైన ఆవశ్యకతలను సంతృప్తి పరచడం కాక ప్రజావిశ్వాసాన్ని నమ్మకాన్ని పొందే విధంగా సేవ చేయాలి.
- విధి నిర్వహణకు భంగం కలిగించే ద్రవ్యపరమైన వ్యవహారాలను నిర్వహించరాదు.
- చట్టవ్యతిరేకంగా వివాహ, వివాహేతర సంబంధాలను సాగించరాదు.
- ప్రభుత్వ లేక ప్రభుత్వేతర సంస్థల సమాచారంతో స్వంత ప్రయోజనాలను ఆశించి, ఏ విధమైన ఆర్థిక కార్యకలాపాలలో పాల్గొనరాదు.
- ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఏ విధమైన బహుమతులనుగాని, ఆర్థిక లేదా ఆర్థికేతర ప్రయోజనాలను స్వీకరించరాదు.

- విధి నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల చట్టాలు, విధి విధానాలపై అవగాహనను నిరంతరం పెంచుకుంటూ విజయవంతమైన ఉద్యోగ జీవితాన్ని నిర్మించుకోవాలి.
- ప్రజలతో సహా ఉద్యోగులతో గౌరవంగా వ్యవహరించాలి.
- ప్రభుత్వేతర సంస్థ పట్లకానీ, వ్యక్తి పట్లకానీ పక్షపాత వైఖరితో వ్యవహరించరాదు.
- ప్రజల వనరులను వృధా చేయుట లేదా దుర్వినియోగపరచుట చేయరాదు.
- తెలిసి, తెలిసీ చట్టవిరుద్ధమైన హామీలను, నిర్ణయాలను చేయరాదు.
- ప్రభుత్వ లేదా ప్రజా ఆస్తులను స్వార్థ ప్రయోజనాల కొరకు వాడరాదు.
- ప్రభుత్వ ఆస్తులను అనుమతిలేని కార్యకలాపాలకు వినియోగించకుండా సంరక్షించాలి.
- మీ పరిసరాలలో జరుగుచున్న మోసం, అవినీతి, అసభ్యతలు, వృధా గురించి సంబంధిత అధికారులకు తెలియ పరచాలి/ఫిర్యాదు చేయవలెను.
- విధి నిర్వహణలో భాగంగా చట్టాలనేకాక ప్రజా సంక్షేమాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని నిర్ణయాలు తీసుకోవాలి.
- ఆశావాద దృక్పథంతో వ్యవహరిస్తూ ప్రజలలో, సాటి ఉద్యోగులలో ధైర్యాన్ని నింపాలి.
- పరిమితికి మించి చేయు వ్యక్తిగత కొనుగోళ్ల వివరాలను ప్రభుత్వానికి తెలియపరుసూ, తగిన అనుమతులను పొందవలెను.

**2. చట్టంపట్ల విధేయత:**

- సివిల్, క్రిమినల్ చట్టాలను గౌరవిసూ విధులను నిర్వహించాలి.
- ఉద్యోగులు మరియు డిపార్ట్‌మెంట్‌పై వచ్చే ఫిర్యాదులపై సకాలంలో, నిష్పక్షపాత వైఖరితో విచారణ జరిగేలా సహకరించాలి. తద్వారా ప్రజలలో విశ్వాసాన్ని నెలకొల్పాలి.

**3. ప్రజా సంబంధాల నిర్వహణ:**

- స్థానిక ప్రజల యొక్క అనుభవాల నుండి వచ్చే సూచనలు, సలహాలు, పరిష్కారాలను స్వీకరించడం ద్వారా మరింత మెరుగైన నిర్ణయాలను చేయగలము.
- ప్రభుత్వం పట్ల, చట్టం పట్ల, ప్రజలలో గౌరవాన్ని పెంచేలా, సమైక్యతను కాపాడేలా ప్రజల నిజాయితీని, నిబద్ధతను, జవాబుదారీతనాన్ని గౌరవిస్తూ వ్యవహరించాలి.
- జాతి, మతం, కులం, లింగం, ప్రాంతం, భాష, సంస ృతి, నిస్సహాయత, విద్య, వయస్సు, సంపద, వైకల్యంల ఆధారంగా ఏ విధమైన పక్షపాతాన్ని (చట్టం ఆమోదించని) చూపరాదు.
- ప్రభుత్వోద్యోగులు ప్రజల సంక్షేమం కొరకు నియమించబడిన వారు కనుక అధికార దర్పంతో కాకుండా సేవా ద ృక్పథంతో వ్యవహరించాలి.

**4. బహుమతులు, రివార్డ్‌లు, ఆతిథ్యాలు మరియు రాయితీలు పొందడం పై పరిమితులు:**

- విధి నిర్వహణలో భాగంగా అనేక మందిని కలిసి వ్యవహరించే సందర్భాలలో "బహుమతులు, ఆతిథ్యాలు" ఏ రూపంలో ఉన్నప్పటికీ స్వీకరించరాదు.
- విధి నిర్వహణలో భాగంగా చేసే వస్తువుల కొనుగోళ్ళ నగదు చెల్లింపులలో పూర్తి పారదర్శకతను పాటించాలి.
- ప్రభుత్వం ప్రకటించే రివారులు, బహుమతుల స్వీకరణపై ఎట్టి నిర్బంధము లేదు.
- ప్రభుత్వేతర సంస్థలు ప్రకటించే సామూహిక బహుమతులు, రాయితీల స్వీకరణపై ఎట్టి నిర్బంధం లేదు.
- ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు కల్పించే ఉచిత వసతి, ప్రయాణ రాయితీ సౌకర్యాలను విధి నిర్వహణలో స్వీకరించరాదు.

**5. వివిధ వర్గాల ప్రయోజనాల మధ్య తలెత్తే సంఘర్షణను నివారించుట:**

- విధి నిర్వహణలో భాగంగా చేపట్టే చర్యలతో వర్గపరమైన ప్రయోజనాల కొరకు సంఘర్షణలు తలెత్తవచ్చు కనుక ఉద్యోగులు ఈ తరహా సంఘటనలను ఎదుర్కొనేందుకు సంసిద్ధంగా ఉండాలి. తగిన పరిష్కారాలను ముందస్తుగా ఆలోచించాలి. ప్రభుత్వ పథకాల ద్వారా పరిమిత సంఖ్యలోనే లబ్దిదారుల ఎంపిక చేయునపుడు "పూరెస్ట్ ఆఫ్ ది పూర్" కి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మన నిర్ణయాలను సమర్ధించుకోవచ్చు.
- ఒక పథకం అమలులో ఆ పథకం తాలూకు భాగస్వాముల (స్టేక్ హోల్డర్) పరిధులను స్పష్టంగా గుర్తించి, తదనుగుణంగా వ్యవహరించేలా చూడాలి. లేనిచో పథకం అమలులో క్రొత్త సమస్యలు తలెత్తవచ్చు.
- ఉద్యోగులు ప్రభుత్వం నుండి ఏ విధమైన పని కాంట్రాక్టులను స్వీకరించుట, భాగస్వాములుగా చేరుట. బినామీలుగా వ్యవహరించుట చేయరాదు.
- ఇతర ఉపాధి, వ్యాపారాలలో ఉద్యోగులు నిమగ్నమవరాదు. తమ కుటుంబ సభ్యులు కూడా చట్టవ్యతిరేక వృత్తి వ్యాపారాలలో పాల్గొనకుండా నియంత్రించాలి. లేనిచో సదరు కార్యకలాపాల వలన తలెత్తే దుష్పరిణామాలలో బాధ్యుడిగా ఆరోపించబడే ప్రమాదం ఉంది.
- పదవీ విరమణ తర్వాత స్వీకరించే వృత్తి వ్యాపారాలు, ఉపాధులకు విధి నిర్వహణలో పొందిన అధికార రహస్యాలను వినియోగించరాదు.

**6. రాజకీయ కార్యకలాపాలపై పరిమితులు:**

- ఉద్యోగులు రాజకీయ పార్టీల స్థాపన, ఎన్నికలలో పాల్గొనడం, ప్రభుత్వ వ్యతిరేక ప్రసంగాలు చేయడం నిషేధించడమైనది.
- ఏదేని రాజకీయ పార్టీకి లేదా స్వతంత్ర్య అభ్యర్ధికి మద్దతుగా ప్రచారం చేయరాదు.
- పని ప్రదేశాలలో రాజకీయ, విప్లవ, చట్టవ్యతిరేక, ప్రభుత్వ వ్యతిరేక ప్రసంగాలు చేయరాదు.
- ప్రజాసంక్షేమ కార్యక్రమాలలో, లబ్దిదారుల ఎంపికలో రాజకీయ ఒత్తిళ్ళకు అతీతంగా అర్హత కలిగిన వారికే ఆయా పథకాలను అందేలా చూడాలి.

7. **ఆర్థిక వ్యవహారాలలో వ్యవహారశైలి:**

- ఉద్యోగులు ప్రైవేట్ వ్యక్తుల నుండి అప్పులు తీసుకొనుట, ప్రైవేట్ వ్యక్తులకు అప్పులు ఇచ్చుట చేయరాదు.
- తాకట్టు, వడ్డీ వ్యాపారాలు, చిట్ల నిర్వహణ చేయరాదు.
- ఏదేని చట్టబద్ధ ప్రైవేట్ ఆర్థిక సంస్థలలో కస్టమర్గా చేరి పొదుపు, చిట్లలో పాల్గొనుట వ్యక్తిగత నిర్ణయంగా భావించి పాల్గొనవలెను.
- కార్యాలయ డబ్బుని స్వంత ప్రయోజనాలకు వాడరాదు. ఇతరులకు అప్పుగా లేదా బదులుగా ఇవ్వరాదు.
- ప్రతి ప్రభుత్వ సంబంధిత ఆర్థిక లావాదేవీని లిఖిత పూర్వకంగా నమోదు చేసి భద్రపరచాలి.
- పంచాయతీ/ప్రభుత్వ ధన వినియోగంలో పూర్తిగా నియమ నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాలి. అర్హతలేని ఏజెన్సీల వద్ద కొనుగోళ్ళ చేయరాదు. చట్టం అనుమతించిన విధానంలోనే అనుమతి గల వస్తుసేవలను కొనుగోలు చేయవలెను.
- ప్రైవేట్ వ్యక్తులకు, సంస్థలకు అనుచితమైన మేలు చేసి ప్రతిఫలంగా డబ్బు లేదా ఇతర ఆర్థిక అంశాలు లేదా ఆర్థికేతర ప్రయోజనాలను పొందడానికి ప్రయత్నించడం శిక్షార్హం.

8. **ప్రభుత్వ రహస్యాల నిర్వహణ మరియు సమాచారహక్కు చట్టం:**

- నిర్ణయీకరణ దశలో సమాచారాన్ని బయల్పరచడం వలన, కొందరు దురుద్దేశంతో నిర్ణయాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నించవచ్చు.కావున ఈ తరహా సమాచారాన్ని తగిన చట్టం అనుమతి లేనిదే బయల్పరచరాదు. ఇదే సమయంలో సమాచారహక్కు చట్టం స్ఫూర్తిని గౌరవిస్తూ, ప్రజలకు వారు కోరిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించవలెను.
- సమాచారహక్కు చట్టం గూర్చి పూర్తి స్థాయి అవగాహనను పొంది, ప్రజలకు ప్రభుత్వ నిర్ణయాలను పారదర్శకంగా ఉంచాలి.

9. **ప్రభుత్వ/అధికారిక ఆస్తులు, సేవలు వినియోగం:**

- అధికారిక హోదాలో కల్పించబడిన వాహన సౌకర్యం, వసతి, ఇతర సామాగ్రి మరియు సౌకర్యాలను భిన్నమైన ప్రయోజనాలకు వినియోగించరాదు.
- ప్రభుత్వ కార్యాలయాలను అనధికారిక కార్యక్రమాలకు, స్వంత ప్రయోజనాలకు వినియోగించరాదు. అధికారిక గుర్తింపుకారులను, హోదాలను స్వార్థ ప్రయోజనాలకు వినియోగించరాదు.
- ఎలక్ట్రానిక్ నెట్‌వర్క్ కంప్యూటర్ మొదలైన సదుపాయాల వినియోగంలో స్వార్థ ప్రయోజనాలకు తావివ్వరాదు.

10. **ప్రభుత్వ ఆస్తుల అమ్మకాలలో పాల్గొనుట, కొనుగోలు చేయు హక్కుకు పరిమితి:**

- ప్రభుత్వ ఆస్తుల బహిరంగ వేలం, అమ్మకాలలో పాల్గొని కొనుగోలు చేయు వెసులుబాటు ఉద్యోగులకు కలదు. ఐతే ఈ ఆస్తులను తిరిగి అమ్మకం చేయుటకు లేదా ఉపాధి వ్యాపారాలకు వినియోగించుటకు కొనుగోలు చేయరాదు.
- స్వంత కార్యాలయ ఆస్తుల అమ్మకాలలో, కొనుగోళ్ళలో ఏ విధమైన ప్రాధాన్యత కొరకు ప్రయత్నించరాదు.
- పంచాయతీ ఆస్తులైన చేపల చెరువులు, తోటలు, భూముల లీజు నిర్వహణలను ఇ.ఒ.(పి.ఆర్ & ఆర్.డి)లు పర్యవేక్షించాలి.

11. **సౌకర్యవంతమైన కార్యాలయ వాతావరణాన్ని నెలకొల్పుట:**

- కార్యాలయ ఉద్యోగులకు, సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలి. తద్వారా పని వేగంలో మెరుగుదల, సందర్శకులకు సంతృప్తి కలుగుతాయి.
- కార్యాలయ సహ ఉద్యోగులతో గౌరవంగా వ్యవహరిస్తూ, మత, కుల, భాష, లింగ, వైకల్యపరమైన వివక్షను చూపకుండా వ్యవహరించాలి.
- కార్యాలయంలో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించి, ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణను, నిష్పక్షపాతంగా పనిచేసేందుకు తగిన భద్రతను కల్పించాలి.
- కార్యాలయ పరిసరాల్లో డ్రగ్స్, ఆల్కహాల్లను వినియోగించరాదు. ఈ తరహా పదార్థాలను సేవించి విధులకు హాజరగుట నేరం. నిషేధిత ప్రదేశాలలో పొగత్రాగరాదు.
- యూనిఫామ్‌ను ధరించవలసిన ఉద్యోగులు తప్పక ధరించి విధులకు హాజరవ్వాలి.
- యూనిఫామ్‌ని ధరించి, విధులలో లేని సమయంలోనైనా/విధులలో ఉన్నప్పుడైననూ ఆల్కహాల్, డ్రగ్స్ వంటి పదార్థాలను కొనుగోలు, వినియోగం చేయరాదు.
- ప్రభుత్వానికి, కార్యాలయానికి ప్రతినిధులుగా వ్యవహరించే ప్రభుత్వ ఉద్యోగులు ఆదర్శనీయమైన, నిరాడంబరమైన ఆహార్యాన్ని కలిగి ఉండాలి. తద్వారా ప్రజలలో గౌరవాన్ని పొందవచ్చు.
- కార్యాలయంలో పనిచేసే మహిళలపట్ల, అవసరార్థం కార్యాలయాలకు వచ్చే మహిళల పట్ల గౌరవంగా వ్యవహరించాలి.
- నిస్సహాయులైన, వైకల్యం గల వ్యక్తులను ఆదరించి, వారికి అందవలసిన సహాయాన్ని త్వరతగతిన అందించాలి.

పైన సూచించిన అంశాలలో ప్రభుత్వోద్యోగులు నైతికపరమైన నిబద్ధతను పాటించడం ద్వారా కార్యాలయంలోనే కాక వ్యక్తిగత జీవనంలోనూ గౌరవ మర్యాదలను పొందవచ్చు. అదేవిధంగా ప్రజలలో కూడా మంచి అధికారిగా మన్ననలు పొందవచ్చు.

మనలో కొందరు ఏ నిర్ణయం తీసుకుంటే ఏ ఇబ్బంది వస్తుందో అని ఏ విధమైన నిర్ణయాన్ని తీసుకోకుండా దాటివేత ధోరణిని అవలంభిస్తుంటారు. ఉదాహరణకు 'ఏరువాక కాలంలో ఖాళీగా వున్న ఒక రైతుని వరినాటు వేసావా" అని ఒక వ్యక్తి ప్రశ్నించగా ఆ రైతు "లేదు వరాలు సకాలంలో పడవేమో అన్న భయంతో నాటలేదు" అన్నాడు. మరలా ఆ వ్యక్తి "అయితే మొక్కజొన్న నాటావా? అని ప్రశ్నించాడు. దానికా రైతు "పొద పురుగుల బెడదకు భయపడి మొక్కజొన్న నాటలేదు" అన్నాడు. అందుకావ్యక్తి "మరి ఏం నాటావు?" అని ప్రశ్నించగా రైతు "ఏమీ నాటలేదు, నా పొలం మాత్రం క్షేమంగా ఉంది" అని బదులిచ్చాడు

పై కథ నుండి ఏ నిర్ణయాన్ని తీసుకుంటే ఏమవుతుందో అన్న భయంతో, అసలు ఏ పంటను నాటలేదు. మరి ఇలా అయితే అతని కుటుంబం ఎలా గడుస్తుంది? !!

**ఇదే తరహాలో మనలో కొందరు నిర్ణయాలు తీసుకోవడానికి భయపడుతుంటారు. కాని వారికి తెలియదు అలాంటి స్వభావం వలన వారి విధి నిర్వహణను వారు విస్మరిస్తున్నారని !**

**మరో ఉదాహరణ:**

తన తల్లిపై కోపము వచ్చి ఓ బాలుడు అలిగి ఇంటి నుండి వెళ్లిపోయి దగ్గరలోని ఒక కొండ ప్రాంతానికి చేరి "ఐ హేట్ యు" "ఐ హేట్ యు" అని తల్లిని తలచుకొని గట్టిగా అరిచాడు. ఐతే కొద్ది క్షణాల తర్వాత అవే మాటలు కొండల మధ్య ప్రతిధ్వనిస్తూ వినవచ్చాయి. దీనికి ఆశ్చర్యపోయిన ఆ బాలుడు వెంటనే తన తల్లి వద్దకు వెళ్ళి ఎందుకలా జరిగిందని ప్రశ్నించాడు. దానికి ఆమె మనం ప్రపంచానికి ఏమి పంచితే మనకు ప్రపంచం అదే తిరిగి ఇస్తుందని, నువ్వు కోపాన్ని చూపితే మనకు అదే ప్రతిగా వస్తుందని, కనుక నువ్వు ప్రేమగా ప్రపంచాన్ని చూస్తే ప్రపంచం కూడా నీ పట్ల ప్రేమ చూపుతుందని హితవు చెబుతుంది. తల్లి హితవు మేరకు ఆ బాలుడు మరలా ఆ కొండ ప్రాంతానికి వెళ్ళి "ఐ లవ్ యు", "ఐ లవ్ యు" అని గట్టిగా పలుకగా, కొద్ది క్షణాలకు అవే మాటలు అతనికి వినవచ్చాయి.

**మనం మన సహచరుల పట్ల ఆదరణ, గౌరవాన్ని కనపరచినపుడు మనకు కూడా అదే ఆదరణ,గౌరవం దక్కుతుందని అర్థం చేసుకోవచ్చు.**

**ఇంకొక ఉదాహరణ:**

ఒక విజయవంతమైన వ్యాపారవేత్తను "భిన్నమైన వ్యక్తిత్వాలు, వ్యవహార శైలి గల చాలా మంది ప్రజలు మరియు ఉద్యోగులతో మీరు ఎలా నెగ్గుకు వచ్చి వ్యాపారంలో విజయం సాధించారు" అని ప్రశ్నించగా దానికి సమాధానంగా ఆ వ్యాపారవేత్త మనుషుల్లో మంచితనాన్ని వెదకడం బంగారు గని నుండి బంగారాన్ని వేరు చేయడం వంటిదే, కొన్ని టన్నుల దుమ్ము-ధూళిని తొలగించినపుడే మనం ఒక ఔన్స్ బంగారం పొందగలం, నేను ఈ దుమ్ము ధూళి (చెడు) గురించి ఎక్కువగా ఆలోచించను, నా ఆలోచనంతా గని (మనిషి)లో దొరికే ఆ ఔన్స్ బంగారం (మంచితనం) మీదే ఉంటుంది, వ్యక్తులతో వ్యవహరించడం గని నుండి బంగారం తీయడం వంటిదే, మనం ఓర్పు, సహనంతో వేచి ఉండి పనిచేస్తే మనం తప్పక వారిలోని సమర్థత, మంచితనాన్ని తట్టిలేపగలం" అని బదులిచ్చారు.

మన విధి నిర్వహణలో భాగంగా అనేక మంది వ్యక్తులను కలుస్తుంటాం. ఈ క్రమంలో వారిలో కొందరు కొంత స్వార్థ ప్రయోజనాలను ఆశించి మనపై ఆరోపణలు చేస్తుండవచ్చు. ఐనప్పటికి మనం నిబద్ధత, నిష్పాక్షికత, అంకిత భావాలతో పని చేస్తుంటే, అతి కొద్ది కాలంలోనే వారు తమ అభిప్రాయాలను మార్చుకొని మనను గౌరవించడం జరుగుతుంది. ఎదుటివారిలోని ఈ మంచితనాన్ని నిద్రలేపడానికి మనం జీసస్, గాంధీజీ, మదర్ థెరీసాలు చూపిన సహనం, క్షమా భావాలను అలవర్చుకోవాలి.

# డిఆర్‌డిఎ, డ్వామా ఒకే గొడుగులోకి

జిల్లాల విభజన వల్ల ప్రజలకు అత్యంత సౌలభ్యం కలిగేలా సేవలు అందించాలని పంచాయతీరాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులు, సిబ్బందిని కోరారు. రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయంలో డిఆర్‌డిఎ, డామా, పిడిఏపిడి, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అధికారయంత్రాన్ని ప్రజలకు మరింత చేరువచేసే లక్ష్యంతోనే జిల్లా విభజనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ప్రస్తుతం కొన్ని గ్రామాలు జిల్లా కేంద్రాలకు 100, 200 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని, దీని వల్ల విభజన ఆవశ్యకతను సిఎం కెసిఆర్ గుర్తించారన్నారు. ఎప్పుడో జరగాల్సిన జిల్లాల విభజన ఇన్నాళ్లకు కార్యరూపం దాల్చిందన్నారు. కలెక్టర్, ఎస్‌పి లాంటి ఉన్నతాధికారులు చేరువలో ఉంటే తక్షణ, పారదర్శక పాలన ప్రజలకు అందుతుందన్నారు. కాలపరిమితి ముగిసే వరకు మండల, జిల్లాపరిషత్ వ్యవస్థలను యథావిధిగా కొనసాగించే అవకాశం ఉందన్నారు. డిఆర్‌డిఎ, డ్వామాలను ఒకే గొడుగుకిందకు తీసుకువచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. భౌగోళిక విస్తీర్ణం మారే అవకాశం లేదని, కొన్ని స్వల్ప మార్పులు మినహా, అధికారుల పనిలో పెద్దమార్పులు ఉండబోవని స్పెషల్ సిఎస్ ఎస్‌పిసింగ్ తెలిపారు. జిల్లాలు చిన్నగా మారనున్న నేపథ్యంలో కొత్త పోస్టుల అవసరం ఉండకపోవచ్చునన్నారు. జిల్లాల విభజనతో పింఛన్లు, ఉపాధిహామీ చెల్లింపుల విషయంలో ఒక్క రోజు కూడా ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశనం చేశారు. కొన్ని జిల్లాలో ఏసిపిడిలకు పర్యవేక్షణ బాధ్యత తాత్కాలికంగా అప్పగిస్తామని, అదే విధంగా కొత్త మండలాల్లోనూ అధికారులను ఇంఛార్జ్‌లుగా నియమించే ఆలోచన చేస్తున్నామని కమిషనర్ అనితా రామచంద్రన్ అన్నారు. కాగా జిల్లాల విభజన వల్ల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని, ప్రాజెక్టు డైరెక్టర్లు, ఏపిడిలు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఒక్కో రోజు 500 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుందన్నారు. దీని వల్ల సమయం వృధా అవుతుందని ఈ సందర్భంగా తమ అనుభవాలను వివరించారు. ఈ సమావేశంలో సెర్ప్ సీఈఓ పౌసమిబసు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగాధిపతి సత్యనారాయణ రెడ్డిలు పాల్గొన్నారు.

– వార్తాంశం



# జాతీయ పోషణ వారోత్సవాలు - 2016

## "జీవిత చక్రంలోని వివిధ దశలలో సరైన పోషకాహారం"

**జా**తీయ పోషకాహార వారోత్సవాలు ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 1-7వ తారీకు వరకు దేశవ్యాప్తంగా నిర్వహించబడుచున్నవి కార్యక్రమము మొదటిగా 1982వ సం॥లో ఆహార మరియు పోషణ విషయాల బోర్డు ఆద్వర్యంలో ప్రారంభించబడినది. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం ఒక కొత్త సందేశంతో ఈ వారోత్సవాలు జరుపబడుచున్నవి. ఈ సంవత్సరం తీసుకున్న సందేశం " జీవిత చక్రంలోని వివిద దశలలో సరైన పోషకాహారం"

మన ప్రజానీకంలో ఆహారం ఆరోగ్యాలకు గల దగ్గర సంబంధాన్ని శరీర పోషణ యొక్క ప్రాముక్యాన్ని ప్రచారం చేయడం ప్రజానీకాన్ని ఆరోగ్య వంతులుగా తెలివి గల వారిగా తయారు చేయడం ఉత్పాదక సామర్ధ్యాన్ని పెంచడం తద్వారా దేశాభివృద్ధికి పాటు పడడం ఈ ఉత్సవాల యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

బలంగా ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారాన్ని తీసుకోవాలన్నిది మనందరికీ తెలుసు. కానీ పుష్టినిచ్చే ఆహారాన్ని తయారు చేసుకోవడంలో మెళకువలు, వివిద దశలలో శరీర పోషణ అవసరాల మీద మనం అవగాహన కలిగి ఉంటే పోషకాహర లోహ అనే సమస్య నుండి బయటపడవచ్చు.

మన ప్రజానీకంలో కొంతమంది శరీర అవసరాలకు కావలసిన పోషకాలు అందక వివిధరకాల రుగ్మతలకు గురి అవుతున్నారు. ఈ పరిస్థితిని అధిక పోషణ అంటాము. కుపోషణ మరియూ అధిక పోషణ ఏది ఉన్నా దానిని లోప పోషణగా గ్రహించాలి.

మనం తీసుకునే ఆహారంలో ఉండే పోషకాలు ప్రధానంగా 4 రకాలు అవి పిండి పదార్థలు మాంసకృతులు విటమిన్లు మరియు ఖనిజ లవణాలు ఇవి మన శరీరానికి ప్రధానంగా 3 రకాలుగా ఉపయోగ పడతాయి. అవి 1) మన శరీరానికి కావలసిన శక్తిని అందించడం 2) మన శరీర నిర్మణానికి ఉపయోగపడడం. 3) మన శరీరాన్ని రక్షించడం.

మన శరీరానికి శక్తి ప్రధానంగా ధాన్యాలు, చిరుదాన్యాలు దుంపలు క్రొవ్వులు మరియు చక్కెరల ద్వారా లభిస్తుంది. మనం దాన్యాలు చిరు ధాన్యాలు సమృద్ధిగా దుంపకూరలు మధ్యస్తంగా, నూనెలు మరియు చక్కెర తక్కువగా తినవలసిన అవసరం ఉన్నది. మన శరీర నిర్మాణమునకు మాంసకృతులు ఉపయోగపడతాయి. ఇవి మన శరీరానికి జంతువులనుండి లభించే ఆహార పదార్థలైన పాలు, గ్రుడ్లు, చేపలు, మాంసాలలోను మరియు పప్పుదినుసులలోను అధికంగా లభిస్తాయి.

మన శరీర రక్షణకు విటమిన్లు మరియూ ఖనిజలవణాలు అవసరం. ఇవి ప్రధానంగా ఆకుకూరలు, కూరగాయలు మరియు పండ్ల నుండి మన శరీరానికి లభిస్తాయి. ఇప్పుడు మనం వివిధ దశలలో ఎటువంటి పోషకాహారం తీసుకోవాలో క్లుప్తంగా తెలుసుకుందాం.

శిశువులు మరియు చంటిపిల్లలు సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతీ ఒక్కరూ ఈ క్రింద మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి అవి.

1) బిడ్డ పుట్టిన వెంటనే ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా లేదా కనీసం గంటలోపల తల్లిపాలు ప్రారంభించాలి.

2) మొదటి ఆరు నెలల కాలం పాటు కేవలం తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి.

3) 6 నెలలు నిండిన తరువాత తల్లి పాలతో పాటు సురక్షితమైన ఇంటిలో తయారు చేసిన అదనపు ఆహారం ఇవ్వాలి.

4) తల్లిపాలు కనీసం 2 సంవత్సరాల వయస్సు వరకూ వీలైతే ఇంకా ఎక్కువ కాలం ఇప్పించాలి.

ఆరు నెలల తదుపరి ఇచ్చే అనుభంద ఆహారం మరీ పలుచగాను, మరీ గటిగానూ కాకుండా జావలాగా ఉండాలి. 6 నెలల నుండి 8 నెలల వరకు తల్లి పాలతో పాటుగా రోజులో కనీసం 3 సార్లు తినిపించాలి. 8 నెలల నుండి 12 నెలల వరకు తల్లిపాలతో పాటుగా రోజులో 5 సార్లు తినిపించాలి. 12 నెలల తదుపరి ఇంట్లో అందరూ తినే ఆహారాన్ని కొంచెం మెత్తగా చేసి పిల్లలకు తినిపించేటప్పుడు తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తినిపించడం అలవాటు చేసుకోవాలి. 2 సంవత్సరాల వయస్సు వరకు తప్పకుండా తల్లిపాలు ఇవ్వాలి.



2 సంవత్సరాల వయస్సు నుండి 17 సంవత్సరాల వయస్సు వరకు పిల్లల ఆహారంలో వారి ఎదుగుదలకు అవసరమైన మాంసకృత్తులు అధికంగా ఉండే గ్రుడ్లు, పాలు, పప్పులు వారి ఆహారంలో ప్రతీ రోజు ఉండేటట్లు చూసుకోవాలి. ఇంట్లో మాంసాహారం వండినట్లయితే పిల్లలకు ఖచ్చితంగా తినిపించాలి.

పిల్లలు పుట్టినపుడే తక్కువ బరువు లేకుండా ఉండాలన్నా తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉండాలన్నా గర్భవతి మంచి పోషకాహారం తీసుకోవాలి. గర్భవతి సాధారణంగా ఉన్నపుడు కంటే కనీసం 1/4 వంతు ఆహారాన్ని అధనంగా తీసుకోవాలి. గర్భవతి తన గర్భస్త కాలంలో కనీసం 10 నుంచి 12 కిలోల బరువు పెరగ వలసి ఉంటుంది. గర్భవతి తన ఆహారంలో ఆకు కూరలు పండ్లు తప్పక తీసుకోవాలి. మాంసకృత్తులు అధికంగా ఉండే గ్రుడ్లు పాలు పప్పులు ప్రతీరోజు తన ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. పాలిచ్చేతల్లుఉ అదనంగా ఆహారం తీసుకోవలసి ఉంటుంది. వారి ఆహారంలోమాంసకృత్తులు అధికంగా ఉండే గ్రుడ్లు పాలు పప్పులు ప్రతీరోజు తీసుకోవలసి ఉంటుంది.

అదే విధంగా ప్రతీ ఒక్కరు వంట చేసే సమయంలో పోషకాలను కోల్పోకుండా చూసుకోవాలి. ముఖ్యంగా గంజి పారబోయడం. ఆకుకూరలు మరియు కూరగాయలను కోసిన తరువాత కడగడం వంటివి చేయరాదు. కూరగాయలను మరీ సన్నగా కాకుండా కొంచెం మధ్యస్థంగా వండేటప్పుడు కోసినట్లైతే ఎక్కువ పోషకాలు కోల్పోకుండా ఉంటాయి.

అందరూ తమ ఆహారంలో ప్రతీరోజు తాజా పండ్లను తప్పకుండా తీసుకోవాలి. చవకగా దొరికే బొప్పాయి. జామ, సీతాఫలం, మామిడి, పైన్‌యాపిల్, రేగు, బత్తాయి, కమలా మొదలగు పండ్లలో విలువైన పోషకాలు లభిస్తాయి. ఇవి మన శరీరంలో రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా అనేక వ్యాధుల నుండి మన శరీరాన్ని రక్షిస్తాయి.


పిల్లలకు ఇచ్చే చిరుతిండ్లు మన సాంప్రదాయ వంటలైన బొబ్బరివుండలు, నువ్వుల ఉండలు, సున్ని ఉండలు పల్లీల పాకం మొదలుగునవి పిల్లలకు మంచి పోషకాలను అందిస్తాయి అదే విధంగా మొలకెత్తిన గింజలు కూడా ఖచ్చితంగా మన రోజువారీ ఆహారంలో భాగంగా చేసుకోవాలి.

ప్రతీ ఒక్కరు ఒక్క రోజుకు ఉప్పును 5 గ్రాముల లోపు నూనె మరియు కొవ్వును 20 గ్రాములలోపు చక్కెరలను 30 గ్రాములలోపు వాడవలయును. ఆకుకూరలు కూరగాయలు మరియు పండ్లను అధికంగా వాడవలెను.

ఆరోగ్య రక్షణకు ఎటువంటి ఆహార పదార్థులు అవసరం ? చౌకగా దొరికే పదార్థులు వాడి పుష్టినిచ్చే ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చు? ఈ విషయాలను సమగ్రంగా తెలుసుకుంటే లోప పోషణ సమస్యలను మనము సులభంగా పరిష్కరించు కోవచ్చును.

**జి.రామేశ్వర్‌రావు**

**జిల్లా శిక్షణ మేనేజరు, రంగారెడ్డి జిల్లా**




## పేద మహిళలకు ఊతం

# ఉజ్వల యోజన పథకం

భారతదేశంలో పేదలకు వంట గ్యాస్ (ఎల్.పి.జి.) పరిమితంగా లభిస్తుంది. ఎల్.పి.జి. సిలిండర్లు ఎక్కువగా నగరాల్లో మరియు పట్టణ ప్రాంతాల్లోని మధ్యతరగతి మరియు సంపన్న గృహాల్లో వారు మాత్రమే ఉపయోగిస్తున్నారు. కాని గ్రామాల్లోని నిరుపేదలకు ఇంకా ఎల్.పి.జి. గ్యాస్ కనెక్షన్‌లు ఇప్పటికి లేవు అనడంలో ఎటువంటి సందేహం లేదు. నిరుపేద కుటుంబాలకు ఎల్.పి.జి. గ్యాస్ కనెక్షన్లు అందించడం వలన దేశంలో వంట గ్యాస్ సార్వత్రిక వ్యాప్తి జరుగుతుంది. ఫలితంగా మహిళలకు శక్తిని కల్పించడంతో పాటు వారి ఆరోగ్యాన్ని రక్షిస్తుంది. అలాగే వంట పనిని వంట సమయాన్ని తగ్గిస్తుంది.

పై కారణాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం నిరుపేదలకు ఉపయోగపడి వారి జీవితాల్లో వెలుగులు నింపే లక్ష్యంతో ఓ కొత్త వినూత్న పథకానికి శ్రీకారం చుట్టింది. అదే ప్రధానమంత్రి 'ఉజ్వల యోజన పథకం'. ఈ పథకాన్ని భారత ప్రధాని శ్రీ నరేంద్రమోదీ ఉత్తరప్రదేశ్‌లోని బాలియాలో ప్రారంభించారు. ఈ పథకం ద్వారా దారిద్రరేఖకు (జి.పి.ఎల్) దిగువున ఉన్న కుటుంబాలకు చెందిన మహిళలకు ఉచితంగా ఎల్.పి.జి. కనెక్షన్లు కల్పించడం జరుగుతుంది.

8 కోట్ల వ్యయంతో దేశవ్యాప్తంగా 5 కోట్ల కుటుంబాలకు ఈ పథకం ద్వారా లబ్ధిచేకూరేలా ప్రభుత్వం ప్రణాళికలు తయారుచేసింది. సంపన్నులు గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదుకునేలా కేంద్ర ప్రభుత్వం 'గివ్ ఇట్ అప్' అనే కార్యక్రమం అమలు ప్రారంభం తరువాత ఆ అవగాహన ద్వారా దేశవ్యాప్తంగా 1.13 కోట్ల మంది గ్యాస్ సబ్సిడీని స్వచ్ఛందంగా వదులుకుని మార్కెట్ రేటుకే గ్యాస్ కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వానికి 5 వేల కోట్ల గ్యాస్ సబ్సిడీ భారం తగ్గిపోయింది. ఆ రూపంలో ఆదా అయిన సొమ్ముతో ఈ పథకానికి శ్రీకారం చుట్టింది భారత ప్రభుత్వం.

మహిళలు శిలజ ఇంధనాలు ఆధారంగా చేసే వంటకు సంబంధించి తీవ్రమైన ఆరోగ్య ప్రమాదాలు వెలువడుతున్నాయి. భారతదేశంలో వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రకారం సుమారు 5 లక్షల మరణాలు ఈ రకమైన ఇంధనాలు వాడటం వల్ల జరుగుతున్నాయి. గుండెజబ్బులు, హర్ట్‌స్ట్రోక్, ఊపిరితిత్తుల క్యాన్సర్, చిన్నారుల్లో శ్వాసకోశ వ్యాధులు మొదలగునవి వస్తున్నాయి.

**ఈ పథకం యొక్క లక్ష్యాలు:**

- ఈ పథకం ద్వారా మహిళ సాధికారతను ప్రోత్సహించడం.
- గ్రామీణ ప్రాంతాల్లో వంట కొరకు శిలజ ఇంధనాలు వాడటం వల్ల వచ్చే వాయు కాలుష్యాన్ని తగ్గించడం.
- వాయు కాలుష్యం ద్వారా వచ్చే పొగ ద్వారా పర్యావరణం దెబ్బతిని వ్యక్తులకు అపారమైన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి వాటిని నివారించడం.
- మహిళలకు వంట చేసే సమయం తగ్గించడం.

**ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం ద్వారా లబ్ధిపొందాలంటే కావలసిన అర్హతలు:**

- 18 సంllలు నిండిన మహిళ దరఖాస్తుదారులై ఉండాలి.
- సామాజిక ఆర్థిక కులగణన 2011 డెటా జాబితాలో నమోదై ఉండాలి.

- మహిళా దరఖాస్తుదారు దేశవ్యాప్తంగా ఏదో ఒక జాతీయ బ్యాంకులో ఖాతా తెరిచి ఉండాలి.
- దరఖాస్తుదారు పేరు మీద గాని లేదా ఆ గృహంలో నివసించే ఏ వ్యక్తికీ ఇప్పటికి ఎల్.పి.జి కనెక్షన్ ఉండకూడదు.
- దరఖాస్తుదారు బి.పి.ఎల్ కుటుంబానికి చెందినవారై ఉండాలి.

**ప్రధానమంత్రి ఉజ్వల యోజన పథకం లబ్ధిపొందాలంటే దరఖాస్తుతో పాటు కొన్ని పత్రాలు జతచేయవలసి ఉంటుంది.**

- బి.పి.ఎల్ సర్టిఫికేట్
- బి.పి.ఎల్ రేషన్‌కార్డు
- ఒక ఫోటో ఐడి (ఆధార్‌కార్డు లేదా ఓటరు ఐడి కార్డు)
- ఇటీవల తీసిన పాస్‌పోర్ట్ సైజు ఫోటో

బి.పి.ఎల్. కుటుంబాలకు చెందిన మహిళ దరఖాస్తుదారులు దరఖాస్తు పత్రం కోసం దేశవ్యాప్తంగా స్థానిక ఎల్.పి.జి కార్యాలయాలను సంప్రదించవచ్చు. దరఖాస్తు ఉచితంగా లభిస్తుంది. లభించిన దరఖాస్తును బ్యాంకు ఖాతా నెంబరు, ఆధార్‌కార్డు నెంబరు మరియు దరఖాస్తులో అడిగిన ప్రాథమిక సమాచారం, అభ్యర్థులకు ఏ రకమైన సిలిండర్ కావాలో (14.2కిలో లేదా 5 కిలో) సంబంధిత సమాచారం దరఖాస్తులో నింపవలసి ఉంటుంది. సమాచారంతో నింపిన దరఖాస్తును స్థానిక ఎల్.పి.జి కార్యాలయంలో సమర్పించవచ్చు.

దరఖాస్తుదారు తమ దరఖాస్తును ఎల్.పి.జి. అధికారులకు సమర్పించిన అనంతరం ఎల్.పి.జి ఫీల్డ్ అధికారులు సంబంధిత దరఖాస్తును పరిశీలిస్తారు. దరఖాస్తుదారు 2011 సామాజిక, ఆర్థిక కులగణన ప్రకారం డెటా బెస్‌లో పేరు నమోదు ఉందా లేదా బి.పి.ఎల్ కుటుంబానికి చెందిన వారా కాదా అని, ఆమెకు 18 సం॥లు నిండిన వారా లేదా తెలుసుకుంటారు. అనంతరం దరఖాస్తుదారుని పేరు ఓ.ఎమ్.సి. వెబ్ పోర్టల్‌తో లాగిన్ ద్వారా వివరాలను (పేరు, చిరునామా మొదలగునవి) నమోదు చేస్తారు. తదుపరి కొత్త కనెక్షన్ ఇవ్వడానికి ఇతర చర్యలు చేపడతారు. ఈ విషయంలో భాగంగా ఎస్సీ, ఎస్టీ మరియు బలహీన వర్గాలకు చెందిన వారికి ప్రాధాన్యత కల్పించడం జరుగుతుంది.

పైన చెప్పిన వివిధ దశలు పూర్తి అయిన తర్వాత అర్హత గల లబ్ధిదారులకు కనెక్షన్ జారి చేయబడుతుంది. కనెక్షన్ ఖర్చు మొత్తం ప్రభుత్వం భరించినా వంట స్టవ్ మరియు సిలిండర్ రిఫిల్ ఖర్చును లబ్ధిదారు భరించవలసి వుంటుంది. అవసరమైతే లబ్ధిదారుడు ఇ.ఎమ్.ఐ. ద్వారా కట్టుకునే అవకాశం ఓ.ఎమ్.సి. మహిళలకు కల్పించడం జరుగుతుంది. అయితే లబ్ధిదారుని స్టవ్ మరియు రిఫిల్ ఖర్చులకు సహాయపడాలనుకునే వ్యక్తులు గాని, స్వచ్ఛంద సంస్థలు గానీ ఓ.ఎమ్.సి.తో సమన్వయం కావలసి ఉంటుంది. ఎందుకనగా ఓ.ఎమ్.సి. (ఆయిల్ మార్కెటింగ్ సంస్థ)కు మాత్రమే ఈ పథకం క్రింద పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ అనుమతి మాత్రమే ఉంది. కనుక ఈ వ్యవహారం మొత్తం పి.ఎమ్.యు.వై.(ప్రధానమంత్రి ఉజ్వల యోజన) క్రింద జరగాలి. ఓ.ఎమ్.సి. బి.పి.ఎల్ కుటుంబాలకు కనెక్షన్ విడుదల కోసం వివిధ ప్రదేశాల్లో మేళాలు నిర్వహిస్తాయి. ఇది ప్రజప్రతినిధులు మరియు ఆ ప్రాంత ప్రముఖ వ్యక్తుల సమక్షంలో జరుగుతుంది.

అత్యంత పేద కుటుంబాలకు చెందిన కోట్లాది మహిళలకు ఎల్.పి.జి. కనెక్షన్‌లను సమకూర్చితే దేశంలో అందిరినీ వంటగ్యాస్ సదుపాయం పరిధిలోకి తీసుకువచ్చినట్లవుతుంది. ఈ పథకం ముఖ్యంగా మహిళల సాధికారతను కల్పించడంతో పాటు వారి ఆరోగ్యాన్ని పరిరక్షిస్తుంది. అంతే కాదు బండచాకిరి, వంట కోసం ఎక్కువ సమయాన్ని వెచ్చించడాన్ని తగ్గిస్తుంది. దాంతో వంటగ్యాస్ సరఫరా విషయంలో గ్రామీణ యువత పాలుపంచుకునే అవకాశాలను కల్పించి వారి ఉపాధికి బాటవేస్తుంది.

**– ఎం.ప్రదీప్‌కుమార్**





# అక్షరాస్యత వృద్ధికి అవరోధం కాని పేదరికం

పేదరికం ఒక సామాజిక, ఆర్థిక సమస్య ఇది దీర్ఘకాలిక సామాజిక సమస్యగా ఉంది. సమాజంలో ఒక వర్గం కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని ఎదుర్కుంటుంది. ఓ వ్యక్తి తీసుకునే పౌష్టికాహారం(కేలరీలు) ఆధారంగా గతంలో దారిద్ర్యానికి నిర్వచనం ఇచ్చారు. దాని ప్రకారం 2000 మార్చి ఒకటి నాటికి దేశంలో దారిద్ర్యరేఖకు దిగువన నివసిస్తున్నవారు 27.5 శాతం, బీపీఎల్ కుటుంబాలు 6.5 కోట్లు, టెండూల్కర్ నివేదిక ప్రకారమైతే... ఆహారంతో పాటు విద్య ఆరోగ్యంపై చేసే ఖర్చును కూడా పరిగణనలోకి తీసుకుంటారు. దేశ మొత్తం జనాభాలో 37.2 శాతం మంది నిరుపేదలు, బీపీఎల్ కుటుంబాలు 8.1 కోట్లు, ఆహార భద్రతా చట్టం ప్రకారం బీపీఎల్ కుటుంబానికి ప్రతినెలా కేజీ రూ.8 వంతున 25 కేజీల ఆహార ధాన్యాలు సరఫరా చేస్తారు. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో పేద ప్రజలున్న ఇండియాలో, మిగతా దేశాలతో పోలిస్తే పేదరికం రేటు అతి తక్కువగా ఉందని వరల్డ్ బ్యాంక్ తాజా నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక వివరాల ప్రకారం, 2015లో ప్రపంచంలో కడు దార్రిద్యాన్ని అనుభవిస్తున్న వారి సంఖ్య 10 శాతం కన్నా దిగువకు పడిపోయింది. అత్యధికంగా పేదలున్న దేశాల్లో పేదరికం రేటు ఇండియాలో గణనీయంగా తగ్గుతోందని బ్యాంకు వెల్లడించింది. 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు ఇండియా ఎంతో సహకరిస్తోందని, తాము అంచనా వేస్తున్న లక్ష్యాలకన్నా ఇండియాలో పేదరికం తక్కువగానే ఉండివుండవచ్చని అభిప్రాయపడింది. అల్పాదాయ దేశాల్లో పేదరికం రేటు 43 శాతంగా, మధ్యాదాయ దేశాల్లో 19 శాతంగా ఉందని తెలిపింది. 2012లో అల్పాదాల దేశాలుగా ఉన్న చైనా, ఇండియా, ఇండోనేషియా, నైజీరియాలు 2015లో దిగువ మధ్యాదాయ దేశాల జాబితాలోకి చేరాయని వివరించింది. ఈ దేశాల్లో ఇండియాలోనే పేదరికం రేటు తక్కువగా ఉందని తెలిపింది.

గత కొద్ది సంవత్సరాలుగా విద్యా వ్యవస్థతో పాటు ఆరోగ్యం, సామాజిక భద్రత తదితరాంశాలు పేదరికాన్ని పార్రదోలేందుకు సహకరిస్తున్నాయని వివరించింది.

**విద్యారంగానికి కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు:**

- కేంద్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులను గతేడాది కంటే 2 శాతం తగ్గించింది. తాజా బడ్జెట్‌లో పాఠశాల, ఉన్నత విద్యకు కలిపి మొత్తం రూ. 69,074 కోట్లు కేటాయించారు. గతేడాది ఈ రంగానికి కేటాయించిన నిధులు సవరించిన మొత్తం రూ.70,505 కోట్ల కంటే ఇది 2.02 శాతం తక్కువ.
- 2015-16 బడ్జెట్‌లో పాఠశాల విద్యకు గతేడాది కంటే 9.79 శాతం నిధులను తగ్గించి రూ. 42,219 కోట్లు కేటాయించారు. ఉన్నత విద్యకు ప్రాధాన్యమిచ్చి గతేడాది కంటే 13.31% పెంచి రూ.26,855 కోట్లు కేటాయించారు.
- విద్యార్థులకు అందిస్తున్న ఉపకార వేతనాలు, "ప్రధానమంత్రి విద్యాలక్ష్మి కార్యక్రమం" ద్వారా అమలు చేస్తున్న విద్యారుణ పథకాల నిర్వహణ, పర్యవేక్షణ కోసం నియంత్రణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని జైట్లీ ప్రతిపాదించారు.
- ప్రతి విద్యార్థికీ 5 కి.మీ. పరిధిలో సీనియర్ సెకండరీ పాఠశాలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు 80 వేలకు పైగా సెకండరీ పాఠశాలలను, 75 వేల జూనియర్/మాధ్యమిక పాఠశాలల్ని సీనియర్ సెకండరీ స్థాయికి పెంపు.

**భారతదేశంలో అక్షరాస్యత వృద్ధి :** భారతదేశంలో అక్షరాస్యత సామాజిక-ఆర్థిక పురోగతికి కీలకంగా ఉంది, భారత అక్షరాస్యత రేటు 2007లో 68%నికి పెరిగింది, 1947లో బ్రిటీష్ పాలన ముగిసిన సమయంలో దేశ అక్షరాస్యత రేటు 12% మాత్రమే ఉంది. నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్ (NSSO) జూన్ 2008లో నిర్వహించిన తాజా అధ్యయనం ప్రకారం, 7 మరియు అంతకంటే ఎక్కువ వయస్సుగల జనాభాలో అక్షరాస్యత రేటు 72% వద్ద ఉండగా, వయోజనుల్లో (15 మరియు అంతకంటే ఎక్కువ వయస్సుగలవారు) అక్షరాస్యత రేటు 66% వద్ద ఉంది. ఇదిలా ఉంటే, భారత అక్షరాస్యత రేటు, ఐదురెట్లు కంటే ఎక్కువ వృద్ధి సాధించినప్పటికీ, ప్రపంచ అక్షరాస్యత సగటు 84%తో పోలిస్తే ఇప్పటికీ తక్కువగానే ఉంది, ప్రపంచంలో భారతదేశం ప్రస్తుతం అతిపెద్ద నిరక్షరాస్య జనాభా ఉన్న దేశంగా గుర్తించబడుతుంది. అనేక ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేసినప్పటికీ, భారతదేశ అక్షరాస్యత శాతం మందకొడిగానే వృద్ధి చెందింది. 1990 నాటి ఒక అధ్యయనం, అప్పటి పురోగతి రేటుతో ప్రపంచవ్యాప్త అక్షరాస్యత స్థాయి సాధించడానికి భారతదేశానికి 2060 వరకు సమయం పడుతుందని సూచించింది. ఇదిలా ఉంటే, 2001 జనాభా లెక్కలు 1991-2001 దశాబ్దంలో 12.63% అక్షరాస్యత వృద్ధి నమోదయినట్లు సూచించింది, ఇది అత్యంత వేగతంతమైన వృద్ధిగా రికార్డు సృష్టించింది.

**విద్యా హక్కు ఒక ప్రాథమిక హక్కు :** విద్యా హక్కు ఒక ప్రాథమిక హక్కుగా ఉంది, (యునెస్కో) అందరికీ విద్యను లక్ష్యంగా పెట్టుకుంది. అరబ్ దేశాలు మరియు ఉప-సహారా ప్రాంత ఆఫ్రికా దేశాలతో కలిసి భారతదేశం ప్రచార స్థాయి 75% కంటే తక్కువ అక్షరాస్యతను కలిగివున్నాయి, ఈ స్థాయిని సాధించేందుకు చర్యలు కొనసాగుతున్నాయి. కనీసం ప్రచార అక్షరాస్యత స్థాయిని సాధించేందుకు ఉద్దేశించిన కార్యక్రమం దేశంలో ఎన్నడూ చూడని పౌర మరియు సైనిక సన్నాహాలు కంటే భారీస్థాయిలో జరుగుతుంది. అంతర్జాతీయ అక్షరాస్యత దినం ప్రతి ఏటా సెప్టెంబరు 8న జరుపుకుంటున్నారు, వ్యక్తులకు,

సమూహాలకు మరియు సంఘాలకు అక్షరాస్యత యొక్క అవసరాన్ని గుర్తిసూ దీనిని నిర్వహిస్తున్నారు.

**ప్రభుత్వ పథకాలు : జాతీయ అక్షరాస్యత కార్యక్రమం**

నేషనల్ లిటరసీ మిషన్ (జాతీయ అక్షరాస్యత కార్యక్రమం) 1988లో ప్రారంభమైంది, 2007నాటికి దేశంలో 75% అక్షరాస్యత రేటును సాధించాలనే లక్ష్యంగా దీనిని ఏర్పాటు చేశారు. ఇది 15 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సున్న నిరక్షరాస్యులకు ప్రయోజనాత్మక అక్షరాస్యతను అందిస్తుంది. సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమం నిరక్షరాస్యతను నిర్మూలించేందుకు ప్రధాన వ్యూహంగా ఉంది. నిరంతర విద్యా పథకం సంపూర్ణ అక్షరాస్యత మరియు అక్షరాస్యతోత్తర కార్యక్రమాల యొక్క చర్యలకు ఒక అభ్యాస అవిభక్తతను అందిస్తుంది.

**సర్వ శిక్షా అభియాన్** : సర్వశిక్షా అభియాన్ (సంపూర్ణ అక్షరాస్యత కార్యక్రమాన్ని హిందీలో ఈ పేరుతో పిలుస్తారు) 2001లో ప్రారంభమైంది, 6-14 సంవత్సరాల మధ్య ఉన్న బాలలందరూ పాఠశాలకు వెళ్లేలా చేసేందుకు మరియు 2010నాటికి ఎనిమిదేళ్ల పాఠశాల విద్యను పూర్తి చేసేలా చర్యలు చేపట్టేందుకు ఇది ఉద్దేశించబడింది. ఈ పథకంలో ముఖ్యమైన భాగం ఏమిటంటే విద్యా హామీ పథకం మరియు ప్రత్యామ్నాయ మరియు వినూత్న విద్య, ఒక కిలోమీటరు వ్యాసార్థంలో పాఠశాల అందుబాటులో లేని బాలలకు ఇది ప్రధానంగా ఉద్దేశించబడింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమం 1994లో ప్రారంభమైంది, 2005నాటికి దీని పరిధిలో 160,000 కొత్త పాఠశాలలు ప్రారంభించారు, వీటిలో సుమారు 84,000 ప్రత్యామ్నాయ పాఠశాలలు ఉన్నాయి. మధ్యాహ్న భోజన పథకం మార్చి 1, 2002న 6-14 సంవత్సరాల నడుమ ఉన్న సుమారుగా 205 మిలియన్ల మంది బాలల్లో 82.5% మంది పాఠశాలల్లో విద్యార్థులకు నమోదు చేయబడ్డారు. అయితే, 2002-03లో ప్రాథమిక స్థాయిలోనే పాఠశాలకు వెళ్లడం మానుకున్న విద్యార్థుల రేటు 84.9% వద్ద ఉండగా, ఉన్నత ప్రాథమిక స్థాయిలో 52.8% వద్ద ఉంది. ఎక్కువ సంఖ్యలో విద్యార్థులు చదువు మానుకోవడం ప్రధాన ఆందోళనకర అంశమైంది. పాఠశాలలకు వెళ్లేలా బాలలను ఆకర్షించేలా చేయడానికి చేపట్టిన అత్యంత ప్రసిద్ధ పథకాల్లో ఒకటి మధ్యాహ్నభోజన పథకం, దీనిని 1995లో ప్రారంభించారు. వివిధ విజయ స్థాయిలతో అనేక ఇతర ప్రత్యేక కార్యక్రమాలు కూడా ఉన్నాయి.

**అక్షరాస్యత నిర్వచనంలో మహిళల సమానత్వం** : ఐక్యరాజ్యసమితి విద్యా, శాస్త్రీయ మరియు సాంస్కృతిక సంస్థ (UNESCO-యునెస్కో) అక్షరాస్యతకు ఒక నిర్వచనాన్ని తయారు చేసింది, వివిధ రకాల సందర్భాలకు సంబంధించిన ముద్రించిన మరియు రాసిన సమాచారాన్ని గుర్తించే, అర్థం చేసుకొనే, వివరించే, సృష్టించే, వ్యక్తీకరించే, గణించే మరియు ఉపయోగించే సామర్థ్యాన్ని అక్షరాస్యత నిర్వచనంగా యునెస్కో సూచించింది. వ్యక్తులు వారి లక్ష్యాలను సాధించేందుకు, వారి పరిజ్ఞానాన్ని మరియు సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకునేందుకు మరియు తమ సమూహంలో మరియు విస్తృత సమాజంలో పూర్తిస్థాయిలో పాల్గొనేందుకు వీలు కల్పించే నిరంతర అభ్యాసం అక్షరాస్యతలో భాగంగా ఉంటుంది. చదవడానికి, రాయడానికి మరియు లెక్కించడానికి సంబంధించిన నైపుణ్యాలను పొందడం మరియు వాటిని దైనందిన జీవితాల్లో వర్తింపజేయగల సామర్థ్యాన్ని జాతీయ అక్షరాస్యత కార్యక్రమం అక్షరాస్యత నిర్వచనంగా సూచించింది.

- చదవడం, రాయడం మరియు లెక్కించడంలో ఆత్మ-విశ్వాసం,
- దారిద్ర్యానికి కారణాలపై మరియు అభివృద్ధి ప్రక్రియలో భాగస్వాములు కావడం ద్వారా తమ పరిస్థితిని సరిదిద్దుకోవడంవైపు ముందుకెళ్లే సామర్థ్యంపై అవగాహన కల్పించడం,
- ఆర్థిక స్థితి మరియు సాధారణ సంక్షేమాన్ని మెరుగుపరిచేందుకు నైపుణ్యాలు పొందడం,
- జాతీయ సమగ్రత, పర్యావరణ పరిరక్షణ, మహిళల సమానత్వం, వంటి విలువలను పొందడం, చిన్న కుటుంబాల నిబంధనల ఆచరణ, ప్రయోజనాత్మక అక్షరాస్యత సాధనలో భాగంగా ఉన్నాయి.
- భారత జనాభా లెక్కల్లో 1991 నుంచి ఆచరణలో ఉన్న అక్షరాస్యత నిర్వచనం ఈ కింది విధంగా ఉంది:
- అక్షరాస్యత రేటు : ఒక నిర్దిష్ట సమయంలో ఒక ప్రదేశంలో అర్థవంతంగా చదవడం మరియు రాయడం తెలిసిన ఏడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సున్న మొత్తం జనాభా శాతం. ఇక్కడ విభాజకం ఏడేళ్లు లేదా అంతకంటే ఎక్కువ వయస్సున్న జనాభా.

స్త్రీ అభ్యుదయానికి పునాది విద్య. నాడు విద్యను స్త్రీలు అభ్యసించే అవకాశం లేకపోవడమే ప్రధానసమస్య. పురుషులు నేర్చుకునే విద్యను కాకుండా పతివ్రతాధర్మాలు బోధించే విద్యను మాత్రమే నేర్చుకోవాలి. అది కూడా పురుషులు నేర్చుకునే విధానంలో కాదు, ఇంటిపట్టున ఉండి చదువుకోవాలి. ఆవిధంగానే చాలామంది గృహిణులు, బాలికలు ఆరోజుల్లో చదువుకునేవారు. పురాణాలు, ఇతర భక్తి రచనలు చదవడం ప్రారంభించారు. అంతేగాకుండా కుటుంబంలో సోదరులు చదువుకునేటప్పుడు వాటిని విని నేర్చుకునేవారు. అది కూడా విద్యావంతుల కుటుంబాల్లో మాత్రమే ఈ తరహా స్త్రీల చదువు కనిపించేది. మిగతా కుటుంబాల్లో స్త్రీలకు ఆ చదువు ఉండేది కాదు. ఈ విధంగా భక్తి రచనలు, పురాణాలు చదివిన స్త్రీలు వాటి ఆధారంగానే మెలమెల్లగా రచనలు చేయడం కూడా ప్రారంభించారు. ఆరోజుల్లో ప్రధానంగా కనిపించే సమస్యల పై రచనలు చేయడం మొదలుపెట్టారు. బాల్యవివాహాలు, కన్యాశుల్కం, వేశ్యావృత్తి మొదలైనవి. అంతేగాకుండా చదువుకున్న స్త్రీలు చదువులేని స్త్రీల పరిస్థితి గూర్చి రాసేవారు. ఒకరకంగా వారిలో చైతన్యాన్ని కలగజేసేవిధంగా రచనలుండేవి. రచనలే కాకుండా పత్రికలు, సంస్థలను నెలకొల్పారు. వాటిల్లో స్త్రీ చైతన్యానికి సంబంధించిన చర్చలు చేసేవారు. స్త్రీలకు చదువు లేకపోవడం వలన కలిగే ఇబ్బందులను గూర్చి కథల రూపంలో పత్రికలలో రాసేవారు. ఆ పత్రికలకు స్వయంగా స్త్రీలే సంపాదకత్వం వహించేవారు.

ఇందుకుగానూ ప్రజలు, ప్రభుత్వం కృషి చేయాలి. అప్పుడే స్త్రీ విద్యావిధానం అనేది సక్రమంగా జరుగుతుంది. సమాజం తద్వారా దేశం ప్రగతిపథంలో నడుస్తుంది.

**శ్రీమతి జి.రేణుక**

కృషి, పట్టుదల, సాధించాలనే తపనతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతుంది. అనేక అంశాలలో దూర దృష్టితో వ్యవహరిస్తుంది. బంగారు తెలంగాణ కోసం ఒకొక్క అడుగును అత్యంత జాగ్రత్తగా వేస్తుంది. తెలంగాణను దేశంలోనే అదర్శవంతమైన, దార్శనికత కలిగిన అభ్యుదయ రాష్ట్రంగా అగ్రగామిగా నిలిపేందుకు వ్యూహాత్యకంగా, ఆచరణాత్మకమైన కార్యాచరణతో ముందుకు సాగుతుంది. పోగొట్టుకుంది సాధించడం, అభ్యుదయ పథంలో అదర్శవంతమైన అభివృద్ధిని బయటి ప్రపంచానికి చాటడం లక్ష్యంగా అడుగులు వేస్తోంది. నీళ్లు, నియామకాలు, నిధులు ప్రధాన ఎజెండాగా కార్యాచరణ అమలవుతుంది. సమస్యలకు శాశ్వత పరిష్కారం కనుకొనే సంబంధించి మహారాష్ట్రతో ఒప్పందం చేసుకుంది. ప్రాజెక్టులకు రీ డిజైన్ చేసి తెలంగాణ జలదృశ్యం అపూర్వంగా చూపించింది. ప్రాజెక్టుల నిర్మాణాలకు అధిక నిధులిచ్చి పనుల్లో వేగం పెంచింది. మహబూబ్ నగర్ జిల్లాలో ఇప్పటికే సాగునీరు అందిస్తోంది. మరో అడుగు ముందుకేసి మిషన్ కాకతీయ పనులను సాహసోపేతంగా అమలు చేస్తుంది. ఈ పథకం పనులు విజయవంతంగా ముందుకు సాగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలతో అనేక చెరువులకు జలకల వచ్చింది. మిషన్ భగీరథ మరో సాహసోపేత పథకం. ఇంటింటికి నల్లా నీరిచ్చే ఈ పథకాన్ని ప్రధాన మంత్రి మెచ్చుకోవడం హర్షించదగిన పరిణామం. చీకట్లను పారదోలడంలో తెలంగాణ ప్రభుత్వం విజయం

# వడివడిగా అడుగులు...
# ఉద్యమ స్ఫూర్తితో పరుగులు




పద్దతుల్లో దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకుంటుంది. పరిపాలన సరళతరం చేయడానికి చర్యలు చేపట్టింది. రైతే రాజు అనే నానుడిని నిజం చేయడానికి కంకణం కట్టుకుంది. యువతకు మేరుగైన భవిష్యత్ అందించడానికి మార్గాలు వేస్తుంది. విద్య, ఉపాధి రంగాల్లో సమూలమైన మార్పులకు నాంది పలికింది. సంక్షేమ రంగంలో వినూతన మార్పులు తీసుకొచ్చింది. పారదర్శకతకు పెద్దపీట వేస్తుంది. అనేక రంగాల్లో సంచనాలు సృష్టించడం, అసాధ్యాలనుకున్న వాటిని సుసాధ్యం చేయడం తెలంగాణలో సర్వసాధారణ పరిపాలన ప్రక్రియగానే మారిపోయింది. పాలనలో హడావుడి, ఆర్భాటాలు లేవు. ఎవరి పని వారు నిబద్దతతో చేసుకుంటూ పోవడం, లక్ష్యాలు సాధించే దిశగా వేగవంతమైన, ఆచరణాత్మక కార్యాచరణ అమలు జరపడం పాలకుల నైజం అనే సూక్తికి కేసీఆర్ పాలన దర్పణంగా నిలిచింది. అవగాహన, అధ్యయనం, పరిశీలన అనంతరం మేధాశక్తితో అనేక జఠిలమైన అంశాలకు ప్రభుత్వం పరిష్కారాలు చూపుతోంది. మన ఉద్యోగాలు మనవారికే ఇచ్చే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించింది. కృష్ణా, గోదావరి నదీ జలాల వినియోగానికి సాధించింది. కోతలు లేని విద్యుత్‌ను అందించగలుగుతుంది. రైతులకు అవసరమైన మేరకు ఉచితంగా విద్యుత్ ను సరఫరా చేయడంలో కూడా సఫలీకృతమయింది. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అనేక పథకాలను అందిస్తోంది. అందులో మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, హరిత హారం, గ్రామ జ్యోతి, టీఎస్ ఐపాస్, టీ హబ్, నిరంతర విద్యుత్, స్వచ్ఛ తెలంగాణ, ఆసరా, సన్న బియ్యంతో వసతి గృహాల విద్యార్థులకు అన్నం, రూపాయికే కిలో బియ్యం, రైతు రుణ మాఫీ, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, షీ టీమ్స్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అందులో కొన్ని అద్భుతమైన పథకాలుగా పేర్కొనబడినవి. పేద బడుగు వర్గాల ప్రజలందరి కోసం ఎన్నో సంక్షేమ పథకాలతో పాటుగా, రాష్ట్రాభివృద్ధికి మరెన్నో ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నాం. సంక్షేమ పథకాల ఫలితాలు రాష్ట్రం నలుదిక్కులా చేరుతుండటంతో తెలంగాణ ప్రజలంతా సంతోషంగా జీవిస్తున్నారు. మన పథకాలను ఆదర్శంగా తీసుకొని ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో పథకాలను రచించుకుంటున్నాయి. జాతీయ స్థాయిలో మన పథకాలకు ఎన్నో అవార్డులు వచ్చాయి. బంగారు



తెలంగాణ సాధనకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. రండి, చేయి చేయి కలుపుదాం, తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడదాం అని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ఇచ్చిన పిలుపునకు అనేక మంది స్పందించారు. దేశ విదేశాల నుండి ఈ పిలుపునకు మంచి స్పందన వచ్చింది. అనేక జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. సంక్షేమానికి పెద్దపీట వేయడంతో పాటుగా అభివృద్ధికి రాచబాల వేయడంతో తెలంగాణ అన్ని రంగాల్లో దూసుకుపోతుందని ఇటీవల అనేక సంస్థలు నిర్వహించిన సర్వేలు వెల్లడించడం గమనార్హం. తెరాస అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని మూడవ సంవత్సరంలో వడివడిగా అడుగులు వేస్తూ తన ప్రాధాన్యతలను మరో సారి తెలంగాణ ప్రజలకు వివరించింది. బీడు భూములను సాగులోకి తెచ్చేందుకు సాగునీటి రంగం పై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడం జరిగిందని పునరుద్ఘాటించింది. ఇంటింటికి నల్లాల ద్వారా మంచినీరందించడం మరో ప్రాధాన్యత అంశమని తెలిపింది. ఊరూరా చెరువులను పూడిక తీసి జలకల తేవడానికి మరో ప్రయత్నం సాగించడం జరుగుతుందని వెల్లడించింది. అవకాశం ఉన్నంత మేరకు ప్రభుత్వంలో తెలంగాణ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడంతో పాటుగా అంతకు మించిన ఉద్యోగావకాశాలను ప్రైవేటు రంగంలో కలిపించడానికి తీసుకుంటున్న చర్యలను పేర్కొంది. పేదల అభ్యున్నతికి అమలు జరుపుతున్న పథకాలను మరింత పారదర్శకంగా అర్హులకు చేర్చేందుకు వీలుగా విధానాల్లో మార్పులలు తీసుకురావడం జరుగుతుందని వివరించింది. పరిపాలన ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కొత్త జిల్లాలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ మేరకు పరిపాలనాపరమైన చర్యలు కొనసాగుతునే ఉన్నాయి. తెలంగాణలోని 8,778 గ్రామ పంచాయతీలకు ఆర్థిక పుష్టి కలిగించేందుకు వీలుగా ప్రణాళికలు రచిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యూహాలతో పాటుగా ప్రజలకు తక్షణం ఫలితాలనిచ్చే ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ మాదిరి సంక్షేమ పథకాలకు కూడా ప్రభుత్వం పదును పెట్టింది. తెలంగాణ నుండి పేదరికాన్ని తరిమికొడతామని ముఖ్యమంత్రి ప్రకటించి ఆ మేరకు దీర్ఘకాలిక చర్యలకు పదును పెడుతున్నారు. తెలంగాణ ధనిక రాష్ట్రం అయినప్పటికీ 62 శాతం వరకు పేదరికం ఉందని భావించి ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. దశాబ్దాలకు పైగా ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా ఉద్యమాన్ని నడిపిన ఓపిక కేసీఆర్ లో ఉందనే అందరికీ తెలిసిందే. పరిస్థితిని అనుకూలంగా మలుచుకొనే వ్యూహంలోనూ ఆయన దిట్టేనని అనేక పరిణామాలు రుజువు చేశాయి. ప్రచార పటోటాలు కాకుండా నిజమైన అభివృద్ధి వైపు తెలంగాణను నడిపించే నేర్పుకు కూడా కేసీఆర్ లో కొదవేమి లేదని రుజువైంది. ఆయన పై నమ్మకంతో





తెలంగాణ ప్రజలు అనేక ఆశలు పెట్టుకున్నారు. స్వపరిపాలనను సుపరిపాలనగా మార్చుకుంటున్నామని కేసీఆర్ ఇప్పటికే ప్రకటించారు. దీనికి పారదర్శకతను జోడించే ప్రయత్నం కూడా జరుగుతుంది. సరైన దిశలో ఫలితాలు సాధించడానికి ముఖ్యమంత్రి తనదైన శైలిలో పరిపాలనతో ముందడుగు వేస్తున్నారు. ప్రత్యేక తెలంగాణతోనే తమ జీవితాలు బాగుపడుతాయని నమ్మి, దశాబ్దాల పాటు పోరు సాగించిన ప్రజానీకానికి నిజమైన మేలు జరగాలనే ఆకాంక్షతో ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు సాగుతున్నారు. ఆయన ఆలోచనలన్నీ కూడా పోరాడి సాధించుకున్న స్వరాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా తీర్చిదిద్దడం చుట్టే తిరుగుతున్నాయి. బాలారిష్టాలను అధిగమించి అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్న తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ రంగాలను పరుగులు పెట్టించడంలో పాలకులు నిమగ్నమయ్యారు. నిర్మాణాత్మక విధానాలతో సమగ్ర ప్రగతి సాధించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ప్రజావసరాలను వాస్తవ దృక్పథంతో తెలుసుకొని దానికి అనుగుణంగా పాలన సాగించాలని భావించిన ముఖ్యమంత్రి విజన్ రాబోవు కాలంలో మరింతగా ప్రగతికి బాటలు వేసేదిగా సాగుతోంది.

**శంకర్ పంతంగి**

Printed & Published by: Anita Ramachandran, Chief Executive Officer, on behalf of TSIPARD, Printed at Navatelangana Printers Pvt.Ltd. M.H.Bhavan, Near RTC Kalayanamandapam, Hyderabd.-20. Published at TSIPARD, Rajendranagar, Hyderabad- 500 030. Editor : Anita Ramachandran